ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా

సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

సంపుటి 8 - సంచిక 8
**డిసెంబర్ 2007**
సర్వజిత్ కార్తీకం-మార్గశిరం
విడిప్రతి రూ॥ 8.00
సం॥ చందా రూ॥ 90
3 సం॥ చందా రూ॥ 250
10 సం॥ చందా రూ॥ 750
శాశ్వత చందా రూ॥ 1800

Please send drafts in favour of
SRI VEDAMATA GAYATRI TRUST BUSINESS DIVISION, HYDERABAD

సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్వినీ సుబ్బారావు
040-23700722

## జీవన సాధనకు ఒరవడి

పరమపూజ్య గురుదేవుల సాధక జీవితంలోని ప్రతి కోణం ప్రేరణను ఇస్తుంది. శిష్యులుగా, సాధకులుగా వారి జీవిత చరిత్ర అందరికీ పఠనీయం, మననీయం, అనుకరణీయం. తమ అఖండ ప్రజ్ఞనూ, పరిపూర్ణ శ్రద్ధనూ, అచంచల నిష్ఠనూ సాధనకు అంకితం చేసిన మహా సాధకులు వారు.

గురు వాక్యం వారికి వేద వాక్యం. గురు నిష్ఠ వారి జీవితానికి పర్యాయ పదం. ఆహార నియమాలు కాని, ఆచార వ్యవహారాల సంస్కరణ కాని, తప సాధనలో అవక్ర పరాక్రమం కాని- జీవన సాధనలోని ప్రతి అడుగులో వారు స్థాపించిన రికార్డు సాధకులందరికీ ఒక ఒరవడి.

శిష్యుని పరిచయం అతని గురువే. తన శరీరం మాత్రమే అతడిది. లోపలి చేతన సద్గురువుదే. తపస్సు అనే దావాగ్ని జీవితంలో నిండినపుడే ఇదంతా జరుగుతుంది. జీవితం సాగుతూన్నకొలదీ తపోజ్వాల తీవ్రతరం అవుతూ ఉండాలి. గురుదేవుల సాధక జీవనం ఇందుకు పరమ ప్రమాణం.

## హైదరాబాదులో దక్షిణ జోన్ కార్యకర్తల సమ్మేళనం

గాయత్రీ పరివార్ దక్షిణ భారత జోన్ కార్యకర్తల బృహత్ సమ్మేళనం (వర్క్‌షాప్) హైదరాబాదులో డిసెంబరు 22,23,24 తేదీలలో జరుగుతుంది. గాయత్రీ పరివార్ ప్రముఖ్ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ, శాంతికుంజ్ వ్యవస్థాపక్ శ్రీ గౌరీశంకర శర్మ, మహా మేధావి శ్రీ వీరేశ్వర ఉపాధ్యాయ, జోనల్ ప్రముఖ్ శ్రీ కాళీచరణ్ శర్మ, దక్షిణ భారత జోన్ ప్రముఖ్ డాక్టర్ బ్రిజ్‌మోహన్, ఇతర వరిష్ఠ ప్రజ్ఞాపుత్రులు సమ్మేళనంలో కార్యకర్తలకు మార్గదర్శనం చేస్తారు. సమ్మేళనంలో కార్యకర్తలకు డాక్టర్ ప్రణవ్ పండ్యాజీని వ్యక్తిగతంగా కలుసుకునే అవకాశం ఉంటుంది.

సమ్మేళన సన్నాహాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకై డాక్టర్ బ్రిజ్‌మోహన్ నవంబరు 15 న హైదరాబాదు విచ్చేశారు.

ఆత్మ నిర్మాణమే సాధన.

జీవన సాధనలో వారు అతి దుర్లభ కార్యాలను, ఆశ్చర్యకర కార్యాలను చేసి చూపారు. మహాయోగులకూ, సిద్ధ పురుషులకూ సైతం అసాధ్యములైన మహాశక్తులను ఆర్జించారు. వాటిని పాత్రత కలిగిన వ్యక్తులకు రెండు చేతులా ధారపోశారు.

సాధకులుగా వారి జీవితం ప్రచండంగా, తీక్షణంగా, పరాక్రమశోభితంగా ఉంది. సిద్ధ పురుషులుగా వారు కరుణామయులు, భక్తవత్సలులు, దయాసముద్రులు. శిష్యుల కన్నీళ్లను తుడవడానికై తమను తాము అర్పించుకున్న మహాసిద్ధులు వారు. శిష్యులు అనుభూతి పొందగలిగితే- వారి ఆ స్థితి ఈ క్షణంలోనూ ఉంది. వారి శరీరం అదృశ్యం అయింది. అయినా- వారి పరచేతన శిష్యుల జీవితాలలో కణ కణంలో ఉన్నది.

ఒక సందర్భంలో గురుదేవులు ఇలా వాగ్దానం చేశారు-

"సాహసి, వివేకి అయిన సఫల వ్యక్తిగా మిమ్మల్ని మీరు మలచుకోవడానికీ, తీర్చిదిద్దుకోవడానికీ, సవరించుకోవడానికీ, అనుభూతిపొందడానికీ ప్రయత్నించండి. వినమ్రత మీ గుర్తు కావాలి. వసంత తపస్సు సందేశంలా మీ శీలం సుగంధ భరితం కావాలి. అపారమైన ధైర్యంతోపాటు మీలో నిరంతరం శ్రమించే సామర్థ్యం ఉండాలి. పూర్తిగా ప్రయత్నిస్తూన్నప్పటికీ ఏదైనా ఆటంకం ఎదురైతే, వైఫల్యం తటస్థిస్తే - ఏమాత్రం చలించకండి. ధైర్యం కోల్పోకండి. ఆ స్థితిలో - వేయి రెట్లు సాహసంతో సాధనా పథంలో పురోగమించండి. వైఫల్యం క్షణికం. అంతిమ సాఫల్యం నిశ్చయం. జీవన సాధనలోని చరమ స్థితిపై మీకే, కేవలం మీకే అధికారం ఉన్నది. తప్పనిసరిగా జరిగే ఆ పరిణామాన్ని ఎవ్వరూ ఆపలేరు.

"ఎందుకంటే- నిన్ను ఆ శిఖరాగ్రానికి చేర్చే బాధ్యత నాదే."

గురుదేవులు చేసిన ఈ వాగ్దానం శిష్య- సాధకులకు వేయి ఏనుగుల బలం ఇచ్చే దివ్య ఔషధం.

ఆ బలంతో జీవన సాధనను తీవ్రతరం చేయడం శిష్య-సాధకుల కర్తవ్యం.

★★★

**పాఠక బంధువులకు ఆహ్వానం**

***ఈ ప్రత్యేక సంచికపై తమ అమూల్య అభిప్రాయాలను పంపవలసిందిగా పాఠకబంధువులందరినీ ఆహ్వానిస్తున్నాం.***

# విషయ సూచిక


ముఖచిత్రం : పరమపూజ్య గురుదేవులు

1. **సంపాదకీయం:** జీవన సాధనకు ఒరవడి 1
2. **విషయ సూచిక** 2
3. **జీవన సాధనకు పావన ప్రేరణ :** శ్రీపాద శిలపై స్వామీజీ సంకల్పం 3

**పరమపూజ్య గురుదేవుల జీవన సాధన**

4. **గురుదేవుల అమృత లేఖిని :** నా జీవన సాధన-లోవెలుగులు 5
5. **గురుదేవుల అమృత వాణి :** సాధన ద్వారా సిద్ధి : నా అనుభవ సారం 12
6. **గురుదేవుల అమృత వాణి :** జీవన సాధనకు మూల సూత్రాలు 15

**ప్రతి ఒక్కరికీ జీవన సాధన**

7. **జీవన సాధనకు పావన ప్రేరణ :** సాంస్కృతిక దిగ్విజయానికి శ్రీకారం 17
8. **అధికారపు అహంకారం వేరు, నాయకత్వం వేరు** 19
9. **సంకల్ప శక్తిలో ఇమిడి ఉంది ఆధ్యాత్మిక ప్రగతి** 20
10. **సాధన సాఫల్యం సజల సంవేదనలో** 21
11. **ఉత్కృష్టతకు ఊపిరి ఆదర్శవాదం** 22

**ప్రజాసేవకులకు జీవన సాధన**

12. **జీవన సాధనకు పావన ప్రేరణ :** ఋషిత్వాన్ని ప్రసాదించిన పంచాగ్ని విద్య 23
13. **ప్రజాసేవకులకు విషతుల్యం-అహంకారం** 25
14. **వినమ్రతలో ఉంది ప్రజాసేవకుని విలువ** 27
15. **నిరాడంబరత్వం ద్వారా ప్రజలతో సాన్నిహిత్యం** 28
16. **సమాజ ఋణాన్ని తీర్చుకోవడానికే సేవ** 29
17. **జీవన సాధనలో సుడిగుండాలు** 31
18. **కత్తిమీద సాము-సేవా సాధన** 32

**ప్రజ్ఞా పరిజనులకు జీవన సాధన**

19. **జీవన సాధనకు పావన ప్రేరణ :** సమాజ పరమేశ్వరుని సేవలో....... 34
20. **గురుదేవుల అమృత వాణి:** కార్యకర్తలే నా అవయవాలు 35
21. **ప్రజా పరిజనులకు ఏడు నియమాలు** 37
22. వార్తలు 45


సాధనకు సోపానాలు- ఉపాసన, ఆత్మసంస్కరణ, పరమార్థం.

జీవన సాధనకు పావన ప్రేరణ

# శ్రీపాద శిలపై స్వామీజీ సంకల్పం

పరివ్రాజకులు స్వామి వివేకానంద దేశంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. సంప్రదాయాలూ, ఆచారాలూ తలక్రిందు లైనాయి, వికృతం అయినాయి. భారత వర్షపు ఆత్మ ఈ వికృతుల బరువుతో క్రుంగి కృశించిపోతోంది. ఈ దుస్థితిని చక్కదిద్దే పని మత రంగానిది. మరి మతం లోపించి పోయిందా? మతం అనే సంజీవనితో నవజీవనాన్ని ప్రదానంచేసే పరివ్రాజకులూ, సన్యాసులూ నశించిపోయారా?

ఇలా ఆలోచిస్తూ ఆయన దక్షిణ భారతంలో కాలినడకన పర్యటిస్తున్నారు. త్రోవలో ఒక మఠం కనపడింది. సాధువులు వస్తూపోతూ ఉన్నారు. ఆయన మఠంలోపలికి వెళ్లారు. అక్కడ కొందరు స్వాధ్యాయం చేస్తున్నారు. ఏమి చదువుతున్నారు- అని ఆయన వారిని అడిగారు. "ఉపనిషత్తులు"- అని జవాబు వచ్చింది.

"ఈ జ్ఞానాన్ని జీవితంలో ఆచరణలో పెట్టడానికి మీరు ఏయే కర్మలు చేస్తున్నారు?"- అని ఆయన తిరిగి అడిగారు.

"కర్మ ! కర్మల జంజాటంలో మేము ఎందుకు ఇరుక్కోవాలి? దానివల్ల మాకు ప్రయోజనం ఏమిటి?"

"కానీ- వంద సంవత్సరాలు సమర్థంగా జీవించాలనీ, నిరంతరం కర్మలో నిమగ్నం కావాలనీ ఈశావాస్య ఉపనిషత్తు చెపుతోంది కదా ! మీరు దాన్ని చదవలేదా?"

జవాబు రాలేదు.

"అన్న వస్త్రాల అవసరాలు ఎలా తీరుతున్నాయి? మీకు?"

"ఈమాత్రం తెలియదా? ఆ పని గృహస్థులది. వారే మా అవసరాలను తీర్చుతారు."

"అందుకు ప్రతిఫలంగా మీరు వారికి ఏమి ఇస్తున్నారు?"

"అసలు ఇచ్చి పుచ్చుకోవడాలతో మాకేమి సంబంధం?"

స్వామి వివేకానంద మరో సాధువుల నివాసానికి వెళ్లారు. పాలరాతి గచ్చు. విశాలమైన గదులు. పరుపులూ, పట్టెమంచాలూ. ఇవన్నీ చూచి ఆయన అక్కడ ఉన్న ఒక సాధువును ఇలా అడిగారు-

"మహాశయా ! మీరు ఎపుడయినా కార్మికుల వాడలను చూచారా?"

"చూచాము. ఇపుడే ఆ వాడల మీదుగా రావలసి వచ్చింది. అంతా కంపు. దుమ్మూ ధూళీ. ఒక్క క్షణమైనా అక్కడ నిలువలేకపోయాము."

"ఎప్పుడైనా వాళ్ల ఇళ్ల నుండి కూడ భిక్ష తీసుకున్నారా?"

"అసలు వారి దగ్గర ఏమైనా ఉంటేకదా ఇవ్వడానికి."

"ఆ ప్రజల బాధనూ, పేదరికాన్నీ తొలగించాలని మీకు ఎప్పుడయినా అనిపించిందా?"

"సంసారపు మాయాజాలంలో చిక్కుకున్న ఈ జీవులు తమ తమ పాపాలకు శిక్ష అనుభవిస్తున్నారు. వారలా అనుభవించడమే మంచిది."

"ఏమిటి? ఇదే సన్యాసమా? మానవ సేవకై స్వీకరించబడిన పవిత్ర వ్రతం ఇంతగా భ్రష్టం అయిందా! సాహసవంతులుగా, సేవా వ్రతులుగా, సృజన సైనికులుగా, అనుశాసనబద్ధులుగా ఉండవలసిన ఈ వ్రతశీలుర సముదాయం ఇలా మూఢుల, అకర్మణ్యుల, విలాసప్రియుల గుంపుగా తయారయిందేమిటి?"- అని స్వామీజీ ఉద్విగ్నులు అయినారు. ఆయన మనస్సు ఉడికిపోతోంది.

అలా తిరుగుతూ తిరుగుతూ ఆయన కన్యాకుమారి చేరారు. అర్ధరాత్రి. ఎగసిపడుతూన్న సముద్ర తరంగాలు. ఆయన ఆ తరంగాలను చీల్చుతూ ఒక విశాలమైన శిల వద్దకు చేరారు. ఆదిశక్తి నవసృజన కోసమై తపస్సు

**సాధన అనే ఎరువుతో, నీళ్లతో తడిపినప్పుడే ఉపాసన ఫలిస్తుంది.**

చేసిన స్థలం అది. ఆమె పుత్రుడే ఇపుడు సమాజం యొక్క నవసృజన కోసమై ధ్యానంలో మునిగిపోయాడు.

ఆయన మాటలలోనే-

"పరమేశ్వరుణ్ణి కాక, భారతవర్షపు ఆత్మను ధ్యానించాను. సమాజంలోని కోట్లాది మనుష్యులను ధ్యానించాను.

"ఆ ధ్యానంలో నుండి నాలో నవ సంకల్పం పెల్లుబికింది - పరివ్రాజకుల సంప్రదాయాన్ని తిరిగి నెలకొల్పవలసి ఉంది. సుశిక్షితులూ, అనుశాసన బద్ధులూ, కర్మ వీరులూ అయిన వ్యక్తుల దళం నిర్మాణం కావాలి. వారు పల్లె పల్లెకూ వెళ్లాలి. ఇంటింటికీ వెళ్లి ప్రజలను మేలుకొలపాలి. ఆ వ్యక్తుల స్వరాలలో మానవతా కర్తవ్యం ప్రతిబింబించాలి. వారు నవ భారత నిర్మాణానికి అంకితం కావాలి. అలా ఒక నవ భారతం ఉదయించాలి. నాగలి పుచ్చుకుని. రైతు కుటుంబాలనుండి. కుమ్మరుల, కమ్మరుల, మత్స్యకారుల, మాల మాదిగల గుడిసెల నుండి. దుకాణాల నుండి. కార్ఖానాల నుండి. గిరులనుండి. వనాలనుండి వెలువడిన మానవ కళేబరాలు దర్శనమిస్తున్నాయి. ఇదీ మన ముందున్న నవ భారతం ! వీరిని సంస్కరించడం ద్వారా, వీరికి సేవచేయడం ద్వారా పాపాలన్నింటికీ ప్రాయశ్చిత్తం జరుగుతుంది."

కన్యాకుమారిలోని శిలపై ఆయన చేసిన సంకల్పం రామకృష్ణ మఠంగా రూపుదిద్దుకున్నది. జీవుడిని శివుడుగా పరిగణించి అతడి సేవకు అంకితమయే సృజన సేన నిర్మాణం అయింది. వ్రతధారులూ, కర్మవీరులూ అయిన వ్యక్తులతో నిర్మాణమయింది ఆ సేన. సన్యాసం యొక్క నిజమైన స్వరూపం వెలికివచ్చింది. సేవ అందుకోవడానికి కాక సేవ అందించడానికే సన్యాసం ఉన్నదని చూపడానికి. జ్ఞానాన్ని సంపాదించి, ఇంటింటికీ వెళ్లి దాన్ని పంచడానికి. ఈ మహా కార్యంలో కష్టాలు ఎదురయినా, ఆకలితో ఉండవలసివచ్చినా, అవమానాలను భరించవలసివచ్చినా- వాటిని ఆనందంగా స్వీకరించడానికి.

సమాజానికి కాయకల్ప చికిత్స అలాంటి ఆలోచనా విధానం ఆధారంగానే సాధ్యపడుతుంది. మానవాళిని ఆరాధించే సన్యాసులు - వానప్రస్థులు - పరివ్రాజకులు- సమయ దాతలు - సమాజ సేవకులు అందుకు ఉద్యమించాలి. ధర్మ - అధ్యాత్మలను ప్రగతిశీలంగా మలచి, వాటికి కొత్త ఊపిరి పోయాలి.

ఇదే నిజమైన పరివ్రాజకత్వం. ఇదే నిజమైన సన్యాస ధర్మం. మానవ జీవనం ఈ భావ గంగలో స్నానం చేయాలి. సామాజిక కర్తవ్య నిర్వహణకు అంకితం కావాలి. యుగావసరం ఇది. స్వంత మోక్షం కోసం కాక- విశ్వహితం కోసం కార్యశూరత జీవితానికి ధ్యేయం కావాలి.

స్వామి వివేకానంద ఆనాడు శ్రీపాద శిలపై చేసిన దివ్య సంకల్పం ఆచరణ రూపాన్ని ధరించాలి.

★★★

## సిద్ధాంత నిష్ఠ+వ్యవహార దక్షత

*గాంధీజీ ఇంగ్లాండులో చదువుతూన్న రోజులలో తోటి విద్యార్థులు ఆయనను విందుకు ఆహ్వానించారు. విందులో మాంసపు కూరలు వడ్డించబోగా, గాంధీజీ వద్దన్నారు. మాంసం ఆరోగ్యాన్ని పెంచుతుందని డాక్టర్లు చెపుతున్నారనీ, దాన్ని తినడంవల్ల నష్టమేమీ జరగదనీ విద్యార్థులు ఆయనకు నచ్చజెప్పసాగారు.*

*"మాంసాహారం తీసుకొనకపోవడం నా వ్రతం"- అని గాంధీజీ వివరించారు. "ప్రయోజనకరమైన పనులను అడ్డుకునే వ్రతంవల్ల ఉపయోగం ఏమిటి?"- అని మిత్రులు ప్రశ్నించారు. గాంధీజీ ఒకే వాక్యంలో ఆ వివాదాన్ని ఇలా ముగించారు-*

*"వ్రతం అవసరమా కాదా అనే విషయాన్ని నేను చర్చించదలచుకోలేదు. మాంసాన్నీ, మద్యాన్నీ ముట్టుకోనని నేను మా అమ్మగారికి మాట ఇచ్చాను. ఆ మాటను నిలబెట్టుకోవడమే నాకు ముఖ్యం."*

*మిత్రులు మౌనం వహించారు. ఇలా గాంధీజీ తన సిద్ధాంతంపట్ల దృఢంగా నిలిచారు. మిత్రులతో వాదానికి దిగి వైమనస్యాన్ని సృష్టించకుండా- వ్యవహార దక్షతను కూడ చూపారు.*

**సాధనలో సాఫల్యానికి కీలకం- నియయపాలన.**

గురుదేవుల అమృత లేఖిని

# నా జీవన సాధన-లోవెలుగులు

*(1971 జనవరిలో వ్రాసిన వ్యాసం)*

## ఆత్మక్షాళన కోసమే మా సాధన

మా 60 సంవత్సరాల జీవితంలో 15 సంవత్సరాల బాల్యం అంత ప్రధానమైనది కాదు. మిగతా 45 సంవత్సరాలలో మేము ఆధ్యాత్మికతను మా జీవితంలో రంగరించాము. ఆ సాధనలో పూజా, ఉపాసనలు అతి కొద్ది భాగం మాత్రమే. 24 సంవత్సరాలపాటు రోజుకు ఆరు గంటలు గాయత్రీ ఉపాసన జరిపాము. అయితే, మానసిక సంస్కరణకూ, భావనాత్మక ఉత్కృష్టతను పెంచుకోవడానికీ జరిగిన ప్రయత్నాలు మరింత ప్రముఖమైనవి. ఆలోచనా విధానాన్నీ, కార్య పద్ధతినీ సంస్కరించుకొనకపోతే- ఉపాసనలోని కర్మకాండ నిరర్థకం అయేది. పూజా పురస్కారాలకు పరిమితమైన మంత్ర తంత్రాల పడుగు పేకలను నేస్తూవచ్చినవారు వట్టి చేతులతో మిగిలిపోయారు. నా పరిస్థితి అలా తయారయేది. మా జీవన సాధన సఫలమయిందని భావిస్తే, దానిలో కనిపించే అలౌకికతను వెదికితే- దానికి ప్రముఖ కారణం మా అంతరంగ, బహిరంగ స్థితులు సంస్కరించబడడమే అని అంగీకరించాలి.

ఆత్మకథలోని ఒక భాగాన్ని వ్రాసే సాహసం చేస్తూ, మేము ఒకేఒక వాస్తవాన్ని ప్రతిపాదిస్తున్నాము. **మా మానసిక ఏకాగ్రత, మా పురుషార్థం, మా కార్యశూరత అంతా ఆత్మ క్షాళనలో వినియోగించబడింది.** ఉపాసనను కూడ భావ క్షాళన ప్రయత్నాలతో పూర్తిగా ముడిపెట్టాము. ఇక మా సాధన వివరాలను పాఠకులకు అందిస్తున్నాము-

## మనసుపై అదుపు

సాధనాత్మక జీవితానికి మూడు మెట్లు ఉన్నాయి. మూడింటినీ ఎక్కి ఒక సుదీర్ఘ యాత్రను పూర్తిచేశాను. మాతృవత్ పరదారేషు పరద్రవ్యేషు లోష్ఠవత్ (ఇతరుల భార్యలను మాతలుగా పరిగణించడం, ఇతరుల సంపదను తృణప్రాయంగా పరిగణించడం)- అనే మజిలీ తేలికయినదే. అది తనకు సంబంధించినది. పోరాడవలసింది తనతో. సంబాళించవలసింది తన ఇంటిని. పూర్వ జన్మ సంస్కారాలవల్ల, సమర్థ గురువు సహాయంవల్ల ఆ పని సులువుగా జరిగింది. చెడు దారిలోకి లాగికొనివెళ్లేటంత పట్టుదల, దుష్టత నా మనస్సుకు లేవు. ఇటూ అటూ వెళ్లాలని మనస్సు ఎప్పుడయినా ఆలోచించేది. అయితే, ప్రతిఘటన అనే కర్ర తలపై పడేసరికి- అది వెనుకకుతగ్గింది. మారుమాట లేకుండా దారికివచ్చింది. మనస్సుతో పోరాడుతూ, పాపంనుండీ పతనంనుండీ నన్ను కాపాడుకున్నాను. ఇప్పుడా ప్రమాదాలన్నీ తప్పిపోయాయి. సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను. ఇందుకు పరమాత్మకు అనేక ధన్యవాదాలు.

## శరీరాన్నీ నన్నూ వేరుచేశాను

అధ్యాత్మలోని కర్మకాండ పెద్ద కష్టం కాదు. సంకల్ప బలం దృఢంగా ఉంటే, శ్రద్ధా నిష్ఠా పుష్కలం, ఉంటే- మనస్సు ఉద్విగ్నం కాదు. మనస్సు ప్రశాంతం ఏకాగ్రం అవుతుంది. ఉపాసన సజావుగా సాగుతుంది. మామూలు దుకాణదారు ఒకే దుకాణంలో, ఒకే పద్ధతిలో జీవితమంతా కులాసాగా గడుపుతాడు. అతడికి విసుగు రాదు. అతడి ఆసక్తి తగ్గదు. కిళ్లీ, సిగరెట్ల బడ్డీకొట్టు నడిపేవాడు రోజుకు 12-14 గంటలు తన వృత్తిని ఉత్సాహంగా, ప్రశాంతంగా జీవితమంతా నిర్వహిస్తాడు. రోజుకు 6-7 గంటలపాటు గాయత్రీ సాధన 24 సంవత్సరాలపాటు నిర్వహించాలనే సంకల్పాన్ని వదులుకునే అవసరం మాకు ఏముంది? కిళ్లీ-బీడీ కన్న, పొలం పనుల కన్న, మిఠాయి అమ్మకంకన్న ఉపాసన యొక్క అవసరం తక్కువ అనీ, దాని లాభం తక్కువ అనీ భావించినప్పుడే మనస్సు విసుగుచెందుతుంది. పనికిరాని, ఆసక్తిలేని పనులలో మనస్సు లగ్నం కాదు.

భౌతికమైన సుఖ సౌకర్యాలే సర్వస్వం అని లోలోపల భావించే వ్యక్తియే ఉపాసనపట్ల విసుగు చెందుతాడు, ఆసక్తి కోల్పోతాడు. పూజ ద్వారా కోరికలు

**సరిపెట్టుకునే స్థితినుండి సరిదిద్దుకునే దివ్య స్థితిని చేరడమే సాధన.**

తీర్చుకోవాలని అనుకునే వాడే- ప్రారబ్ధం వల్ల, పురుషార్థ లోపంవల్ల కోరిన వరం అందకపోతే మనస్తాపం చెందుతాడు.

ఈ పరిస్థితి ఇతరులకు వస్తుంది. కనుక మనస్సు నిలవడంలేదని వారు ఫిర్యాదుచేస్తారు. మా స్థాయి మరోవిధమైనది. శరీరాన్ని సాకుగా మాత్రమే పరిగణించాను. వస్తువులను బ్రతుకు కుంపటికి అవసరమయే బొగ్గులుగా పరిగణించాను. అత్యాశలూ, గొప్పవాణ్ణి కావాలనీ లేనిపోని పొగడ్తలు పొందాలనీ వాంఛలు ఎన్నడూ నాలో ఉదయించలేదు. 'నేను ఆత్మను. ఆత్మోన్నతి కోసం, ఆత్మకళ్యాణం కోసం, ఆత్మ శాంతి కోసం, ఆత్మ విస్తరణ కోసం ఎందుకు జీవించకూడదు'- అని ఆలోచిస్తూ ఉండేవాణ్ణి. శరీరాన్నీ, నన్నూ రెండు భాగాలుగా విడదీశాను. ఫలితంగా- అజ్ఞానపు అడ్డుగోడ కూలిపోయింది. కారు చీకటి కాంతి రేఖగా మారిపోయింది.

## భౌతిక ప్రలోభాలకు అతీతంగా...

తాము శరీరమే అని నిర్ణయించుకున్నవారు, ఇంద్రియ సంతృప్తికే తమ ఆనందాన్ని పరిమితం చేసుకున్నవారు, వాసనలనూ తృష్ణలనూ తీర్చుకోవడాన్నే జీవితాశయంగా చేసుకున్నవారు- డబ్బునూ, గొప్పతనాన్నీ, పొగడ్తనూ, పదవినీ పొందడమే సర్వస్వమని భావిస్తారు. వారు ఆత్మకళ్యాణం సంగతి మరుస్తారు. లోభ మోహాల బంగారు సంకెళ్లను ఆసక్తిగా తగిలించుకుంటారు. శ్రేయో మార్గంలో పయనించే సౌకర్యం తమకు కలుగలేదని వారు సాకులు చెపుతారు. అంతఃకరణలోని ఆకాంక్షలే సౌకర్యాలను సమకూర్చుతాయి. భౌతిక సుఖ సంపదలే లక్ష్యం అయినపుడు- చేతన చేసే కృషి అంతా వాటిమీదనే లగ్నం అవుతుంది. అపుడు ఉపాసన ఒక చిన్న ఆటగా మిగిలిపోతుంది. చేసినా మంచిదే, చేయకపోయినా మంచిదే- అనిపిస్తుంది. సాధారణంగా జనం ఉపాసన పట్ల కుతూహలపడతారు. దీని తమాషాకూడా కొంచం చూద్దాం; దీనివల్ల ఏదైనా అందుతుందో లేదో చూద్దాం- అని భావిస్తారు. కొద్దిసేపు అర్ధ మనస్కంగా, ఏదో అద్భుతం అందుతుందనే దృష్టితో వచ్చీరాని పద్ధతిలో పూజలు చేస్తారు. వాటిపై నమ్మకం కుదరదు. వాటిని వదిలివేస్తారు.

వాస్తవం ఏమంటే- శ్రద్ధా విశ్వాసాలు లోపించినప్పుడు, జీవన లక్ష్యాన్ని సాధించాలనే తీవ్ర నిష్ఠ లోపించినప్పుడు ఎవ్వరూ ఆత్మిక ప్రగతిని సాధించలేరు. ఈ వాస్తవాలన్నీ మాకు సహజంగానే తెలుసు. కనుక శరీర యాత్రకూ, కుటుంబ నిర్వహణకూ తప్పనిసరిగా అవసరం అయినంతమేరకే వాటిపై దృష్టిని ఉంచాము. యంత్రానికి అద్దె కట్టే దృష్టితో మాత్రమే ఆ ప్రయత్నాలు చేశాము. అంతఃకరణ లక్ష్య ప్రాప్తిపై పూర్తిగా లగ్నమయింది. కనుక- భౌతిక ప్రలోభనాలలో, ఆకర్షణలలో మునిగిపోయే అవసరం మాకు ఎన్నడూ రాలేదు.

## ఆత్మిక జీవనంలో ఆనందం

నేను ఆత్మననే అనుభవం బలపడింది. పరమేశ్వరుని పరమ పవిత్ర నివాస గృహంగా అంతఃకరణ కనిపించింది. ఫలితంగా- చిత్తం అంతర్ముఖం అయింది. పరమేశ్వరునికి యువరాజు అయిన ఆత్మ ఏమి చేయాలి, ఏ దిశలో పయనించాలి- అన్న అంశానికే పరిమితం అయింది ఆలోచనా విధానం. ప్రశ్న సూటి అయినది. సమాధానమూ సూటి అయినదే. ఉత్కృష్టమైన జీవితాన్నే గడపాలి. ఆదర్శవాదంతో కూడిన కార్యపద్ధతినే అనుసరించాలి. ఈ మార్గంలో పయనించనివారికి భయం కలుగుతుంది- ఈ పద్ధతిని అనుసరిస్తే ఆపదలు చుట్టుముట్టుతాయేమో అని; దారిద్ర్యాన్నీ, కొరతనూ, తిరస్కారాన్నీ, కష్టాలనూ భరించవలసివస్తుందేమో అని.

మేము కూడ ఎగతాళినీ, తిరస్కారాన్నీ భరించవలసి వచ్చింది. కుటుంబంలోనివారే మరిన్ని ఆటంకాలు కల్పించారు. మా సహాయంవల్ల అందే భౌతిక ప్రయోజనం అందకుండా పోయిందని వారు భావించారు. తమకు హానిగా పరిగణించిన దానిని నా మూర్ఖత్వంగా చిత్రించారు. అయితే ఇది ఎంతో కాలం సాగలేదు. మన శ్రద్ధ ఉన్నతంగా, దృఢంగా ఉంటే- కృతకమైన వ్యతిరేకత ఎక్కువ కాలం నిలువదు. పెడదారిపట్టినందువల్ల ఏర్పడే వ్యతిరేకతయే స్థిరంగా నిలుస్తుంది. ఋజువర్తనం దానికదిగా ఒక మహిమ.

సంస్కృతీ సభ్యతల సంగమ స్థలం - శిష్టాచారం.

అది తాను తరిస్తుంది, ఇతరులను తరింపజేస్తుంది. వ్యతిరేకులూ, నిందించేవారూ కొద్ది రోజులలోనే తమ పొరపాటును గుర్తిస్తారు. ఆటంకాలను కల్పించే బదులు సహకారాన్ని అందిస్తారు. శ్రద్ధ ఎంత ఉన్నతంగా, ఎంత బలీయంగా ఉంటే- వ్యతిరేకత అంత త్వరగా అనుకూలతగా మారుతుంది. కుటుంబంలోనివారి వ్యతిరేకతను ఎక్కువ సమయం భరించవలసిరాలేదు. వాస్తవాన్ని గుర్తించడంతో- వారి అనుమానాలు తొలగిపోయాయి.

ఆత్మిక జీవనంలో నష్టమనేది అసలు ఉండదు. బయటికి పేదవాడుగా కనిపించినా, ఆత్మశాంతి కారణంగా, సంతృప్తి కారణంగా అలాంటి వ్యక్తి ఎంతో ఆనందంగా ఉంటాడు. ఈ ఆనందమూ, ఈ సంతృప్తీ ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తుంది. వ్యతిరేకులను సహచరులుగా మార్చడంలో ఎంతో సహాయకారి అవుతుంది. మా ఇబ్బంది అలాగే తొలగిపోయింది.

కీర్తి, లోభ మోహాలు, పొగడ్తలు, తృష్ణల సంకెళ్లు తెగిపోగానే- బంధనాలనుండి విముక్తి లభించిందని అనిపించింది. ఈ సంకెళ్లలో బంధించబడిన వ్యక్తి భవ సాగరంలో గ్రుడ్డిగా ఈదృబడుతూ ఉంటాడు. అసంతృప్తి, ఉద్విగ్నతల వ్యధలతో వేదనలతో మూల్గుతూ ఉంటాడు. వీటిని తుచ్ఛమైనవిగా భావించాలి. కోరికను శ్రద్ధగా మార్చాలి. అప్పుడు మాయ అనే బంధనం తెగిపోతుంది. జీవన్ముక్తి లభిస్తుంది.

ఆత్మజ్ఞానం కలుగగానే- జీవన లక్ష్యాన్ని సాధించే అవసరం చేయి పుచ్చుకుని దారిచూపసాగింది. తర్వాత కొరతా లేదు, అసంతృప్తీ లేదు. శరీరాన్ని సజీవంగా ఉంచేందుకు సరిపోయే పరిమిత సాధనాలతో సంతృప్తిపడే శిక్షణ ద్వారా లోభ మోహాల వ్రేళ్లను మొదలంటా నరికివేశాను. మనస్సు ఆవైపునకు మళ్లడం మానివేస్తే- ఆనందమే ఆనందం. అపారమైన శక్తి అభిస్తుంది.

ఈ సత్యాన్ని ఎవరైనా అనుభూతి పొందవచ్చు. కానీ, జనం పెట్రోలుతో మంటను ఆర్పాలని చూస్తారు. తృష్ణను సంపదతో, వాసనను భోగంతో తృప్తిపరచాలని చూస్తారు. అలాంటి ప్రయత్నం దావానలాన్ని విజృంభింప జేస్తుందని వారికి నచ్చజెప్పేవా రెవరు? ఆ దారిలో ఎండమావులే ఎదురవుతాయి. స్మశానంలోని ప్రేత పిశాచాలవలె- ఉద్విగ్నులుగానే వారు మిగిలిపోతారు, చెడ్డ పనులే చేస్తారు. వీరికి ఎవరు ఎలా నచ్చజెప్పాలి?

## లోపలనుండి వచ్చింది వెలుగు

ఎన్నో సత్సంగాలలో పాల్గొన్నాను. ఎన్నో ప్రవచనాలు విన్నాను. అయినా, అధ్యాత్మ లోతులలోనికి వెళ్లడానికి అనుకరించే ప్రేరణ ఇచ్చే జ్ఞాని ఎవరూ దొరకలేదు. ప్రవచనం చేసేవారి జీవితాలు వినేవారి జీవితాలకన్న మలినంగా ఉన్నాయి. మనస్సు విరిగిపోయింది. సత్సంగాలలో, ప్రవచనాలలో పాల్గొనడానికి మనస్సు ఒప్పలేదు.

వెలుగు అందింది. నా లోపలనుండి అందింది. ఆత్మయే సాహసించింది. నలువైపులా చుట్టుముట్టి ఉన్న జంజాటాలను త్రెంపివేసే సాహసం చూపినప్పుడే పని జరిగింది. ఇతరుల సహాయం పొందే ప్రయత్నం చేసి ఉంటే- ఆ 'జ్ఞానులు' తమవలె నన్నుకూడ అజ్ఞానిగా చేసి ఉండేవారేమో. ఎవరికయినా వెలుగు అందాలంటే, లోపలనుండే అందాలి. కనీసం మా విషయంలో ఈ సత్యం ఋజువయింది. లక్ష్యంపట్ల అచంచలమైన శ్రద్ధ లేనిదే, శ్రేయో మార్గంలోనికి జీవితాన్ని మళ్లించే సాహసం లేనిదే- ఆత్మిక ప్రగతిలో ఎదురయే బాహ్య ఆటంకాల కొండను తొలగించలేము. కనుక. మా సాహసమే పనికివచ్చింది. గురుదేవులనుండి భగవానునివరకు అందరూ నిరంతరం సహాయపడుతూ వచ్చారు. ప్రగతి పథంలో నెమ్మది నెమ్మదిగా, అయితే దృఢంగా ముందడుగు వేస్తూ వచ్చాను.

## సురస రక్కసి నోరు-తృష్ణ

ఆధ్యాత్మిక జీవితం కష్టమని జనం అంటూ ఉంటారు. అయితే మా అనుభూతి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. వాసన, తృష్ణలతో నిండిన జీవితమే వాస్తవానికి కఠినమైనది, జటిలమైనది. ఈ స్థాయికి చెందిన కార్యకలాపాలలో మునిగితేలే వ్యక్తి ఎంతో శ్రమిస్తాడు, ఎంతో చింతిస్తాడు, ఎంతో వ్యథనూ వేదననూ అనుభవిస్తాడు. ఆ తాపత్రయాలలో చిక్కుకుపోతాడు. వీటితో పోల్చి చూస్తే- ఆధ్యాత్మిక

**శిష్టాచారానికి ఊపిరి భావసంవేదన.**

జీవితంలో కలిగే అసౌకర్యాలు అత్యల్పమైనవి. ఇంతటి శ్రమ. ఇంతటి గుంజాటన. ఇంతటి ఉద్విగ్నత. క్షణమైనా మనశ్శాంతి ఉండదు. కామనలనూ, కోరికలనూ తీర్చుకోవడానికై అలసట ఎరుగని ప్రయాస. ఆ కోరికలు తీరకముందే వాంఛలు వంద రెట్లు పెరుగుతాయి. ఇదంతా పెద్ద జంజాటం. పెద్ద పెద్ద సాఫల్యాలను పొందిన తర్వాత కూడ వ్యక్తిలో అసంతృప్తి మిగిలిపోతుంది. చిన్న సాఫల్యం కోసం విపరీతంగా శ్రమించి అలసిపోవలసివచ్చిందని తెలిసికూడా- దాన్ని మించిన సాఫల్యం కోసం పది రెట్ల బాధ్యతలను వ్యక్తి నెత్తినవేసుకుంటాడు. వేగం పెరిగిన కొలదీ విషమ సమస్యలు వేధిస్తాయి. వాటిని పరిష్కరించడంలో శరీరం, మనస్సు, ఆత్మ నుగ్గు నుగ్గు అవుతాయి. సురస రక్కసి నోరులాంటి అభిలాషను పూర్తిచేయడానికి మామూలు శారీరిక, మానసిక శ్రమ సరిపోదు. అందుకోసం అవినీతికి పాల్పడవలసివస్తుంది. పాప కార్యాలు చేసినా, అభిలాషలు పూర్తి కావు. ఉద్విగ్నత మనిషిని నిరంతరం వెన్నాడుతుంది. భవిష్యత్తు చిమ్మ చీకటిగా కనిపిస్తుంది. ఈ రెండింటి ఫలితంగా మనిషి క్రుంగిపోతాడు. దీనితో పోల్చినపుడు సాఫల్యాలు అల్పమైనవిగా కానవస్తాయి. సాధారణంగా జనం ఏడుస్తూ ఉంటారు. రోగంతో, శోకంతో మూలుగుతూ ఏదో విధంగా బ్రతుకనే శవాన్ని ఈడ్చుతూ ఉంటారు. వాస్తవానికి వారినే తపస్వులని పిలవాలి. ఇంతటి కష్టం, ఇంతటి త్యాగం, ఇంతటి ఉద్వేగం ఆత్మిక ప్రగతి కోసం వినియోగపడితే- మనిషి సిద్ధ పురుషుడు అవుతాడు, మహా మానవుడు అవుతాడు, దేవత అవుతాడు, భగవంతుడు అవుతాడు. పాపం అతడు పొందింది ఏదీ లేదు. కోల్పోయింది చాలా హెచ్చు. నిర్విరామంగా శ్రమించి సంపాదించినదాన్ని పిల్లలకూ బంధువులకూ వదిలి- వట్టి చేతులతో పరలోకానికి పయనమయేవారే వాస్తవానికి త్యాగులు, తాపసులు, పరోపకారులు, దానవీరులు. ఇతరుల సుఖం కోసం తాము కష్టాలను భరించేవారే నిజానికి మహాత్ములు, జ్ఞానులు, పరమార్థ పరాయణులు అని నాకు అనిపిస్తుంది- వారు తమను పాపాత్ములుగా, పథభ్రష్టులుగా చెప్పుకున్నప్పటికీ.

## మేము నష్టపోలేదు

మా చుట్టుప్రక్కల ఉన్న మనుషుల అంతరంగ, బహిరంగ జీవితాలను చూచినపుడు- మేము వారందరికన్న సుఖంగా జీవించామని మాకు అనిపిస్తోంది. హాని ఇంతమాత్రమే జరిగింది: మేము తక్కువ సౌకర్యాలతో, తక్కువ సంపదతో జీవించవలసి వచ్చింది. సాధనాలు తక్కువగా ఉండేవి. పేదవానిలా కనబడేవాణ్ణి. సంపద తక్కువగా ఉండడంవల్ల జనం మమ్మల్ని చిన్నవాళ్లు అనుకున్నారు, ఎగతాళి చేశారు. ఏ ఆత్మవాది అయినా ఇంతకన్నా ఎక్కువగా నష్టపోడు.

అయితే కొరతవల్ల నేనేమీ బాధపడలేదు, ఏ పనీ ఆగలేదు. ఇతరులు షడ్రసోపేతమైన భోజనం చేశారు. మేము జొన్నలతో, శెనగలతో పని గడుపుకున్నాం. ఇతరులు నాలుకపై అత్యాచారం చేసి జబ్బుపడ్డారు. మా చౌక భోజనం బాగా అరిగింది. ఆరోగ్యం దృఢంగా నిలిచింది. మాకు నష్టం ఎక్కడిది? విలాసపరులతో పోలిస్తే- మా జొన్న రొట్టె మరింత హాయి నిచ్చింది. ధన సంపాదనలో మునిగిన జనం మంచి దుస్తులు ధరించారు. పెద్ద పెద్ద భవంతులలో ఉన్నారు. ఏవేవో అలంకారాలు చేసుకున్నారు. ఆవిధంగా తమ అహంకారాన్ని తృప్తిపరచుకున్నారు. స్వల్ప సాధనాలతో మేము అంత డాబుసరిగా ఉండలేకపోయాము. అయితే, నిరాడంబరత్వం వల్ల కలిగిన ఆత్మసంతృప్తి, ఆనందం మాకు అంతకన్నా తక్కువ హాయిని ఇవ్వలేదు. లోతులేని జనం మమ్మల్ని ఎగతాళి చేశారు. అయితే, గాంభీర్యం కలిగిన వ్యక్తులు నిరాడంబరత్వం వెనుక తొంగిచూస్తున్న గొప్పతనాన్ని మెచ్చుకున్నారు; దానిముందు తలవంచారు.

మరి నష్టపోయింది ఎవరు? మమ్మల్ని చిన్నచూపు చూచినవారా, మేమా? మా గీటురాయిపై మమ్మల్ని మేము గీసి చూచుకున్న తర్వాత మాకు ఇలా అనిపించింది: తక్కువ శ్రమతో, తక్కువ ఇబ్బందితో, తక్కువ బాధ్యత తీసుకుని, మేము శారీరికంగా, మానసికంగా మరింత సుఖపడ్డాము, మరింత గౌరవాన్ని పొందాము. పిచ్చివాళ్లు పిచ్చివాళ్లను పొగిడితే, మాకు అభ్యంతరం లేదు. మాకు మాత్రం

**శిష్టాచారం అంతఃకరణ యొక్క వ్యక్తీకరణ.**

ఎలాంటి ఫిర్యాదూ లేదు. ఆత్మనుండి పరమాత్మ వరకు, సజ్జనులనుండి దూరదృష్టి కలిగినవారివరకు- అందరూ మా కార్య పద్ధతిని ప్రశంసించారు. ఇలా మాకు కలిగిన ఇబ్బందులు తక్కువ, లాభం ఎక్కువ.

## ఆత్మిక రంగంలో దుఃఖం తక్కువ

దుబారా ఖర్చుతో కూడిన తృష్ణలో చిక్కుకున్న పైమెరుగులతో నిండిన బరువైన జీవితాన్ని పాప పతనాలనే చక్రాలు గల బండిమీదనే లాగగలుగుతాము. మా సామాను తేలికయినది. పక్కచుట్ట చంకలో వేసుకున్నాం, బయలుదేరాం. అలసటా లేదు, చింతా లేదు. ఆదర్శవాద జీవితం సరళమైనదనీ, సులభమైనదనీ మా వ్యక్తిగత అనుభవం చెపుతోంది. అందులో వెలుగు, సంతృప్తి, ఉల్లాసం- అన్నీ ఉన్నాయి.

దుష్టులు ఆక్రమణచేసి కొంత హాని కలిగించారు. ఈ ఇబ్బంది పాపులకు మాత్రం లేదా? సంత్‌లూ, సేవా పరులూ పడే కష్టంకన్న భౌతిక జీవనంలో ఎదురయే పోటీ, అసూయ, ద్వేషం, ప్రతీకారం మరిన్ని ప్రమాదాలను తెచ్చిపెడతాయి. హత్యలు, బందిపోటు దొంగతనాలు, దురాక్రమణలు కారణంగా భౌతిక జీవితం గడిపేవారు మరిన్ని కష్ట నష్టాలకూ, దారుణాలకూ గురవుతున్నారు. ఇందరు వ్యక్తులు స్వచ్ఛందంగా తమ ప్రాణాలనూ, ధనాన్నీ త్యాగం చేయడానికి ముందుకు వస్తే- జనం వారిని దేవతలుగా పరిగణిస్తారు. వారివల్ల చరిత్ర ధన్య మవుతుంది.

మరణించిన ఏసుక్రీస్తు, సోక్రటీసు, గాంధీవంటి సంత్‌లూ, ఆ కోవకు చెందినవారూ కొద్దిమంది మాత్రమే ఉన్నారు. దిగజారిన రంగంలో దానికి వేయిరెట్లమంది హత్యలకు గురి అవుతున్నారు. దానంవల్ల పేదలయిన సంపన్నులు కొద్దిమంది మాత్రమే ఉంటారు. మోసం, నమ్మక ద్రోహం, వ్యసనాలు, వ్యభిచారం, దురాక్రమణ, వ్యాజ్యాలు, రోగాలు, తెలివితక్కువతనం వంటి కారణాలవల్ల బిచ్చగాళ్లయిన సంపన్నులు లక్షలాదిగా కనిపిస్తారు. ఆత్మిక రంగంలో నష్టం, ఆక్రమణ, దుఃఖం తక్కువ. భౌతిక రంగంలో ఇవి ఎక్కువ. ఈ వాస్తవాన్ని సరిగా గుర్తిస్తే, జనం ఆదర్శవాద జీవితమంటే గాబరాపడే తెలివితక్కువ పనికి, భౌతిక వాంఛలలో గుడ్డిగా మునిగి పతనమయే తెలివితక్కువ పనికి దిగరు.

తృష్ణ, వాసనల ప్రలోభంలో పడిన వ్యక్తి పొందేది తక్కువ, కోల్పోయేది ఎక్కువ. మా వ్యక్తిగత అనుభవం ఇది. మేము కోల్పోవలసివచ్చింది తక్కువ, పొందింది చాలా ఎక్కువ. కనుక, ఆధ్యాత్మిక జీవితాన్ని గడపవలసిందిగా, ఉత్కృష్టమైన ఆదర్శవాద జీవితాన్ని గడపవలసిందిగా ప్రతి వ్యక్తికీ చెప్పాలని మాకు అనిపిస్తోంది.

## ఉపాసనతోపాటు జీవన సాధన

జీవితపు స్వరూపాన్నీ, ప్రయోజనాన్నీ, లక్ష్యాన్నీ సక్రమంగా అర్థంచేసుకుని, శ్రేయస్కరమైన మార్గంలో నడిచే సాహసం లేకపోతే- మాతృవత్ పరదారేషు, పరద్రవ్యేషు లోష్టవత్- అనే మెట్లు రెండింటినీ ఎక్కడం మాకు కష్టమయేది. శరీరమే తామని నమ్మినవారికి, తృష్ణ వాసనలలో మునిగినవారికి ఆత్మిక ప్రగతి అందలేదు. పూజ-ఉపాసనల చిన్న చిన్న కర్మకాండలు ఆధారంగా ఎవరి నౌకా తీరాన్ని చేరలేదు. 24సంవత్సరాల పాటు నిరంతర గాయత్రీ పురశ్చరణలలో నిమగ్నమై ఉపాసనలోని ఒక మహత్తర అధ్యాయాన్ని మేము పూర్తిచేశాము. అయితే- ఆత్మిక ప్రగతి అనే భావనాత్మక ప్రక్రియను, జీవన సాధనను జోడించినపుడే ఆ కర్మకాండవల్ల మాకు ప్రయోజనం కలిగింది. ఇతరులవలె మేము దేవతలను వశపరచు కోవడానికీ, మోసగించడానికీ యంత్ర తంత్రాల కర్మకాండను జరిపి ఉంటే, జీవన క్రమాన్ని సరిదిద్దుకునే అవసరాన్ని గుర్తించిఉండకపోతే- మాకుకూడా ఏదీ చేతికి అందేది కాదు.

మేము ఎందరెందరో భజనానందులను ఎరుగుదుము. తంత్ర-మంత్ర కర్మకాండలలో మునిగినవారిని ఎరుగుదుము. వారు ఎంతో కాలం వాటిని కొనసాగించారు. వారి పూజలు మా పూజలకన్నా సుదీర్ఘమైనవి, విస్తృతమైనవి. అయినా, వారిని నిశితంగా పరిశీలించినప్పుడు, నాకు బోలుతనమే కనిపించింది, సారహీనతయే కనిపించింది. వారిలో లేనిపోని ఆత్మవంచన కనిపించింది. చనిపోయిన తర్వాత

**ఖర్చులేనిదీ, అన్నింటినీ కొనగలిగినదీ - శిష్టాచారం.**

తమకు స్వర్గ సుఖం తప్పక లభిస్తుందని వారు భావించేవారు. అయితే, వారికి స్వర్గం లభించదనీ, సిద్ధులు లభించవనీ నేను జోస్యంచెపుతున్నాను.

సాధకుని జీవనం ఉత్కృష్టతవైపు క్రమబద్ధంగా ముందుకుపోతూ ఉన్నప్పుడే, అతడి దృక్పథం సంస్కరింపబడుతూ ఉన్నప్పుడే, అతడి కార్యకలాపాలలో ఆత్మవాదుల విధి విధానాలు చోటుచేసుకున్నప్పుడే- అతడి కర్మకాండలూ, పూజలూ ఫలిస్తాయి. ధూర్తులు, స్వార్థపరులు, పిసినారులు, శరీరం కోసం పిల్లల కోసం బ్రతికేవారు తమ ఆలోచనా విధానాన్నీ, కార్యకలాపాలనూ సంస్కరించుకోక పోయినా- తీర్థయాత్రలు, వ్రతాలూ, ఉపాసన, పురాణ శ్రవణం, కీర్తనలు, స్నానం, ధ్యానం వంటివాటివల్ల వారికి ప్రయోజనం కలుగుతుందనే మాటను మేము ఆమోదించము. వాటికి ప్రయోజనం ఉంది. వ్యాసం వ్రాయడానికి కలం ఎంత ప్రయోజనకరమైనదో అవీ అంతే ప్రయోజనకరమైనవి. కలం లేనిదే వ్యాసాన్ని ఇలా వ్రాయగలం? పూజ-ఉపాసనలు లేనిదే ఆత్మిక ప్రగతి ఎలా సాధ్యపడుతుంది? దీనితోపాటు, మనం మరో సంగతికూడా తెలుసుకోవాలి. స్వాధ్యాయం, అధ్యయనం, చింతన, మననం అనే బుద్ధి వికాస ప్రక్రియను పూర్తిచేయనిదే- కేవలం కలం, కాగితం ఆధారంగా వ్యాసాలు వ్రాయలేము, కవితలు అల్లలేము. ఆత్మిక వికాసం బౌద్ధికమైన ఉత్కృష్టతవంటిది. పూజ మంచి కలంవంటిది. రెండూ కలసినప్పుడే పని జరుగుతుంది. వాటిలో ఒకదాన్ని తొలగిస్తే పని సగం సగంగా మిగిలిపోతుంది. సాధన అనే బండి ఒకే చక్రంమీద ముందుకు పోజాలదు. కనుక, మేము రెండు చక్రాల ఏర్పాటును సక్రమంగా జరిపాము.

## ప్రతి అవయవమూ జ్యోతిర్మయం

మా ఉపాసనా విధానం రహస్యమేమీ కాదు. గాయత్రీ మహావిజ్ఞాన్ గ్రంథంలో వ్రాసిన విధంగా, ఆ క్రమంలో మా గాయత్రీ మంత్ర ఉపాసనాక్రమం సాగుతూ వచ్చింది. అయితే ఒక విశేషం ఉంది. బ్రహ్మయొక్క పరమ తేజోమయ సత్తా అయిన గాయత్రీ మాత దివ్య ప్రకాశం మా కణ కణంలో నిండి ఉన్నదనీ, మా అస్తిత్వం - ప్రచండమైన అగ్నిలో ఎర్రబడిన ఇనుమువలె - మా ఇష్ట దైవం స్థాయికి చెందిన ఉత్కృష్టతను పొందిందనీ మేము ధ్యానం చేసే సమయంలో ఖచ్చితంగా భావన చేశాము. శరీరంలోని కణ కణంలో గాయత్రీ మాత యొక్క బ్రహ్మవర్చస్సు ఇమిడి పోవడంవల్ల మా ప్రతి అవయవమూ జ్యోతిర్మయం అయింది, వెలుగుతో నిండిపోయింది. ఆ అగ్నిలో ఇంద్రియాల కోరిక మండి బూడిద అయిపోయింది. సోమరితనంవంటి దుర్గుణాలు నశించిపోయాయి. రోగ వికారాలను ఆ అగ్ని మండించి తనలో కలుపుకున్నది. శరీరం మాదే. అయితే దానిలో ప్రచండమైన బ్రహ్మవర్చస్సు ధగ ధగ వెలిగిపోతోంది. వాటిలో సరస్వతి మాత్రమే మిగిలింది. అసత్యం, మోసం, జిహ్వా చాపల్యం అనే అసురత్వ లక్షణాలు ఆ దివ్య ఆలయాన్ని వదిలి పారిపోయాయి. సద్గుణాలను గ్రహించడమే, జడ చేతనాలన్నింటిలో ఆ భగవానుని సౌందర్యాన్ని దర్శించే సామర్థ్యమే కళ్లలో మిగిలింది. లోపాలను వెదకడం, కాముకత్వం వంటి దోషాలు కళ్లలో మిగుల లేదు. చెవులు శుభకరమైన దానినే వింటున్నాయి. మిగతాదంతా వట్టి కోలాహలమే. ఆ కోలాహలం చెవిని ఢీకొని తిరిగివెళ్లిపోతోంది.

**గాయత్రీ మాత యొక్క పరమ తేజస్సు సూక్ష్మ శరీరంలో, అంతఃకరణ చతుష్టయంలో, మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారాలలో ప్రవేశించి, వాటిని వెలిగించడాన్ని చూచాను. బ్రహ్మవర్చస్సు నా మనస్సును ఒక ఉన్నత భూమికలోనికి లాగికొనిపోతూఉండడాన్ని అనుభూతి పొందాను. ఆ భూమికలో పాశవికమైన ఇచ్ఛలూ ఆకాంక్షలూ నశించిపోతాయి. దివ్యత్వాన్ని రంగరించుకున్న ఆకాంక్షలు మేలుకుంటాయి. క్షణిక ఆవేశాల కోసం, తుచ్ఛ ప్రలోభాల కోసం మానవ జీవితం అనే మహత్తర ఫలాన్ని నాశనం చేసుకోకూడదని బుద్ధి నిర్ణయిస్తుంది. జీవితంలో ప్రతి క్షణం ఆదర్శాల స్థాపన కోసం వినియోగపడాలని బుద్ధి నిర్ణయిస్తుంది. చిత్తంలో ఉన్నతమైన నిష్ఠలు స్థిరపడతాయి. సత్యం, శివం, సుందరంల వైపు ముందుకుపోవాలనే ఉత్సాహం ఉప్పొంగుతుంది. సవితా దేవత యొక్క తేజస్సు**

ఉదారత + ప్రేమ = సేవ.

**ఆంతరిక భూమికలో ప్రవేశిస్తుంది. అహంను సంస్కరిస్తుంది; మరణ లక్షణం కలిగిన జీవుల స్థితికన్న యోజనాల ఎత్తుకు ఎగిరేటట్లు చేస్తుంది; సర్వసమర్థమూ, పరమ పవిత్రమూ, సచ్చిదానంద స్వరూపమూ అయిన పరమేశ్వరునిలో నిలిపి ఉంచుతుంది.**

## దివ్య దర్శనం, దివ్య అనుభూతి

గాయత్రీ పురశ్చరణల సమయంలో మేము జపం మాత్రమే చేయలేదు. దానితోపాటుగా- మనస్సు కూడ భావ తరంగాలలో తేలిపోతూ వచ్చింది. కారణ శరీరం అనగా భావ భూమిలోని అంతఃస్థలంలో ఆత్మ బోధ, ఆత్మ దర్శనం, ఆత్మానుభూతి, ఆత్మ విస్తరణల కలయిక ఆంతరిక జ్యోతిగా అనుభవమవుతూ వచ్చింది. దీపపు పురుగులు దీపానికి సమర్పితం అయే విధంగా- మా ఆత్మ పరమ తేజస్సుతో కూడిన సవితా దేవత వెలుగులో విలీనం అయినట్లు అనుభూతి పొందాము. మా అస్తిత్వం సమాప్తమయింది. పరమ తేజస్సు దాని స్థానాన్ని భర్తీ చేసింది. 'నేను' సమాప్తం అయింది. 'నీవు' ఆధిపత్యం వహించింది. ఆత్మ పరమాత్మల అద్వైత సంగమం అనే అనుభూతిలో బ్రహ్మానందపు స్వారస్యం క్షణ క్షణం అనుభవ మయింది. ఆ ఆనందంముందు ప్రపంచం మొత్తంలోని విషయ ఆనందమంతా దిగదుడుపే.

జపంతోపాటు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో దివ్య ప్రకాశం యొక్క ప్రతిష్ఠాపన మొదట్లో ధ్యాన ధారణ రూపంలో చేయబడింది. ఆ తర్వాత అది సహజ స్వభావం అయిపోయింది. చివరికి అది ప్రత్యక్ష అనుభూతిగా పరిణమించింది. ఉపాసనలో కూర్చున్నంతసేపూ మా సత్తా లోపలా బయటా పరమ తేజస్వి అయిన సవిత యొక్క దివ్య జ్యోతి సాగరమే పొంగిపొరలుతూ వచ్చింది. మా అస్తిత్వం ఆ దివ్య జ్యోతితో పూర్తిగా నిండినట్లు కనిపించింది. ఆ వెలుగు తప్ప మరేదీ నా అంతరంగ, బహిరంగాలలో లేదు. ప్రాణం యొక్క ప్రతి స్ఫురణలో వెలుగు రవ్వలు తప్ప మరేవీ మిగుల లేదు. సాధన సమయం దాదాపు అంతా ఈ దివ్య దర్శనంతో, దివ్య అనుభవంతో నిండిపోయింది.

పూజా సమయపు ఆరు గంటలు మిగతా 18 గంటలకూ సంపూర్ణమైన ప్రేరణను ఇస్తూవచ్చాయి. ఇష్ట దేవత యొక్క తేజస్సే మాకు మార్గదర్శకమని- పని చేస్తూన్నప్పుడు అనిపిస్తూవచ్చింది. దాని సంకేతాలకు అనుగుణంగానే ప్రతి కార్యకలాపం ఏర్పడినట్లు, సాగుతూన్నట్లు అనిపిస్తూవచ్చింది. లాలస లిప్సలద్వారా, తృష్ణ వాసనల ద్వారా ప్రేరితమై మా పనులు జరుగుతున్నట్లు ఎన్నడూ అనిపించలేదు. తల్లి చిన్నపిల్లవాణ్ణి వ్రేలు పుచ్చుకుని నడిపిస్తుంది. ఆ విధంగా ఆ దివ్య సత్తా మెదడును పుచ్చుకుని ఉన్నతమైన పనులు చేసేందుకు నడిపించింది. పరమేశ్వరుడే అన్నింటినీ యోజన చేస్తూన్నట్లు , సంచాలన చేస్తున్నట్లు అనిపించింది. శారీరికమైన నిత్య కృత్యాలలో బ్రతుకుదెరువు కోసం సంపాదించడంలో, స్వాధ్యాయంలో, చింతనలో, కుటుంబ వ్యవస్థలోని సమస్త క్రియలలో అలా అనిపించింది. రాత్రి ఆరు గంటలు గాఢ నిద్ర పట్టేది; సమాధిలో ఉన్నట్లు, మాత ఒడిలో మమ్మల్ని మేము అప్పగించుకున్న పరమ శాంతిలో, సంతృప్తిలో ఆత్మసత్తాతో తాదాత్మ్యం లభించినట్లు అనిపించింది. నిద్ర మేలుకొన్నప్పుడు- నవ జీవనం, నవ ఉల్లాసం, నవ ప్రకాశం దారి చూపడం కోసం ముందునుండే ఎదుట నిలబడినట్లు అనిపించింది.

24 సంవత్సరాల 24 మహాపురశ్చరణల కాల ఖండంలో సామాజిక, కుటుంబ బాధ్యతలు ఏవీ భుజం మీద లేవు. కనుక అధిక తత్పరతతో, తన్మయత్వంతో ఈ జప-ధ్యాన సాధనా క్రమం సవ్యంగా సాగిపోయింది. మాతృవత్ పరదా రేషు, పరద్రవ్యేషు లోష్ఠవత్‌ల పట్ల అచంచలమైన నిష్ఠ శరీరాన్ని పాప కార్యాలనుండి రక్షిస్తూ వచ్చింది. భోజనంలోని సాత్వికత మనస్సును మానసిక పతనం నుండి రక్షిస్తూ వచ్చింది. జొన్న రొట్టె, ఆవు మజ్జిగ రుచిగా ఉండేవి, తేలికగా అరిగేవి. 'జైసా అన్ వైసా మన్' (ఆహారం ఎలా ఉంటే మనస్సు అలా ఉంటుంది) అనే నిజాన్ని మేము మా జీవితంలో అడుగడుగునా అనుభూతి పొందాము. శరీరాన్నీ, మనస్సునూ కఠోరంగా అదుపుచేసి ఉండకపోతే- ఇప్పుడు సాధించిన కొద్ది ప్రగతి సాధ్యపడేదో, లేదో.

★★★

మానసిక శక్తులను విజృంభింపజేస్తుంది ఉదారత.

గురుదేవుల అమృతవాణి

# సాధన ద్వారా సిద్ధి : నా అనుభవ సారం

సాధన, సిద్ధి ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నాటడానికీ, కోయడానికీ మధ్య ఉన్న సంబంధం వంటిది ఆ సంబంధం.

అయితే విత్తనం నాటడంతో సరిపోదు. నీరు పోయాలి. ఎరువు పెట్టాలి. మేము సాధన అనే విత్తనాన్ని నాటాము. నీరూ, ఎరువూకూడ అందించాము. ఎలా? నేను మీకు నా జీవితంలోని రెండు సంఘటనలను వినిపిస్తాను.

## మాలవ్యాజీ బోధన

మొదటి సంఘటన ఇది. నేను పది సంవత్సరాల బాలుడుగా ఉన్నపుడు మా తండ్రిగారు నన్ను మహామనా మాలవ్యాజీ వద్దకు హిందూ విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. మాలవ్యాజీ నాకు దీక్షా సంస్కారం నిర్వహించారు. ఆయన నాకు గాయత్రీ మంత్రం ఇచ్చారు. యజ్ఞోపవీతాన్ని నాచేత ధరింపజేశారు. అపుడాయన ఒక ముఖ్య విషయాన్ని నాకు చెప్పారు. ఇప్పటికీ నాకది గుర్తుంది. ఆ మాట ఇది–

"గాయత్రి కామధేనువు. బ్రాహ్మణులకు మాత్రమే కామధేనువు. కామధేనువు స్వర్గలోకంలోని ఒక ఆవు. దాని పాలు త్రాగి దేవతలు ముసలితనం, చావు లేనివారు అయినారు. కనుక బ్రాహ్మణుడుగా తయారుకావాలి. సగటు పౌరుని వలె జీవిస్తూ, మిగిలిన సమయాన్ని సమాజం కోసం అర్పిస్తూ, జ్ఞానంలో ఆలోచనలో లీనమవుతూ, స్వార్థాన్ని పరమార్థంగా మార్చే వ్యక్తియే బ్రాహ్మణుడు."

నేనీ విషయాన్ని చక్కగా అర్థంచేసుకున్నాను. తండ్రిగారినీ, మాలవ్యాజీనీ అడిగి మరిన్ని వివరాలు తెలుసుకుని సంతృప్తిపొందాను. ఈ విషయం నా మనస్సులో బండరాయిలా స్థిరపడిపోయింది.

నేను గాయత్రీ మంత్రాన్ని జపించసాగాను. జపంతోపాటు - నేను బ్రాహ్మణుడుగా మారాలి అని సంకల్పం చేసుకున్నాను. నిరంతరం అదే మనసులో మెదిలేది.

దాని ఫలితం ఏమిటి? అయిదు సంవత్సరాలలో నాలో బ్రాహ్మణత్వం ఎంతగా వికసించిందంటే– మరో గురువు మా ఇంటికి వచ్చారు. అపుడు నా వయస్సు 15 సంవత్సరాలు. ఇది నా జీవితంలోని రెండవ సంఘటన.

## "నాలుగు వస్తువులను దేవుడికి ఇవ్వు"

గురువు స్వయంగా మా ఇంటికి వచ్చారు. ఆయనను వెదకుతూ మేము వెళ్లలేదు. గురువు వెదకుతూ స్వయంగా వస్తాడు. గురువును వెదకడం దండుగ. ఎందుకంటే– పాత్రత వికసించనంతవరకు ఏ గురువూ రాడు. కాయ పచ్చిగా ఉంటే, దాన్ని తినడానికి ఏ పక్షీ రాదు. కాయ బాగా పండి సువాసన వ్యాపించగానే, ఎక్కడ నుంచి వస్తాయో– పక్షులు వచ్చేస్తాయి. ఆ పండును తింటాయి.

నేను బ్రాహ్మణత్వ జీవితం గడిపాను. అందుకు ప్రతిఫలంగా నా గురువు సూక్ష్మ శరీరంలో నా వద్దకు వచ్చారు. ఆయన ఇలా అన్నారు– గాయత్రిలోని మిగతా భాగాన్ని మేము నీకు నేర్పుతాము.

ఆయన ఇంకా ఇలా అన్నారు– గాయత్రీ మంత్రం అదే. దానితోపాటు మరో సూత్రం ఉంది– విత్తడం, కోసుకోవడం.

దాని అర్థం ఏమిటి?

నీ వద్ద ఉన్నదాన్ని భగవంతుని పొలంలో విత్తనంలా నాటడం మొదలుపెట్టు. అది వందరెట్లు అయి నీకు తిరిగివస్తూఉంటుంది. ఒక ధాన్యపు గింజ నాటుతాము. వంద ధాన్యపు గింజలు కోతకు వస్తాయి. నీవు నాటడం, కోయడం మొదలుపెట్టు.

ఎక్కడ– అని నేను అడిగాను.

భగవంతుని పొలంలో– అని ఆయన జవాబిచ్చారు.

భగవంతుని పొలం ఎక్కడ ఉంది– అని నేను అడిగాను.

త్యాగం వృథా కాదు - అన్నది ప్రకృతిలోని శాశ్వత నియమం.

ఆయన ఇలా చెప్పారు-

సమాజమంతా భగవంతుని విరాట్ రూపమే. ఎవ్వరూ ఇంతవరకు భగవంతుణ్ణి కళ్లతో చూడలేదు. ఎందుకంటే - ఆయన నిరాకారుడు, సర్వవ్యాపి. ఆయనను ఎలా చూడగలుగుతాము? మంటను చూడగలుగుతాము. వేడిమిని ఎలా చూస్తాము? గాలిని ఎలా చూడగలుగుతాము? భగవంతుణ్ణి చూడలేము, అనుభూతి పొందగలము. నీవు భగవంతుని పొలంలో నాటడం మొదలుపెట్టు, అద్భుతం జరుగుతుందో జరగదో చూడు.

నేనిలా అన్నాను- నావద్ద ఏమీ లేదు- ఈ లాల్చీ, పంచ తప్ప.

ఆయన ఇలా అన్నారు- నీవు భగవంతుని ఇంటినుండి తీసుకువచ్చిన వస్తువులు మూడు ఉన్నాయి. ఒకటి నీ కార్యశూరతతో సంపాదించినది. ఈ జన్మలో సంపాదించింది కావచ్చు. గత జన్మ సంపాదన కావచ్చు. నాలుగు వస్తువులు నీవద్ద ఉన్నాయి- నీ శరీరం, దానితో కలసి ఉన్న మూడు వస్తువులు- సమయం, శ్రమ, బుద్ధి, నాల్గవది నీ సంపద. వీటన్నింటినీ భగవంతుని కోసం వినియోగించు. వినియోగిస్తే- అవి వంద రెట్లు పెరిగి నీవద్దకు తిరిగి వస్తూ ఉండడాన్ని నీవు చూస్తావు.

సూక్ష్మ శరీరధారి అయిన ఆ గురువుగారి మాటను నేను అమలుచేయసాగాను.

## సేవద్వారానే జీవన క్షాళన

మనల్ని మనం పరిశుద్ధం, పవిత్రం చేసుకోవడానికై, జీవితాన్ని క్షాళన చేసుకోవడానికై- సేవ చేయవలసి ఉంటుంది. పరోపకారం, పుణ్యం- ఇవి లేకుండా జీవన క్షాళన సాధ్యపడదు. సేవ చేయనిదే ఏ సాధనా సఫలం కాదు.

## సేవయే మా పూజ

ప్రాచీన ఋషుల జీవనాలు ఆధారంగా - మేము మా జీవితాన్ని సేవకు వినియోగించాము. చేసే పూజను రాత్రి నిద్రకుముందూ, ఉదయం సూర్యోదయానికి ముందూ చేశాము. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మేము సమాజ సేవలో లీనమై ఉంటూవచ్చాము. ఇదే మా భజన. ఇదే మా పూజ.

గురువుగారు చెప్పిన ప్రకారం - మేము మా నాలుగు సంపదలనూ సమాజమనే పొలంలో నాటాము.

సమయాన్ని మేము సమాజంకోసం వినియోగించాము. శ్రమనూ అందుకే వినియోగించాము. మా చెమటలో ఒక్క బొట్టు కూడా వ్యాపారంలో, డబ్బు సంపాదించడంలో ఖర్చుకాలేదు. మా బుద్ధి ఎన్నడూ మోసం చేయలేదు, దొంగతనం చేయలేదు. లోక కళ్యాణం ఎలా జరగాలి, సమాజంలో సత్ ప్రవృత్తులను ఎలా పెంపొందించాలి- అని మాత్రమే మా బుద్ధి ఆలోచిస్తూ వచ్చింది.

ఈ మూడు వస్తువులనూ నాటడంవల్ల మాకు ఏమి లభించింది?

## పెరిగి తిరిగివచ్చిన సమయం

సమయాన్ని మేము సరిగా ఉపయోగించాము. ఫలితంగా మేము దాన్ని అయిదు రెట్లు పెంచాము. మా జీవితపు జమా ఖర్చులు లెక్కవేయండి. ఒంటరిగా ఎంత పెద్ద సంస్థను మేము నిర్మాణంచేశామో చూడండి. 24 లక్షల 24 పురశ్చరణలను పూర్తిచేశాము. మా శరీరం బరువుకన్న హెచ్చు బరువు గల సాహిత్యాన్ని వ్రాసి ఉంచాము. అయిదుగురు మనుషులు నిరంతరం రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తే జరిగే పనిని మేము ప్రతిరోజూ చేశాము. మా సమయం అయిదు వందల రెట్లు పెరిగి మావద్దకు తిరిగివచ్చింది. కొద్దిపాటి జీవితంలో మేము చేసి చూపిన పని రెండువందల సంవత్సరాలలో సైతం జరగదు.

## మా శ్రమ, సేవ, ప్రేమ

ప్రజల సుఖం కోసం మేము శ్రమించాము. మా ఇంటినుంచి వట్టి చేతులతో తిరిగివెళ్లినవారు లేరు. వీరి ఇంటికి వచ్చినవారెవరూ ఆకలితో, దప్పికతో, మందూ మాకు తీసుకోకుండా తిరిగివెళ్లలేదు- అని ప్రతి వ్యక్తీ చెప్పేవాడు. ఎందుకంటే - మేము సేవ చేస్తాము.

సేవ అంటే ప్రేమ. ప్రేమ అంటే సేవ. మేము జీవితమంతా ఇతరులకు సేవచేశాము. జీవితమంతా ప్రేమను పంచాము. ప్రతిఫలంగా ప్రేమను చూరగొన్నాము. మా జీవితం ప్రేమతో పొంగిపొరలింది.

**తెలిసిచేసిన త్యాగం ఒక ప్రామిసరీ నోటు.**

లక్షలాది వ్యక్తులు మా సంకేతం ప్రకారం నడుస్తున్నారు. మా ఉపన్యాసాల ఫలితం కాదిది. మేము ప్రేమను పంచినందువల్ల కలిగిన ఫలితం ఇది. ప్రతిఫలంగా మేము ప్రేమను చూరగొన్న మాటా నిజమే.

## యుగ పరివర్తనకు పథకం వేసింది మా బుద్ధి

మా బుద్ధి ఎంతగా పెరిగిందంటే – మేము లక్షలాది వ్యక్తుల వక్ర బుద్ధిని సరిచేశాము. మేము ఎమ్. ఏ ప్యాసు కాలేదు. డిగ్రీలు పొందలేదు. అయితే మేము ప్లానింగ్ చేస్తాము. వ్యూహ రచన చేస్తాము. సమాజం మొత్తాన్ని, ప్రపంచం మొత్తాన్ని కాయకల్ప చికిత్స చేసేందుకై వ్యూహ రచన చేస్తాము. ఏ కమిషనూ చేయలేని ప్లానింగ్ చేస్తాము.

మేము సాహిత్యాన్ని సృష్టించాము. వేద పురాణాదులపై భాష్యాలు రచించాము. అది ఆధారంగా మా బుద్ధిని అంచనావేయకండి. మా బుద్ధి ఎంత పెద్ద పెద్ద సార్థక పథకాలను రూపొందించిందో చూడండి. మా బుద్ధి ఏ దిశలో పనిచేస్తోందో చూడండి. మొత్తం యుగం యొక్క నవ నిర్మాణం ఎలా జరగాలో మా బుద్ధి ఆలోచించింది. ఆ పని చేస్తుందికూడా.

## మా ఆస్తి అంతా సమాజానికే

నాల్గవది మా సంపద. మావద్ద ధనం ఎక్కడిది? ధనాన్ని మేము సంపాదించలేదు. మేము పూర్వ జన్మలో సంపాదించిన దాన్ని మా తండ్రిగారు వదిలివెళ్లారు. 2000 బిఘాల పొలం ఉండేది మాకు. సమాజ సేవలో అడుగుపెట్టేటపుడు మేము మా పిల్లలను ఇలా అడిగాము– పిత్రార్జితం కనుక చట్టరీత్యా దీనిమీద మీకు కూడ హక్కు ఉంది. ఈ హక్కును మీరు వదులుకోవాలని మేము కోరుతున్నాము. ఎందుకంటే– ఈ చట్టం చోరులద్వారా తయారయినది, చోరులకోసం తయారయినది. నైతిక చట్టం ఇందుకు భిన్నమైనది. ఈ ఆస్తిని సమాజానికి ఇవ్వాలి. మీ అభిప్రాయం చెప్పండి.

పిల్లలిద్దరూ ఇలా అన్నారు– నాన్నగారూ! మీరు మమ్మల్ని చదివించారు. మమ్మల్ని సమర్థులను చేశారు. ఇక మాకు ఒక్క పైసాకూడా వద్దు.

మేము ఆ పొలాన్ని అంతనూ దానం చేశాము. నా భార్య నగలుకూడా అమ్మిడైనాయి. వాయిదాలుగా ఇస్తూవచ్చాము.

మొదట మా గ్రామంలోని స్కూలుకు ఇచ్చాము. అది ఇపుడు జూనియర్ కాలేజి అయింది. ఆతర్వాత మేము గాయత్రీ తపోభూమికి ఇచ్చాము. దానికి ఇతరులు కూడ డబ్బు ఇచ్చారు. అయితే మొదటి విరాళం మాది.

మీరు శాంతికుంజ్ చూచారు. బ్రహ్మవర్చస్ చూచారు. 2400 శక్తి పీఠాలను చూచారు. కోట్ల రూపాయలు ఖరీదు చేసే భవనాలు అవి.

ఎంత ధనాన్ని మేము భగవంతుని పొలానికి ఇచ్చామో, అది ఎన్ని రెట్లు పెరిగిందో దీన్నిబట్టి మీరు అంచనావేయగలుగుతారు.

మేము మథురలో సహస్ర కుండీయ యజ్ఞం చేశాము. ఇక్కడి రోజువారీ ఖర్చును కూడ మీరు అంచనా వేయండి. రోజూ లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని మీకు తెలుస్తుంది. ఇదంతా ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు.

మనిషి ముందు చేయిచాపము– అని మేము ప్రతిజ్ఞ చేశాము. అయితే భగవంతుడు మాకు అంతా ఇస్తూవచ్చాడు. మేము మనిషినీ అడగలేదు, భగవంతుణ్ణీ అడగలేదు.

ఇందుకు ఫలితం ఏమంటే– మేము నాటిన దాని కన్న ఎంతో హెచ్చుగా కోసుకున్నాము. సాధనద్వారా అందవలసిన సిద్ధి మాకు అందుతూవచ్చింది. ఇకముందు మాట ఏమిటని మీరు అడగవచ్చు.

మా శరీరం ఉన్నంతవరకూ వ్యక్తికోసమే కాక సమాజంకోసం మా కణ కణమూ అర్పిస్తాము. మా సంకల్పం ఇది.

సాధనద్వారా సిద్ధి అనే సిద్ధాంతం ఉపాసన, సాధన, ఆరాధన అనే మూడు సూత్రాలపై అమలు జరిగింది. ఈ మూడూ ఏమిటి? ఇవి పొలం, ఎరువు, నీరు.

మేము జీవితమంతా ఈ సూత్రాలను అమలు చేశాము. దాని ఫలితం మాముందు ఉంది. దీనినే మీ జీవితంలో చూడగోరితే– మీరు ఈ ప్రయోగం చేయవచ్చు. మీ సాధన సిద్ధిగా ఫలించిందో లేదో ఆ తర్వాత మాకు చెప్పండి.

*(1984 ఏప్రిల్ 21న సూక్ష్మీకరణ సాధన సమయంలో ఇచ్చిన టేప్ చేసిన సందేశంనుండి)*

★★★

**ఉదారుడు దీర్ఘజీవి అవుతాడు.**

గురుదేవుల అమృతవాణి

# జీవన సాధనకు మూలసూత్రాలు

## సద్గుణాల వికాసం

వ్యక్తిత్వ వికాసం సద్గుణాల వికాసంపై ఆధారపడి ఉంది. ప్రతి మనిషీ తన వ్యక్తిత్వాన్ని బలోపేతం చేసుకోగలుగుతాడు. ఆధ్యాత్మిక జీవితంలో, ప్రాపంచిక జీవితంలో సాఫల్యానికి ఆధారం వ్యక్తిత్వ సంపద. సాఫల్యానికి ధనం చాలదు; ఇతరుల సహకారమూ చాలదు. ఇవి అవసరమే. అయితే, వ్యక్తివద్ద ఉన్న వజ్రాయుధం, వ్యక్తి యొక్క వైభవ గరిమ అతడి వ్యక్తిత్వమే. వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకుంటే- వ్యక్తి ఉజ్వల భవిష్యత్తు మార్గంలో సగం దూరం సాగినట్లే.

## అనాగరికతనుండి నాగరికతకు

జీవన-సాధన అంటే అర్థం- తన గుణ,కర్మ, స్వభావాలను సంస్కరించుకోవడం. వాస్తవానికి- మనిషి 84 లక్షల జీవరాశుల జన్మలు ఎత్తుతూ ఎత్తుతూ ఆ ప్రాణులన్నింటిలోని దుష్ట సంస్కారాలను తనలోపల ప్రోగుచేసుకున్నాడు. ఇవి మనిషి జీవితానికి అవసరం కావు. పైగా హాని కలిగించేవి. అయినా ఇవి స్వభావంలో అంతర్భాగాలు అయిపోయాయి. మనం మనుషులం అయినా, పశు సంస్కారాలనుండి ప్రేరణ పొందుతున్నాం. పశు ప్రవృత్తులను మన జీవితాలలో ఆచరణలో పెడుతున్నాం. ఈ అనాగరికతను తొలగించడం, నాగరికతనూ, సువ్యవస్థనూ మనలో వికసింపజేయడం, జన్మ జన్మల దుష్ట సంస్కారాలను నిర్మూలించడం, మానవోచితమైన స్వభావాన్ని అలవరచుకోవడం- ఇదే సాధన అంటే. ఎద్దును నాగలికి కట్టడానికీ, గుర్రాన్ని బండికి కట్టడానికీ వాటి యజమానులు అనుసరించే సంస్కరణ పద్ధతులను మనం దుష్ట సంస్కారాల పట్ల అమలు చేయవలసి ఉంటుంది. ముడి లోహాలను నిప్పులో కరిగించి, వాటిని శుద్ధిచేసి నగలను తయారు చేస్తారు. అలాగే- మనం ముడి జీవితాన్ని కరిగించి దాన్ని సభ్యంగా, సంస్కారయుక్తంగా, ఆయుధంగా రూపుదిద్దవలసి ఉంటుంది.

## సాధన నుండి సిద్ధి

జీవన-సాధన కోసమై మనం ప్రతి రోజూ ఆత్మ పరీక్ష జరుపుకోవాలి. మన స్వభావంలోని లోపాలను వెదికి పట్టుకోవాలి. వాటిని తొలగించడానికై నడుం బిగించాలి. మనల్ని మనం నిర్మాణం చేసుకోవడానికి ముందంజవేయాలి. ఆత్మ వికాసం ఇందులో ఒక భాగం.

మనం మన వ్యక్తిగత పరిధికి పరిమితం కాకూడదు. మనం 'అహం' నూ, మన స్వార్థపరత్వాన్నీ, మన ప్రయోజనాన్నీ విశాల దృష్టితో పంచిపెట్టాలి. ఇతరుల దుఃఖాలు మన దుఃఖాలు కావాలి. ఇతరుల సుఖాలను చూచి మనం సుఖపడాలి. ఇలాంటి ప్రవృత్తులను మనం వికసింపజేసుకోవాలి. అపుడే మన జీవన సాధన సఫలం అవుతుంది. సాధననుండి సిద్ధి లభిస్తుంది.

## మీ దృక్పథాన్ని మార్చుకోండి

మీరు మీ దృక్పథాన్ని మార్చుకోండి. పరివర్తన జరగవలసింది మీ దృష్టికోణంలో.

శరీరం కోసం కాక- ఆత్మకోసం మీరు జీవించండి. మీరు శరీరం కాదు- ఆత్మ. ఆత్మగానే మీరు లక్షలాది కోట్లాది సంవత్సరాలు జీవించిఉంటారు. శరీరం మీరు తొడుక్కునే, కప్పుకునే బట్టవంటిది. మీరు మిమ్మల్ని శరీర ప్రధానులుగా పరిగణించకండి; ఆత్మ ప్రధానులుగా పరిగణించుకోండి. ఆత్మ కళ్యాణానికి ప్రాధాన్యం ఇవ్వండి.

శరీరాన్ని ఉపయోగించవలసిందే. కనుక దానిని బ్రతికించిఉంచాలి. శరీరపు అవసరాలను తీర్చాలి.

కాని శరీరం కోసం జీవించకండి. అన్నం తినవలసిందే. అయితే అన్నం కోసం బ్రతకకండి. బ్రతకడానికి అన్నం కావాలి.

ఉదారత పశ్చాత్తాపం ఎరుగదు.

మీరు మీ దృక్పథాన్ని మార్చుకుంటే– ఆత్మోన్నతికీ, ఆత్మ కళ్యాణానికీ ఉపకరించే అనేక మార్గాలు మీకు కనిపిస్తాయి; మీ సమస్యలు అనేకం పరిష్కారం అవుతాయి.

యజమానిగా కాక– తోటమాలిగా అప్పుడు మీరు వ్యవహరిస్తారు. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవనాలపట్ల మీ దృక్పథాన్ని మీరు మార్చుకోండి.

## సాధన నుండి సిద్ధి

జీవితానికి గొప్ప విలువ ఉంది. జీవితం లక్షల రూపాయల విలువైనది, కోట్ల రూపాయల విలువైనది. జీవితం విలువ ఏమిటో తెలుసుకున్న మనిషి తులసీదాసు. వాసనల పట్ల, వాంఛల పట్ల వ్యామోహం చెందినప్పుడు ఆయనకు హైరాన హైరానగా ఉండేది, చికాకు చికాకుగా ఉండేది. దానితో తన మనస్సును భగవద్ భక్తిపై కేంద్రీకరించారు. ఆయన భక్తి మా భక్తి లాంటిది మీ భక్తి లాంటిది కాదు. మనకయితే– మాల ఇటు తిరుగుతుంది, మనసు అటు తిరుగుతుంది; ఇక్కడ భజన చేస్తూఉంటాం. తల అటు ఊగుతూ ఉంటుంది. మరి అది భక్తి అవుతుందా? అది ఉపాసన అవుతుందా?

తులసీదాసు భక్తి ఎలాంటిదంటే– అది రామచంద్ర మూర్తిని పట్టుకునే వరకు విశ్రమించలేదు.

## ఉదాత్త ఆదర్శాలవైపు పురోగమించండి

సాదా జీవితం, ఉన్నత ఆలోచన– అనే సిద్ధాంతాన్ని మీరు అమలు జరపండి. సాదాగా జీవిస్తే మీ కొరతలన్నీ నశించిపోతాయి; ఉదాత్త ఆలోచనలను గ్రహించి మీరు ఇక్కడనుండి వెళితే– మీ వద్ద ఇప్పుడు ఉన్న సాధనాలతోనే మీరు ప్రజలకు సాయపడగలుగుతారు, సేవ చేయగలుగుతారు.

మీరు ఇతరులకు సేవచేయకపోవచ్చు. అయినా ఇంటిలో కూర్చుని ఉదాత్తమైన ఆలోచనలు చేస్తూఉండండి. ఉదాత్తమైన భావనలు చేస్తూఉండండి. ఉదాత్తమైన పథకాలు వేస్తూఉండండి. మిమ్మల్ని మీరు ఉదాత్త ఆశయాలలో ముంచి ఉంచగలిగితే– అదయినా చిన్న విషయమేమీ కాదు.

మీరు ఇలా కూడా చేయండి. మీరు మీ దుర్మతిని, దుష్ట బుద్ధిని, వదులుకోండి. నరకాన్ని వదులుకోండి. పతనాన్ని వదులుకోండి. ఉన్నతివైపు పయనించడం ప్రారంభించండి. స్వర్గాన్ని మీ లక్ష్యంగా చేసుకోండి. మీ అడుగు స్వర్గంవైపు, ముక్తివైపు వేయండి.

ముక్తి అంటే అర్థం– భవ బంధనాలనుండి విముక్తి, లోభ మోహాలనుండి విముక్తి.

స్వర్గంవైపు పయనించడం అంటే అర్థం– మనిషికి శాంతిని ఇచ్చేవీ, శ్రేయస్సును ఇచ్చేవీ, సంతృప్తిని ఇచ్చేవీ అయిన ఆదర్శాలవైపు, సిద్ధాంతాలవైపు ముందడుగు వేయడం.

మీరు మిమ్మల్ని మార్చుకోండి. మీ దారిని మార్చుకోండి. మీ గుణాలను మార్చుకోండి. మీ ఆలోచనా విధానాన్ని మార్చుకోండి.

## మీతో మీరే జరపాలి మహాభారత యుద్ధాన్ని

ఆధ్యాత్మిక రంగంలో మొట్టమొదట ఒక పని చేయవలసి ఉంటుంది– మహాభారత యుద్ధం జరపవలసి ఉంటుంది. ఎవరితో పోరాడాలి? మీ మనస్సుతో పోరాడాలి.

ఈ మనస్సు ఎంతో జిత్తులమారిది. మనస్సుతో జరిపిన పోరాటంలో గెలుపు సాధిస్తే– ముల్లోకాలనూ జయించినట్లే.

మనల్ని మనం జయిస్తే, మన మనస్సును అదుపు చేస్తే, మీ మనస్సును మీ ఇష్ట ప్రకారం నడిపితే– అద్భుతం జరుగుతుంది. అప్పుడు మీరు ఎవరవుతారు? మనస్వి అవుతారు. సంత్ అవుతారు. దేవత అవుతారు.

తమతో తాము పోరాడేవారిని, తమ మనస్సును నియంత్రించిన వారిని, తమ ఇంద్రియాలను అదుపు చేసిన వారిని, జన్మ జన్మాంతరాల దుష్ట సంస్కారాలను నిర్మూలించినవారిని మేము మనస్వులని పిలుస్తాము. తన జీవితాన్ని నిర్ణయించుకున్న వ్యక్తి, తన జీవితపు దిశను సరిచేసుకున్న వ్యక్తి మనస్వి అవుతాడు. తన మనస్సుకూ, మెదడుకూ ఏది చేయాలో ఏది చేయకూడదో సలహా ఇచ్చే వ్యక్తి మనస్వి అవుతాడు. 'సాదా జీవితం, ఉన్నత ఆలోచన'– అనే ఉదాత్త సిద్ధాంతాన్ని తన జీవితంలో ప్రతిబించించే వ్యక్తి మనస్వి అవుతాడు. ఉన్నత ఆలోచన రావాలంటే సాదా జీవితం గడపాలి. మనస్వి మాత్రమే తన జీవితాన్ని మార్చుకోగలుగుతాడు, సమయాన్నీ, యుగాన్నీ మార్చ గలుగుతాడు.

*(వివిధ ప్రవచనాల నుండి)*

★★★

శ్రమ ఇచ్చే వరాలు - ఆరోగ్యం, ఆయుష్షు, గాఢనిద్ర, స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం.

జీవన సాధనకు పావన ప్రేరణ

# సాంస్కృతిక దిగ్విజయానికి శ్రీకారం

అశోక చక్రవర్తి రాజ దర్బారులో కూర్చుని ఒక బౌద్ధ భిక్షువుతో మాట్లాడుతున్నాడు. సంభాషణ మధ్యలో రాజకుమారుడు మహేంద్రుడు వచ్చాడు. భిక్షువులోని అనాసక్తీ, ఆయన వాణిలోని గాంభీర్యమూ అతడిని ప్రభావితం చేశాయి.

"వీరు ఎవరు?"- అని అతడు తండ్రిగారిని అడిగాడు.

"వీరు మహాస్థవిరులు యోగాలి పుత్తతిస్. జన మానసాన్ని సంస్కరించడానికీ, ప్రజలకు జీవన విద్యను బోధించడానికీ వీరు తమ జీవితాన్ని సంఘానికి సమర్పించారు"- అని చక్రవర్తి జవాబిచ్చాడు.

"మరి సంఘం అంటే ఏమిటి?- అని మహేంద్రుడు అడిగాడు.

మహాస్థవిరులు ఇలా జవాబిచ్చారు-

"బాబూ! ప్రాపంచికమైన ఆకర్షణలను వదులుకుని, సమాజ హితం కోసం పర్యటించే వ్రతాన్ని స్వీకరించిన వ్యక్తుల సముదాయం సంఘం."

"నేనుకూడ ఈ సముదాయంలో చేరాలని కోరుతున్నాను. నాకూ పరివ్రాజకత్వం లభిస్తుందా"- అని మహేంద్రుడు అడిగాడు.

"వద్దు బాబూ ! సుఖ భోగాలను అనుభవించే వయస్సు నీది. బాగా ఆనందించు. భోగ విలాసాలలో జీవితాన్ని గడుపు"- అని అశోకుడు అన్నాడు.

మహాత్యాగి అయిన అశోకునికి సైతం పుత్ర వ్యామోహం నశించలేదు.

రాజకుమారుడు ఇలా అన్నాడు-

"ప్రాపంచిక సుఖాలు నిస్సారమైనవి. సద్జ్ఞాన ప్రసారం మహత్తరమైనది. వివేకి శ్రేష్ఠమైనదానిని వదులుకుని నికృష్టమైనదానిని ఎందుకు స్వీకరిస్తాడు?"

పదహారు సంవత్సరాల వయస్సు గల మహేంద్రుడు చెప్పిన ఈ మాట మహాస్థవిరులనూ, అశోకుడినీ, మహారాణినీ నివ్వెరపరచింది. మహాస్థవిరులు ఇలా అన్నారు-

"మహేంద్రుని అంతఃకరణలో బుద్ధ దేవుని ప్రేరణ ఉప్పొంగినట్లు కనబడుతోంది. ఇతడు భవిష్యత్తులో దైవ వాణిని ప్రసారం చేయవచ్చు."

తన ఆలోచనకు సమర్థన అందడంతో, మహేంద్రుడు తిరిగి ఉత్సాహంగా ఇలా అన్నాడు-

"తండ్రిగారూ! మీ ఆజ్ఞ అయితే, నేను నేడే పరివ్రాజకత్వాన్ని స్వీకరిస్తాను. నేను పరివ్రాజకుణ్ణి కావడం నాకూ, తమకూ కూడ శుభప్రదం."

మహాభిక్షువు ఇలా అన్నారు-

"మంచిదే బాబూ! పరివ్రాజకత్వాన్ని స్వీకరించడానికి ఇరవై సంవత్సరాల వయస్సు ఉండాలి. అంతవరకు ఇంటిలోనే ఉండి ఆత్మ నిర్మాణం చేసుకో."

ఆతర్వాత 20-21 సంవత్సరాల వయస్సులో మహేంద్రునికి మహాస్థవిరులు పరివ్రాజకత్వ దీక్ష ఇచ్చారు. అతడితోపాటు అతని చెల్లెలు సంఘమిత్ర కూడ పరివ్రాజకత్వాన్ని స్వీకరించింది.

అన్నా చెల్లెళ్లు పర్యటిస్తూ, ప్రజలకు జీవన నిర్మాణ విధానాన్ని బోధించసాగారు. మహిళలలో కర్తవ్య నిష్ఠనూ, ఆత్మగౌరవాన్నీ మేలుకొలిపే బాధ్యతను సంఘమిత్ర నిర్వహిస్తోంది. దురాచారాలనూ, అవినీతినీ నిర్మూలించే సాహసాన్ని మహేంద్రుడు పురుషులలో మేలుకొలుపుతున్నాడు.

మహేంద్రునికి 33 సంవత్సరాల వయస్సు వచ్చింది. ఒక రోజున మహాస్థవిరులు అన్నా చెల్లెళ్లను పిలిపించి వారితో ఇలా అన్నారు-

"శ్రీలంకలోని ప్రజలు తమ సృజనాత్మక సామర్థ్యాన్ని కోల్పోతున్నారు. వారిలో చైతన్యాన్ని నింపడానికై మీరిద్దరూ అక్కడికి వెళ్లాలి."

పరస్పర సహకారం ఆధారంగానే ప్రపంచ వ్యవస్థ సాగుతోంది.

అన్నా చెల్లెళ్లు అందుకు అంగీకరించారు.

తన తండ్రిగారు కలలు కన్న సాంస్కృతిక దిగ్విజయాన్ని నిజం చేయడానికి మహేంద్రుడు ఆవిధంగా ముందడుగు వేశాడు.

అన్నా చెల్లెళ్లు ఎక్కిన నావ తుఫానులో తలక్రిందులు అయింది. అయినా వారు వెనుకంజ వేయలేదు. సముద్రంలో ఈదుతూ ముందుకుపోయారు. అదృష్టవశాత్తు వారికి మరో నావ దొరికింది. వారు శ్రీలంక చేరారు.

రాజధానికి అడవిగుండా ప్రయాణం చేస్తున్నారు. త్రోవలో ఒక లేడి క్రిందపడి విలవిల కొట్టుకుంటోంది. దాని గొంతులో గుచ్చుకున్న బాణాన్ని బయటికి తీసేసరికి, అది ప్రాణాలు కోల్పోయింది. ఈలోగా ఆ బాణం వేసిన వేటకాడు అక్కడికి వచ్చాడు. "ధర్మ సమ్రాట్టు తిష్య పాలనలో వినోదం కోసం నిర్దయగా మీరిలా ప్రాణులను హింసించడం తగునా?" - అని మహేంద్రుడు అతనిని చూస్తూనే అడిగాడు.

రాజు దుస్తులలో ఉన్న ఆ వేటకాడు మహేంద్రుని కాళ్లమీద పడ్డాడు. "మహానుభావా! నావల్ల పొరపాటు జరిగింది. నేనే సమ్రాట్ తిష్యను."

సమ్రాట్ తిష్య ఇద్దరినీ సాదరంగా రాజ భవనానికి తీసుకువెళ్లాడు. మరునాడు మహేంద్రుడు తిష్యకు జీవన పథాన్ని గురించి బోధించాడు. పర్యటనకు బయలుదేర బోయాడు. "ఇక్కడే మీ ప్రచారం చాలా అవసరం. ఇక్కడి నుంచే మీ సందేశాన్ని ప్రజలకు అందించండి"- అని తిష్య అతడిని కోరాడు.

ఈ మాటలతో మహేంద్రునికి అక్కడి మత ప్రచారకుల ధోరణులు అవగతం అయినాయి. అతడు పర్యటనకు బయలుదేరి బౌద్ధ విహారాలను పరిశీలించాడు.

మామూలు సంసారులకన్న మిన్నగా అక్కడి విహారాల అధిపతులు భోగ విలాసాలలో మునిగి ఉన్నారు. భిక్షువులు మతం పేరుతో విలాస జీవితం గడుపుతున్నారు. సేవా మార్గం భోగ మార్గంగా మారిపోయింది. ఇక ప్రజా జీవితం అస్తవ్యస్తం కాకుండా ఎలా ఉంటుంది?

అన్నా చెల్లెళ్లు తప సాధన మార్గాన్ని అనుసరించారు. వ్యక్తి నిర్మాణాన్ని ప్రారంభించారు. దారి తప్పిన పరివ్రాజకులకు సమాజంపట్ల వారి కర్తవ్యాన్ని బోధించారు. ధార్మిక రంగాన్ని క్షాళన చేస్తూ విస్తృతంగా పర్యటించారు.

అరవై సంవత్సరాల వయస్సువరకు ప్రజా జీవనాన్ని సంస్కరిస్తూ నిర్విరామంగా కృషిచేసి, మహేంద్రుడు చైత్య పర్వతంమీద చాతుర్మాస్యం జరుపుతూ శరీరాన్ని వదిలాడు. చెల్లెలు అతడి కార్యాన్ని కొనసాగిస్తూ కొంత కాలానికి శరీరాన్ని వదిలింది.

అశోక చక్రవర్తికి కుమారులు అయిదుగురు. మిగతా నలుగురి పేరులూ కాలగర్భంలో కలసిపోయాయి. ఒక్క మహేంద్రుడే చరిత్రలో అమరుడై నిలచాడు.

వాస్తవానికి- మనిషి గొప్పతనం అధికారంలో లేదు, పదవిలో లేదు. త్యాగమయ జీవనంలో ఉంది, నిష్కళంకమైన సౌశీల్యంలో ఉంది.

త్యాగమూర్తులూ, శీలసంపన్నులూ అయిన అలాంటి యువతీ యువకులను పరివ్రాజక సంప్రదాయం నేడు మరోమారు ఆహ్వానిస్తోంది.

★★★

## సౌశీల్య సంపద

*"మీవంటి కుమారుడు నాకు కలగాలి. నన్ను పెళ్లిచేసుకోండి."*

*అని ఒక సౌందర్యవతి ఛత్రసాల మహారాజును కోరింది.*

*ఛత్రసాలుడు ఆమె పాదాలు తాకి ఇలా అన్నాడు-*

*"నేటినుండే నేను మీ కుమారుడను."*

*ఇది ఛత్రసాలుని సౌశీల్య సంపద.*

**మానవాళి ప్రగతికి మూలాధారం సహకార ప్రవృత్తి.**

# అధికారపు అహంకారం వేరు, నాయకత్వం వేరు

సౌమనస్యాన్నీ, సమన్వయాన్నీ, మార్గదర్శన సామర్థ్యాన్నీ వ్యక్తిత్వంలో నింపుకుంటే- మనిషిలో నాయకత్వ లక్షణం వికసిస్తుంది. వ్యక్తి కాక - గుణాలే ఆరాధనీయాలూ, అనుకరణీయాలూ అవుతాయి. గుణవంతుడైన వ్యక్తి యొక్క మార్గదర్శనాన్నే ప్రజలు కోరుతారు.

అయితే- నాయకత్వం పేరిట అధికారపు అహంకారం తిష్టవేస్తే- ఆ నాయకత్వానికి లోనయిన వ్యక్తులు కుంచించుకుపోతారు. అహంకారంలో, అధికార మదంలో మునిగిపోయిన వ్యక్తి ఎన్నడూ ఎవరికీ ప్రేరణ ఇవ్వలేడు. అతడి చుట్టూ చేరేవారు అతని అడుగులకు మడుగులు ఒత్తుతారు. అయినా వారికి అతనిపట్ల నిజమైన సద్భావన ఉండదు.

మనిషి జీవితంలోని ప్రతి కోణమూ ప్రేరణను ఇవ్వాలి. అతడిలో మహాసాహసపు ప్రచండ శక్తి పెల్లుబుకుతూ ఉండాలి. లక్ష్యం కోసం తన కణ కణాన్నీ ఆహుతిచేసే సామర్థ్యం అతడికి ఉండాలి. అతడి సౌశీల్యపు సువాసన అనుచరులను ఆకర్షించాలి. తన వినమ్రతతో, సద్భావనతో, సహనంతో అతడు తన బృందంలో సమన్వయాన్ని సాధించగలగాలి. తన బృందపు ప్రయోజనం కోసం తన స్వార్థాన్ని బలిచేయడానికి అతడు సదా సన్నద్ధం కావాలి. అలాంటి మనిషే నాయకుడవుతాడు. అలాంటి నాయకత్వంపై నలువైపుల నుంచీ సద్భావం, శ్రద్ధల అభిషేకం జరుగుతుంది. అతడు చేసే ఒక్క సైగ కోట్లాది ప్రజలలో ప్రాణాన్ని నింపుతుంది. లక్షలాది ప్రజలు అతడి మాటల ఆకర్షణలో మునిగిపోతారు.

జీవితపు చివరి సంవత్సరాలలో పరమపూజ్య గురుదేవుల హృదయం దేశంలోని నాయకత్వపు కొరతపట్ల తీవ్రంగా వ్యథ చెందింది. ఆ వేదన ఇలా వ్యక్తమయింది-

"సంస్థలు అధోగతి చెందుతున్నాయి. చిన్న చిన్న విషయాల కోసం జనం ఇతరులను ప్రాధేయపడుతున్నారు. ఇందుకు కారణం సమర్థ నాయకత్వం లోపించడమే."

కార్యకర్తలకు ఆయన తరచు ఇలా హితవు చెప్పేవారు-

"యోగులూ, తాపసులూ, సాధువులూ కాక- దేశానికీ సమాజానికీ దారిచూపగల, బలిదానం చేసే జీవశక్తి కలిగిన ప్రజాసేవకులు కావాలి.

"నాయకత్వం మాటల ద్వారా కాక క్రియలద్వారా అమలుజరుగుతుంది. సిద్ధాంతాల కోసం బలిదానం కావడానికి అనుక్షణం సిద్ధపడిన మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్‌ల వంటి నాయకులు నేడు అవసరం."

ఆయనలోని ఈ వేదనను తొలగించడానికి సిద్ధంగా ఉన్నామా- అని మనల్ని మనం పరీక్షించుకోవాలి. సిద్ధంగా ఉంటే- అందుకోసం మనం సద్గుణాల సముద్రంలో సాహసంగా ఈదాలి. మీ రంగంలో అర్హతను శిఖరాగ్రానికి పెంచుకోవడానికి మీరు ఉద్యమించాలి. అర్హతతోపాటు- సాహసాన్నీ, శక్తినీ మీరు పెంపొందించుకోవాలి. ఆ గుణాలను మీ సహచరులకు అలవరచగలగాలి. మనం మన సహచరుల గుణాలను వెదికి పట్టుకోవాలి. వాటిని ఇతర సహచరులకు చెప్పాలి. ఇందువల్ల మీ బృందంలో పరస్పర విశ్వాసం పెరుగుతుంది. కీర్తికీ, సన్మానానికీ ముందుకురాకపోవడమే మంచిది. మీ స్థానంలో ఆ అవకాశాన్ని మీ సహచరులకు ఇవ్వాలి. అలా చేయడంవల్ల సహచరుల మనస్సులలో నాయకత్వంపట్ల గల విశ్వాసం పెరుగుతుంది.

మీరు మీ సహచరులకు ప్రేరణ ఇవ్వాలి. వారిని ప్రోత్సహించాలి. మాటలతోనూ, భావనాత్మక కార్యములతోనూ. ఇందువల్ల సహచరుల భావనలు మరింతగా బలపడతాయి. వారి కార్యశూరత పెరుగుతుంది. పరస్పర సమన్వయం మరింత మధురం అవుతుంది.

సహచరులలో ఒకరి లోపాలను మరొకరికి చెప్పకూడదు. చెప్పితే- పరస్పర సద్భావనలు క్షీణిస్తాయి.

కొత్త కొత్త పథకాలను రూపొందించండి. వాటిని అమలుచేసే సామర్థ్యాన్ని పెంచుకోండి. మీ నాయకత్వంలో నడుస్తూన్న సంస్థ యొక్క ప్రగతిని వేగవంతం చేయడానికి కార్య ప్రణాళికలను తయారు చేయండి. అవి సమయోచితంగా ఉండాలి. వాటిని అమలు చేయడంలో ఏయే దశలు ఏయే సమయాలకు పూర్తికావాలో ఆచరణాత్మకంగా నిర్ణయించండి. పథకం ప్రతి దశలో మీ సహచరులను భాగస్వాములను చేయడానికి ప్రాధాన్యం ఇవ్వండి.

పై లక్షణాలను మీలో క్రమంగా వికసింపజేసుకుంటే- మీరు మీ రంగంలో నాయకత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించగలుగుతారు.

★★★

**సఫలతకు ఆధారం ఇచ్ఛాశక్తిలోని బలం.**

# సంకల్పశక్తిలో ఇమిడిఉంది ఆధ్యాత్మిక ప్రగతి

సంకల్పంలో ఇమిడిఉన్న శక్తి మౌలికంగా ఆధ్యాత్మిక శక్తి.

వ్యక్తి తన ఊహా తరంగాలను బుద్ధితో సవరించినపుడు, ఊహాజాలాన్ని బుద్ధి అనే కత్తితో కోసి విడదీసి దాని నానాత్వాన్ని ఏకత్వంగా మార్చినప్పుడు, ఊహలన్నీ ఏకాగ్రమై ఒకే ఊహగా రూపొందినప్పుడు- సంకల్పం అంకురిస్తుంది. హృదయంలోని భావాలన్నీ, అస్తిత్వంలోని ప్రాణశక్తి అంతా, మానసిక బలమంతా సమీకరించబడి నప్పుడు సంకల్ప శక్తి రూపొందుతుంది. వ్యక్తిత్వం మొత్తం, అస్తిత్వం మొత్తం దీనిమీదకు వచ్చి నిలుస్తుంది.

ఒకసారి సంకల్పం మేలుకుంటే- దాన్ని పూర్తి చేయవలసిందే. దానినే మన జీవితానికి పరిచయంగా, పర్యాయపదంగా, పరిభాషగా, సర్వస్వంగా చేసుకోవాలి. దానికోసమే జీవించాలి. దానికోసమే మరణించాలి. మనిషిలోని మనస్సులో, ప్రాణంలో సంకల్పంపట్ల దృఢమైన నిష్ఠ ఉదయించినప్పుడే అతనిలో సంకల్పశక్తి వికసిస్తుంది. సార్థకంగా. సమగ్రంగా.

దృఢసంకల్పం తీసుకుంటే- ఒకసారి ఒక పనిని చేపట్టితే, దేనినో పొందాలని నిశ్చయించుకుంటే- అపారమైన ధైర్యంతో దాన్ని పూర్తిచేయడానికి మనిషి ఉద్యమిస్తాడు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఎన్ని విమర్శలు చెలరేగినా, ఎన్ని ఆపదలు ముంచుకువచ్చినా- అతడు సంకల్పాన్ని కదలనివ్వడు, జారనివ్వడు. సంకల్పం పూర్తయ్యేవరకూ నిర్విరామంగా కార్యశూరతను ప్రయోగిస్తాడు.

ఆధ్యాత్మిక దృక్పథాన్ని అవలంబించి, సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుణ్ణి తన స్వామిగా, ప్రియుడుగా పరిగణించే వ్యక్తి చేసే సంకల్పంలో ఎదురయ్యే ఆటంకాలన్నీ మరో రూపంలో అతనికి సహాయకాలు అవుతాయి. ఈ విఘ్నాలవల్ల, ఈ అవరోధాలవల్ల అతని శక్తి క్రమంగా బలపడుతూఉంటుంది.

సంకల్ప శక్తి క్షీణించడానికీ, బలహీనపడడానికీ, విచ్ఛిన్నం కావడానికీ, ముఖ్య కారణం విచారించే అలవాటు. ఈ ప్రపంచం దివ్యమైన పరమేశ్వర యోజన. ఇది ఆ ప్రభువు ఇచ్ఛ ద్వారా అదుపుచేయబడుతోంది. ఈ సత్యాన్ని అవహేళన చేసే వ్యక్తికి పరమేశ్వరునికి సమర్పితమయే కళ తెలియదు. ఫలితంగా అతడి మనస్సులో చింతా, ఉద్వేగమూ, రకరకాల ఊహాపోహలూ జనిస్తాయి. ఇలా విచారించే వ్యక్తిలోని సంకల్పం బలహీనపడుతుంది.

సంశయం, సందేహం, భయం, వ్యగ్రతలవల్ల కూడ సంకల్ప శక్తి క్షీణిస్తుంది; వ్యక్తి నిరాశావాది అవుతాడు.

ఈ ప్రపంచంలో ఏర్పడే ప్రతి పరిస్థితిలో మంచీ చెడూ ఉంటాయి. భావాత్మకంగా, నిర్మాణాత్మకంగా ఆలోచించే కళలో మనం ప్రావీణ్యం సంపాదిస్తే- మన ఆంతరిక శక్తులు బలపడతాయి, మన సంకల్ప శక్తి పెరుగుతుంది.

శ్రీరామకృష్ణ పరమహంస శిష్యుడయిన మాస్టర్ మహాశయుణ్ణి ఒక కొత్త భక్తుడు అడిగాడు- మీ ఆధ్యాత్మిక జీవిత రహస్యం ఏమిటి అని. పవిత్రమైన చిరునవ్వు చిందిస్తూ మాస్టర్ మహాశయుడు ఇలా అన్నారు-

"సంకల్ప శక్తికి మరో రూపం ఆధ్యాత్మిక శక్తి. సంకల్ప శక్తి వికసించడానికి సూత్రాలు ఇవి-

1. ప్రతి వైఫల్యం తర్వాత నిన్ను నీవు లోతుగా పరీక్షించుకో. నీ దోషాన్ని ఇతరులపై రుద్దకు. దాన్ని ఒప్పుకుని సవరించుకో.

2. అహంకారాన్ని కాక- సద్గుణాలను పెంచుకో.

3. పరమేశ్వరుడు పెట్టే పరీక్షలను స్వాగతించు. ప్రతి కష్టమూ మన యోగ్యతను పెంచుకోవడానికే వస్తుంది.

4. మనం విరోధులతో, దుర్మార్గులతో కూడా వ్యవహరించవలసి వస్తుంది. అప్పుడు మనం సహనంతో, ఔదార్యంతో ప్రవర్తించాలి.

5. శారీరిక తపస్సుతో ప్రారంభించు. ఉపవాసం, అస్వాదు వ్రతం, మౌనం మున్నగు వాటిని ఆచరించు."

★★★

**పదిమంది ఉపాధ్యాయులు నేర్పలేనిదాన్ని కష్టాలు నేర్పుతాయి.**

# సాధన సాఫల్యం ఆర్ద్ర సంవేదనలో

ఆర్ద్రమైన సంవేదన జీవన సాధనకు ఇరుసు, కేంద్ర బిందువు. సంవేదనలు సంస్కరించబడితే, జీవితంలో మహత్తరమైన సంతృప్తి అనుభవ మవుతుంది.

భావనలు సక్రమంగా అంకురిస్తే, వాటికి ఎరువూ నీరూ సక్రమంగా అందితే- జీవితంలో అద్భుతమైన పరివర్తన వచ్చితీరుతుంది. అలాంటి వ్యక్తి సద్గుణాలన్నింటికీ స్వామి అవుతాడు. అతడి వ్యక్తిత్వ సుగంధంతో వాతావరణమంతా గుబాళిస్తుంది. సంవేదనశీలతలోని ఆకర్షణ దానికదిగా సద్గుణాలను సృష్టిస్తుంది.

భావనలు పంచితే అందుతాయి. వెదజల్లితే పెంపొందుతాయి. పోగుచేస్తే మాత్రం నశించిపోతాయి. కనుక- భావనాత్మక సంతృప్తిని కోరే వ్యక్తి తన భావనలను పీడితులకూ, తాడితులకూ పంచిపెట్టాలి. పరమపవిత్రమైన ఈ నిష్కామ కర్మ ఇచ్చే సత్‌ఫలితం అపారమైన సంతృప్తి.

స్వామి రామతీర్థ అమెరికాలో విస్తృతంగా పర్యటించారు. తపస్సు, జ్ఞానం, ప్రేమల త్రివేణిలో నిరంతరం స్నానంచేయడంవల్ల ఆయన వ్యక్తిత్వంలో అలౌకికమైన ఆకర్షణ ఆవిర్భవించింది. అసంఖ్యాకులైన వ్యక్తులు వ్యథలతో వేదనలతో పరుగు పరుగున ఆయన వద్దకు వచ్చేవారు. నవ్వుతూ తుళ్లుతూ తిరిగివెళ్లేవారు.

ఒక రోజున ఒక మహిళ ఆయనవద్దకు వచ్చింది. అంతులేని విషాదంతో వచ్చింది. దుఃఖ భారంతో ఉన్న ఆమెకు మాటలు పెగలలేదు. చాలా సేపు అలా బొమ్మలా కూర్చుండిపోయింది. రామతీర్థ కరుణతో ఆర్ద్రమైన కళ్లతో ఆమెను పరికిస్తున్నారు.

వెలుగును వర్షిస్తూన్న ఆ చూపు ఆమె హృదయపు లోతులను తాకింది. కరుడుకట్టిన ఆమె విషాదం కరిగి కన్నీరుగా వెలికివచ్చింది. కన్నీళ్లు కార్చుతూ, పూడిపోయిన గొంతుతో ఆమె తన విషాద గాథను వివరించింది.

ఆ కథ సారాంశం ఇది- ఆమె ప్రేమించి మోసపోయింది. తనువూ, మనసూ, ధనమూ, జీవితమూ అన్నీ నిస్సారం అయిన తర్వాత ఆమె మోసగించబడింది. ఆమెకు మిగిలింది హతాశయే.

ఆ కథ విన్న స్వామీజీ గంభీరంగా ఇలా అన్నారు-

"సోదరీ ! ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కడూ తన సామర్థ్యానికి అనుగుణంగా వ్యవహరిస్తాడు. తనవద్ద ఉన్న శారీరిక, మానసిక, బౌద్ధిక, భావనాత్మక సామర్థ్యాన్ని బట్టి మనిషి ప్రవర్తిస్తాడు. స్వార్థంతో, కుటిలతతో నిండిన వ్యక్తి క్షమకు మాత్రమే పాత్రుడు. ప్రేమపూరిత హృదయంతో అతడిని క్షమించాలి."

"అయితే జీవితంలో నిజమైన ప్రేమను పొందడం అసాధ్యమా?"- అని ఆ మహిళ అడిగింది.

స్వామీజీ ఇలా అన్నారు-

"అసాధ్యం కానే కాదు. నిజంగా ప్రేమించే వ్యక్తికి నిజమైన ప్రేమ అందుతుంది."

"నా ప్రేమ స్వచ్ఛమైనదే"- అన్నది ఆ మహిళ.

"కాదమ్మా. నీ ప్రేమలో స్వార్థపు కోరిక ఉంది. దానిలో వాసన అనే విషం ఎంతో కొంత ఉంది. నిజమైన ప్రేమ సేవగా, కరుణగా, శ్రద్ధగా మాత్రమే వ్యక్తం అవుతుంది."

రామతీర్థ మాటలలోని సారం ఆమెకు అవగత మయింది. ప్రేమ ఇవ్వబడేది మాత్రమే. అందులో పొందాలనే కోరిక ఉండదు. వాసన, తృష్ణ, అహంల నుండి విముక్తి పొందిన భావనల పేరే ప్రేమ. ఈ బోధనను ఆమె జీర్ణం చేసుకున్నది. ఒక ఆసుపత్రిలో నర్సుగా చేరింది. నిష్కామ సేవా మార్గంలో ఆమె భావనలు ప్రవహించాయి.

చాలా రోజుల తర్వాత ఆమె రామతీర్థను తిరిగి కలుసుకున్నది. ఆమె వ్యక్తిత్వంలో అపురూపమైన మెరుపు ఉంది. సంతృప్తి ఇచ్చిన మెరుపు అది. అంతే కాదు. పలువురి స్నేహ భావనలు అడగకుండానే ఆమెకు అందుతున్నాయి. పవిత్ర ప్రేమ ఆమె జీవితాన్ని ధన్యం చేసింది.

వాస్తవానికి- ఇస్తూన్న వ్యక్తికే ఆర్ద్ర సంవేదనల రహస్యం తెలుస్తుంది.

★★★

*ఈ పత్రికను మీరు చదివిన తర్వాత*
*ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.*

**మన వివేకానికీ, కార్యశూరతకూ దేవుడు విసిరే సవాళ్లు - ఆపదలు.**

# ఉత్కృష్టతకు ఊపిరి ఆదర్శవాదం

ఉత్కృష్టతవైపు పయనించాలంటే ఆదర్శాలను స్వీకరించాలి. తమ జీవితాలను పూర్తిగా ఆదర్శాలతో నింపుకున్న మహానుభావుల జీవితాలలో ప్రేరణలు అవతరించాయి, సంవేదనలు వృద్ధిపొందాయి, ఆశీస్సులు పుష్పించాయి. వారి విధానాలు వేరుకావచ్చు. వారి సంవేదనలు విభిన్నములు కావచ్చు.

మహాత్మా గాంధీ భగవద్గీతను తన ఆదర్శంగా స్వీకరించారు. భగవద్గీతను ఆయన గీతామాత అని పిలిచేవారు. ఆచార్య వినోబా కూడ గీతను గీతాఈ (గీతామాత) అని వర్ణించేవారు. నిష్కామ కర్మ వారిద్దరికీ జీవన పథం. దానికి వారు అనాసక్తి యోగమని పేరుపెట్టారు. 'నాకు సమస్య ఎదురయినప్పుడల్లా గీతామాత దానికి పరిష్కారం చూపేది'- అన్నారు.

చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్‌లకు ఆదర్శం దేశభక్తి. వారు తమ సమస్త భావనలనూ, ఆలోచనలనూ దేశభక్తిలో ముంచివేశారు; దేశభక్తిలో క్షాళన చేశారు. వారి జీవితాలలోని ప్రతి శ్వాస జాతికోసం అర్పితమయింది. భరతమాతయే వారికి సర్వస్వం. వారు భరతమాత కోసం జీవించారు. ప్రతి క్షణం మాతృభూమి స్వేచ్ఛ కోసం సంఘర్షణ జరుపుతూవచ్చారు. చివరకు అందుకోసమే బలి అయినారు. ఆ ఆదర్శం కారణంగా వారి జీవితాలు అజరామరములు అయినాయి.

పవిత్ర జీవితాలను కూడ మనం ఆదర్శాలుగా స్వీకరించవచ్చు. స్వరాజ్య ఉద్యమంలో పలువురు యువకులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని దేశసేవకు అంకితం అయినారు. ఆయన వ్యక్తిత్వాన్ని హృదయంలో ధారణచేసి, పలువురు జీవ-సేవకు అంకితం అయినారు. రామకృష్ణ మిషన్ ఇలాంటి వ్యక్తులను కలిపిన సంస్థ.

స్వామి వివేకానందను ఆదర్శంగా చేసుకున్న వ్యక్తులు ఆయన పేరు వల్లిస్తూ కూర్చోలేదు. ఆయనవలె జీవించే సాహసం చేశారు. ఆదర్శాన్ని స్వీకరించడం అంటే అర్థం ఇదే ! తన ఆదర్శ వ్యక్తిత్వానికి అనుగుణంగా ఆలోచించడం, జీవిత విలువలను ఎంపిక చేసుకోవడం, వాటికి అనుగుణంగా పవిత్రమైన జీవన సరళిని అవలంబించడం. ఆదర్శంపట్ల ప్రేమకు గీటురాయి ఇదే. ఈ గీటురాయి మీద గీసినప్పుడు అన్నివిధాలా నిగ్గుతేలాలి- అందుకోసం ఎన్ని కష్టాలను భరించవలసివచ్చినా, ఎన్ని ఆపదలను ఎదుర్కొనవలసి వచ్చినా.

ఈ యుగంలో మనందరిముందూ యుగఋషి పరమపూజ్య గురుదేవుల ఆదర్శం ఉన్నది. వారి ప్రఖర తేజోమయ జీవితం, శ్రేష్ఠతమ జీవన సాధన, దేశ ధర్మాల కోసం ధరిత్రి కోసం తమ అణువణువునూ ఆహుతి చేయాలనే భావన ఎవరికయినా ఆదర్శాలు కావచ్చు. పలువురికి ఆదర్శాలు అయినాయి కూడా. దేశ విదేశాలలోని కోట్లాది యువతీ యువకులు, మేధావులు, భావనాశీలురు, కౌమార దశలో ఉన్న వ్యక్తులు ఆయన వ్యక్తిత్వాన్ని తమ ఆదర్శంగా స్వీకరించారు; వారు నిర్ణయించిన కొలబద్దలకు అనుగుణంగా జీవించే సాహసం చేస్తున్నారు. వారిలో పలువురు ఈ క్షణంలో ఈ వాక్యాలను చదువుతూన్న వ్యక్తులలో ఉన్నారు.

ఇతరులు కూడ ఆ మార్గాన్ని అనుసరించి జీవన సాధనను ప్రారంభించవచ్చు. వారు దిగువ పనులు చేయవచ్చు-

1. యుగఋషి గురుదేవుల గురించి చదవడం. ఆయన వ్యక్తిత్వంలోని ప్రతి కోణం గురించీ ప్రగాఢంగా మననం చేయడం.

2. గురుదేవులతో ప్రగాఢమైన భావనాత్మక సంబంధాన్ని ఏర్పరచుకోవడం- నిరంతర చింతన ద్వారా.

3. గురుదేవులు స్థాపించిన తప, త్యాగ, సేవల విలువలపట్ల నిష్ఠను పెంపొందించుకోవడం.

4. తపం, సేవ, దేశభక్తి- వీటి కోసం క్రమ పద్ధతిలో ముందడుగు వేయడం.

ఈ నాలుగు సూత్రాల కార్యక్రమాన్ని అమలుచేసిన వ్యక్తి జీవితం యుగఋషి జీవితానికి అనుగుణంగా రూపొందుతుంది. ఈ ప్రపంచంలో కార్యశీలంగా ఉంటున్నప్పటికీ- ఆ వ్యక్తి జీవనచేతన గురుదేవుల సమీపంలోనే ఉంటుంది.

★★★

**అనుకూల పరిస్థితులను ఆకర్షించే శక్తి - ఆకాంక్ష.**

జీవన సాధనకు పావన ప్రేరణ

# ఋషిత్వాన్ని ప్రసాదించిన పంచాగ్ని విద్య

యమాచార్యునికి ఆయన భార్య ఇలా సవినయంగా నివేదించింది-

"నచికేతుడు కుర్రవాడు. అతడి పట్ల మీరు ఇంత కఠోరంగా ఉండడం బాగుందా? జొన్న రొట్టెలూ, మజ్జిగా తప్ప ఆ పసివాడికి మరో ఆహారం లేదు. నెల రోజులుగా ఇదే పద్ధతి. ఇతర బ్రహ్మచారులూ, నా కుమారులూ షడ్‌రుచులతో భోజనాలు చేస్తున్నారు. అతడిపట్ల ఇంత కాఠిన్యం ఎందుకు?"

యమాచార్యుడు నవ్వి ఇలా అన్నారు-

"దేవీ ! సాధన ఒక సమరం. యుద్ధంలో ప్రాణం పోవచ్చు. అయినా గెలుపు సందిగ్ధమే. ఇప్పుడు నచికేతునికి అన్న సంస్కారం జరుగుతోంది. పరమాత్మ చేతన అత్యంత పవిత్రమైనది. అగ్నివంటిది. శరీరం సమర్థంగా లేకపోతే, నచికేతుడు దాన్ని ధారణ చేయలేడు. ఈ అన్న సంస్కారం అతడి అన్నమయ కోశంలోని విజాతీయ ద్రవ్యాలను తొలగిస్తుంది. ఆత్మ సాక్షాత్కారానికి తగిన విధంగా దాన్ని క్షాళన చేస్తుంది. ఇది కత్తిమీద సాము. అయితే నచికేతుడు గొప్ప సాహసి, ఆత్మ జిజ్ఞాసువు. అతడు దీన్ని సులువుగా నిర్వహించగలడు."

నచికేతుని అన్న సంస్కారం ఇలా సంవత్సరంపాటు సాగింది. ఆ తర్వాత ప్రాణాయామ సాధన ప్రారంభమయింది. ప్రాణాకర్షణ, అనులోమ-విలోమ, సూర్య వేధన, ఉజ్జాయీ, నాడీ శోధన మున్నగు ప్రాణాయామాల అభ్యాసం జరిగింది. యువ సాధకుని ముఖ మండలంపై తేజస్సు పెరిగింది. అయితే అతడి ఆహారం తగ్గిపోతోంది. గురుపత్ని మరోమారు ఇలా నివేదించింది-

"స్వామీ ! నచికేతుడు ఇతరుల పుత్రుడు. మన పుత్రులపై కఠినంగా ఉండవచ్చు. ఇతరుల పుత్రులపట్ల ఉండకూడదు కదా."

యమాచార్యుడు మళ్లీ నవ్వి ఇలా అన్నారు-

"దేవీ ! శిష్యుడు పుత్రునికన్న మిన్న. ఈ బాలుని హృదయంలో తీవ్రమైన ఆత్మ జిజ్ఞాస ఉంది. అతడు వీరుడు, సాహసి. సాధనలోని ప్రతి కష్టాన్నీ భరించగలడు. కనుకనే మేము అతడికి పంచాగ్ని విద్యను బోధిస్తున్నాము. ఆర్యావర్తంలోని యువతరం పిరికివాళ్లుగా, బలహీనులుగా ఉండకూడదు. ఈ ఆత్మ విద్య నశించిపోకూడదు. ఈ దృష్టితోకూడ నచికేతుడు ఈ సాధన చేయడం మంచిది. అతడి ఆహారం తగ్గింది. నిజమే. అయితే, ప్రాణం దానికదిగా ఆహారం. ఆత్మ అగ్ని రూపం. అది ప్రాణం. అది తేజస్సు. ప్రాణాయామంవల్ల అది బలపడుతుంది. తద్వారా అతడికి పౌష్టిక ఆహారం అందుతుంది. ప్రాణమయ కోశం యొక్క సంస్కరణ మనోమయ కోశానికి తప్పనిసరి."

ప్రాణ సాధనలో ఒక సంత్సరం గడిచింది. యమాచార్యుడు నచికేతునికి మనస్సు యొక్క ప్రతి సంకల్పాన్నీ పూర్తిచేయడం బోధించారు. అతడు నిద్ర పోతున్నప్పుడు- అచేతన మనస్సు యొక్క పూర్వ జన్మల క్రియలు కలల తెరలపై ప్రతిబింబించాయి. వాటిలో పాప కార్యాలు కూడ ఉన్నాయి. అవి వెలికిరావడం వల్ల ఆత్మక్షోభ కలిగింది. అతడు వీటన్నింటినీ గురువుగారికి చెప్పవలసి వచ్చింది. గురుపత్ని ఇందుకు కూడ అభ్యంతరం చెప్పింది. అందుకు యమాచార్యుడు ఇలా అన్నారు-

"ఈ ఆత్మక్షోభ మరేమీ కాదు. పూర్వ జన్మల పాపాల సంస్కారం మాత్రమే. సాధకుడు ఈ జన్మలో చేసిన పాపాలనూ, గత జన్మలలో చేసిన పాపాలనూ ప్రకటించాలి. వాటికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అప్పుడే అతడి మనస్సులోని ముడులు విడిపోతాయి."

**కష్టకాలంలో మిత్రులు - సాహసం, ప్రయత్నం.**

మనోమయ కోశ క్షాళనకై నచికేతుడు కృచ్ఛ చాంద్రాయణం నుండి గోమయ-గోమూత్ర సేవనంవరకు ప్రాయశ్చిత్త సాధనలన్నీ చేయవలసివచ్చింది. ఈ సాధనల కఠోరత పెరిగిన కొలదీ గురుపత్ని హృదయం మరింతగా ద్రవించిపోతోంది. అయితే- ఆత్మ యొక్క గ్రంథులను ఛేదించి దానిని వ్యక్తపరచడం ఎంతటి మహా సమరమో యమాచార్యుడు ఆమెకు వివరించారు. నచికేతుణ్ణి తపింప జేయడానికి ఆయన ఏమాత్రం వెనుకాడలేదు.

మూడు సంవత్సరాలు గడిచాయి. నచికేతునికి సుఖమంటే ఏమిటో తెలియలేదు. శరీరాన్ని అతడు క్షాళన చేశాడు. అయినా శరీరం క్షీణించిపోయింది. ప్రాణములపై అదుపును కూడ అతడు నేర్చుకున్నాడు. అయితే అందువల్ల మనస్సు క్షీణించింది. మనోమయ కోశాన్ని కూడ అతడు జయించాడు. అతడు మనస్సును బ్రహ్మరంధ్రంలోనికి పంపాడు. సూక్ష్మ జగత్తులోని విజ్ఞానమయ రహస్యాలను అన్వేషించాడు. ఆత్మవరకు చేరి, దానిని క్షోభింపజేశాడు. మేలు కొలిపాడు, సంపాదించాడు. మనస్సును అదుపుచేసి- క్రమంగా ఆజ్ఞా చక్రం, విశుద్ధ చక్రం, మణిపూర చక్రం, స్వాధిష్ఠాన చక్రం, అనాహత చక్రాలను ఛేదించి మూలాధార చక్రంలోకి ప్రవేశించాడు. అక్కడ కూర్చుని ఉన్న మహావిద్యా రూపిణి అయిన కుండలిని కదిలింది. అతడి మనస్సు కంపించింది. అయితే మరుక్షణంలోనే అంతఃకరణ నుండి ఒక పిలుపు వచ్చింది- 'నచికేతుడా ! ఈ భౌతిక సుఖం లభించినప్పటికీ, ఇంద్రియాలు వాటిని ఎంతకాలం అనుభవించ గలుగుతాయి? అక్షయమూ, అవినాశి అయిన ఆత్మను నీవు వరించు.'

పున్నమి రోజు. వసంత ఋతువు. నాలుగు సంవత్సరాలుగా నిరంతరం ఉగ్ర తపస్సు చేస్తూన్న నచికేతుని శరీరం పూర్తిగా క్షీణించిపోయింది. ఈ రోజు అతడికి అతి ప్రముఖమైన రోజు. ఒక ప్రాణాన్ని రెండవ ప్రాణంలో ఇముడ్చుతూ అతడు మూలాధారం వరకు చేరాడు. ఆ ఆదిశక్తిని తన సంకల్పంతో దెబ్బకొట్టాడు. చిర నిద్రలో ఉన్న కుండలిని చలించలేదు. అతడు మరింత తీవ్రంగా దెబ్బకొట్టాడు. దెబ్బతిన్న కాలసర్పిణి బుసకొడుతూ లేచింది. సహస్రారంవరకు వెళ్లి మళ్లీ మళ్లీ బుసకొట్టసాగింది. అది నచికేతుని మనస్సు యొక్క స్థూల భావాన్ని ముంచివేసింది, కాల్చివేసింది. నచికేతుడు నేడు మనసుగా మిగిలిపోకుండా- ఆత్మ అయిపోయాడు. అతడి లౌకిక, భౌతిక వాసనలన్నీ పూర్తిగా దగ్ధం అయిపోయాయి. అతడు ఋషి అయినాడు.

అతడు ఇప్పుడు బ్రహ్మలో విలీనం కాగలుగుతాడు. అయినా- తన మహత్తర సంస్కృతిని ఉద్ధరించాలనే సంకల్పంతో అక్కడనుండి బయలుదేరాడు. నవ నిర్మాణ మహా కార్యానికి అంకితం అయినాడు. ఈ పంచాగ్ని విద్యను ప్రపంచమంతటా ప్రసారం చేసి, అమర సాధకుడుగా కీర్తి గడించాడు.

★★★

## మానవత్వమే మహత్తరం

*1936లో జరిగిన సంఘటన. అస్పృశ్యతా నివారణ పర్యటనలో మహాత్మా గాంధీ ఒరిస్సాలో ఒక ఊరిలో ఆగారు. పండితుల బృందం ఆయనతో శాస్త్రార్థం చేయడానికి వచ్చింది. గాంధీజీ సాదరంగా వారిని కూర్చోబెట్టి ఇలా అన్నాడు-*

*"పండితశ్రేష్ఠులారా ! నేను శాస్త్రాలను చదవలేదు. కనుక ఓటమిని అంగీకరిస్తున్నాను. అయితే- ప్రపంచంలోని శాస్త్రాలన్నీ కలిసినా మానవాళి ఏకత్వం అనే సిద్ధాంతాన్ని వమ్ముచేయలేవని నా నమ్మకం. మానవత్వం ఒకవైపు. మీ శాస్త్రాలు మరోవైపు. నా ధర్మం ఇదే. తుదిశ్వాస వరకు నేను ఈ ధర్మం మీదనే నిలబడతాను.*

*స్పష్టమైన ఈ ప్రకటన విన్న పండితులు సిగ్గుపడి జవాబు చెప్పకుండా తిరిగి వెళ్లారు.*

**అత్యాశవల్ల అధోగతి చెందారు - అలగ్జాండరు, జూనియస్ సీజరు, ఔరంగజేబు.**

# ప్రజా సేవకులకు విషతుల్యం-అహంకారం

సముద్ర మథనంవల్ల 14 రత్నాలు వెలికివచ్చాయి. అయితే, అంతకుముందు రెండు వెలికివచ్చాయి- హాలాహలం, ఆ తర్వాత మద్యం. హాలాహలం చూడడానికి ఎంతో ఆకర్షకంగా ఉంది. మద్యం పెదవులకు తగలగానే నిషా కలిగించేది. దాన్ని రుచి చూస్తే ఇక వదల బుద్ధి కాదు. దాన్ని పొందడానికి దేవతలూ, దానవులూ ఉబలాటపడ్డారు. అది చూడడానికీ రుచికీ ఆకర్షకంగా ఉన్నా, చివరికి వినాశనాన్ని తెచ్చిపెడుతుందని వారికి నచ్చజెప్పడానికి ప్రజాపతి ప్రయత్నించాడు. పరమశివుడు హాలాహలాన్ని తన కంఠంలో ధారణ చేశాడు. దానవులు పట్టుపట్టి మద్యాన్ని త్రాగారు. ఫలితంగా - వారి బలం దుర్వినియోగం అయింది; పతన పరాభవాలకు కారణం అయింది.

ప్రజాసేవా రంగంలో ప్రవేశించేవారిపట్ల ప్రజలలో శ్రద్ధా గౌరవాలు ఉప్పొంగుతాయి. పరమార్థాన్ని సాధించాలనే సాహసం సన్మానాన్ని చూరగొంటుంది. ప్రజా సేవకులపై ప్రశంసల వర్షం కురుస్తుంది. జీర్ణించుకోలేకపోతే - అమృతంసైతం విషంగా పరిణమిస్తుంది. కీర్తిని జీర్ణించుకోలేకపోతే అహంకారం ఉదయిస్తుంది. ఆ అహంకారాన్ని తృప్తిపరచడానికై ప్రజాసేవకుడు తన ఆలోచననూ, శీలాన్నీ, వ్యక్తిత్వాన్నీ, భవిష్యత్తునూ దిగజార్చుకుంటాడు. పతనం అవుతాడు. కనుక - కీర్తిని జీర్ణించుకోలేనివారు ప్రజాసేవా రంగంలో ప్రవేశించక పోవడం మంచిది. అందువల్ల వారు తమకూ, సమాజానికి మరింతగా సేవ చేసినవారు అవుతారు.

మనిషిని పతన, పరాభవాల ఊబిలోకి దింపే దుష్ట ప్రవృత్తులు మూడు- వాసన, తృష్ణ, అహం. నర పశువులు వాసన, తృష్ణలలో మునిగి గానుగెద్దు జీవితాలను గడుపుతారు. మరి- అహంకారానికి విశ్రాంతి ఎక్కడ? మొత్తం ప్రశంసనూ, మొత్తం సన్మానాన్నీ, మొత్తం అధికారాన్నీ తన చేతుల్లో ఉంచుకోవాలని కోరుకుంటుంది అహంకారం. ఇతరులతో భాగస్వామ్యాన్ని అది సహించదు. ఇది కలహాలకు కారణం అవుతుంది. అహంకారాలు పరస్పరం తలపడతాయి? ప్రతీకారంగా, దురాక్రమణగా, అపహరణగా, పీడనగా పరిణమిస్తాయి. ఫ్యూడల్ వ్యవస్థలోని దురాచారాలకు మూలం అహంకారపు విజృంభణయే. ప్రపంచంలో జరిగిన యుద్ధాలలో చాల భాగం అహంకారాన్ని తృప్తిపరచేందుకు జరిగినవే. కంసుడు, రావణుడు, హిరణ్యకశిపుడు, వృత్రాసురుడు, సహస్రబాహువు, జరాసంధుడు, అలగ్జాండరు, నెపోలియన్, చెంగిజ్ ఖాన్ వంటివారు జరిపిస రక్తపాతం వెనుక వారి అహంకార తృప్తి తప్ప మరొకటి లేదు.

కాగా- జీర్ణం కాని కీర్తి పిచ్చిపట్టిన ఏనుగులా సమాజసేవకుణ్ణీ, అతడి సహచరులనూ, అతడి సంస్థనూ సర్వనాశనం చేస్తుంది. ఏనుగుకు పిచ్చెక్కితే- అది మొట్టమొదట తనవాళ్లపైననే విరుచుకుపడుతుంది. అలాగే- లోకేషణ అనగా కీర్తి పిచ్చిది అయితే, అది మొట్టమొదట తన సహచరులను మూర్ఖులుగా, చిన్నవారుగా, పనికిరాని వారుగా, దుష్టులుగా నిరూపించడానికి ప్రయత్నిస్తుంది. తద్వారా ఆధిక్యాన్నీ, విశిష్టతనూ ఋజువుచేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. సహచరులతో కలసిమెలసి ఉంటే- అహంకారి గొప్పతనం ఎలా వెలికివస్తుంది? కనుక అతడు తోటి వృక్షాలను నరికివేయవలసి వస్తుంది. మొత్తం వనంలో తాను ఒక్కడే కల్పవృక్షంగా వెలిగిపోవడానికి.

కనుకనే- యుగ శిల్పులకు సప్త మహావ్రతాలు నిర్దేశించబడ్డాయి. వాటిని పాటిస్తే- వారి వ్యక్తిత్వం వికసిస్తుంది. వారి ఆత్మబలం పెరుగుతుంది. మరింత ఉన్నత స్థాయి సేవా సాధన జరపడానికి వారు సమర్థులు అవుతారు.

ప్రజా సేవకుణ్ణి ప్రజలు గౌరవిస్తారు. వాస్తవానికి అది సేవాధర్మానికి ఇచ్చే గౌరవం. ఆ సేవా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న సంస్థకు ఇచ్చే గౌరవం. సదాశయాల పట్ల, ఆదర్శాలపట్ల ప్రజలలో శ్రద్ధా గౌరవాలు నిలచి ఉండడానికే ప్రజాసేవకులపట్ల ప్రజలు గౌరవాన్ని ప్రకటిస్తారు.

**అవినీతిపరుడు ఎరను మ్రింగిన చేప.**

వారిని సన్మానిస్తారు. ప్రజాసేవకుడు దానిని తన వ్యక్తిగత అర్హతకు ప్రతిఫలంగా పరిగణించడంలోనే జరుగుతుంది పొరపాటు. అతడు అహంకారంలో మునిగిపోతాడు. సన్మానాన్ని పొందడం తన హక్కు అని భావిస్తాడు. అందులో లోటు జరిగితే సహించలేడు. మరింతగా సన్మానం పొందాలని ఉబలాటపడతాడు. సన్మానాన్ని పంచుకుంటారు కనుక- సహచరులను తొలగించడానికీ, దించివేయడానికీ ప్రయత్నిస్తాడు. దీని ఫలితాలు ఎలా ఉన్నా- కీర్తికండూతి, అధికార వ్యామోహం, అహంభావం దాచినా దాగవు. పెల్లుబికి వెలికివస్తాయి. ఫలితంగా ద్వేషం, తిరస్కారం పెంపొందుతాయి. అనౌచిత్యంపట్ల తిరస్కార భావం మొట్టమొదట సహచరులలో జనిస్తుంది. అది విస్తరిస్తుంది. చివరకు అతడు తన సేవా సాధనవల్ల సంపాదించిన ఆదరాభిమానాలను సైతం కోల్పోతాడు.

ఏ రంగంలో అయినా పైకిరావడానికి ఎంతగానో ప్రయత్నించవలసివస్తుంది. పదిమందిలో కనబడడానికి రకరకాల పద్ధతులను అవలంబించవలసివస్తుంది. కీర్తి కాంక్ష కలిగిన వ్యక్తి అలాంటి అనుచిత పద్ధతులను అనుసరిస్తాడు. ఏదో ఒక సాకుతో తన ముఖం మాటి మాటికీ ప్రజలకు చూపడానికి అతడు తంటాలు పడతాడు. తన ప్రాముఖ్యాన్ని చాటుకోవడానికై ఆడంబరాలను ప్రదర్శిస్తాడు. ఔచిత్యం లేకున్నా, ఆహ్వానం లేకున్నా- వేదికమీదకు వచ్చి నిలబడతాడు ఏదో పెద్ద బాధ్యతను నిర్వహిస్తున్నట్లు. తన పేరు, ఫొటో పత్రికలలో పడాలని ఉబలాటపడతాడు. తాను చేసిన దానం గురించి తానే నలుగురికీ చెప్పుకుంటాడు. ఇతరులు చెప్పుకోవడానికి మార్గాలను వెదకుతాడు. తాను ఫలానా మొత్తం దానం ఇచ్చినట్లు ఫలకంమీద వ్రాయిస్తాడు.

అయినా- అతడి బండారం ఇట్టే బయటపడుతుంది. ఫలితంగా అతడు ఏవగింపునకూ, తిరస్కారానికీ గురి అవుతాడు. కీర్తితోపాటు- పరోక్షంగా డబ్బు దోచుకునే అవకాశాలు ఏర్పడతాయి. అయితే- ఇలాంటి వంకర దారులు పట్టేవారు ఆంతరికంగా పతనం అవుతారు. తిరస్కారానికీ, ఉపేక్షకూ, బహిష్కరణకూ గురి అవుతారు.

ఇదంతా అహంకారాన్ని పెంచుకున్నందువల్ల కలిగిన ప్రతిఫలం. కీర్తి కాంక్ష వ్యంగ్యానికీ, ఎగతాళికీ, తిరస్కారానికీ దారితీస్తుంది. ప్రజాసేవకుడు విదూషకుని స్థాయికి దిగజారిపోతాడు.

ఈ దురవస్థ దాపురించకుండా ఉండాలంటే- సమాజ సేవకుడు మొదటినుండి మెలకువ వహించాలి. నమ్రత, స్నేహ సౌజన్యాలు మరింతగా ఆదరాభిమానాలను చూరగొంటాయి. కీర్తికాంక్ష నీడ వంటిది. దానివెనుక పరిగెత్తేవారు విఫల మవుతారు. వారికి మనస్తాపం, పశ్చాత్తాపం తప్ప మరేదీ మిగులదు. ప్రాధాన్యాన్నీ, కీర్తినీ ఇతరులకు పంచి, తాము వెనుక ఉండేవారు ప్రజల శ్రద్ధా గౌరవాలను సంపాదిస్తారు. శ్రమసాధన, పరమార్థ పరాయణత్వం ఆధారంగా లభించే ఆత్మ సంతృప్తియే తమకు చాలని భావించే వివేకవంతులకు కోరకుండానే కీర్తి లభిస్తుంది. వారికి స్నేహ సద్భావాలు పుష్కలంగా అందుతాయి. సహచరుల, పరిచయస్థుల విశ్వాసం, సహకారం దండిగా లభిస్తాయి.

కనుక- ప్రజాసేవకుడు కీర్తి కాంక్షనూ, పదవీ వ్యామోహాన్నీ, అహంకారాన్నీ పూర్తిగా వదులుకోవాలి. వినమ్రతను అలవరచుకోవాలి. అలా చేయడంలోనే దూరదృష్టి ఉంది. 'సాదా జీవితం, ఉదాత్త ఆలోచన'- అనే సిద్ధాంతాన్ని అతడు అక్షరాలా అమలుచేయాలి. తన దృక్పథంలో, శీలంలో, వ్యవహరణలో శిష్టాచారాన్ని ప్రతిబింబించాలి. అప్పుడు అతడు తన ప్రత్యేకతవల్ల, తన విశిష్ట వ్యక్తిత్వంవల్ల మహనీయుడు అవుతాడు, ఆదరణీయుడు అవుతాడు.

★★★

**ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.**

**మనిషిలోని దైవీ ప్రవృత్తి సామాజికత-సామూహికత.**

# వినమ్రతతో ఉంది ప్రజాసేవకుని విలువ

ప్రజాసేవకుడు వినమ్రంగా ఉండాలి. సహచరులకన్న మరింతగా వెలుగులోకి రావాలని ప్రయత్నించే వ్యక్తి బోర్లపడి పళ్లు విరగగొట్టుకుంటాడు.

సుందుడూ, ఉపసుందుడూ ఒక సుందరి కోసం తమలో తాము కలహించి నాశనం అయినారు. మొగలులు పెక్కు తరాలవరకు తండ్రుల, సోదరుల ఛాతీలపై ఎక్కి సింహాసనాలను వశపరచుకున్నారు. సంస్థలు ముక్కచెక్కలు కావడానికి ప్రధాన కారణం పదవీ వ్యామోహమే. యుధిష్ఠర చక్రవర్తి యొక్క అనుశాసనానికి బద్ధులై ఉండకుండా బరితెగించిన కౌరవులు తమ అన్యాయాలకు ప్రతిఫలంగా మహాభారత యుద్ధంలో నాశనం అయినారు. శ్రీకృష్ణుని యాదవ వంశంలోని వారు తమ ప్రత్యేకతను చాటుకోవడానికీ, ఇతరులను కూల్చివేయడానికీ ప్రయత్నించిన ఫలితంగా సామూహిక ఆత్మవినాశనానికి గురి అయినారు.

కనుకనే వేదవ్యాస మహర్షి ఇలా హెచ్చరించారు-

**బహవః యత్ర నేతారః బహవ మానకాంక్షిణః ।**
**సర్వే మహత్త్వవిచ్ఛంతి, సదల అవసీదతి ॥**

అనగా-

పలువురు నాయకులు అయితే, పలువురు పేరు ప్రతిష్ఠలను కోరితే, పలువురికి కీర్తి కాంక్ష ఉంటే- ఆ దళం చివరికి నాశనం అవుతుంది.

కనుక- ప్రజాసేవకులూ, యుగ శిల్పులూ కీర్తి కండూతికి గురి కాకూడదు.

రాజసూయ యజ్ఞంలో శ్రీకృష్ణుడు అతిథుల కాళ్లు కడిగే పనిని కావాలని చేపట్టాడు. గాంధీజీకి కాంగ్రెసు సంస్థలో పదవి ఏదీ లేదు. అయినా, ఆయన అందరినీ మించి సేవ చేయగలిగారు, గౌరవం పొందగలిగారు. రామ భరతులు రాజతిలకం అనే బంతిని ఒకరిపై మరొకరు విసరడానికి విశ్వ ప్రయత్నం చేశారు. మహామంత్రి ఆర్య చాణక్యుడు కుటీరంలో నివసించాడు. జనక మహారాజు పొలం దున్నేవాడు. నసీరుద్దీన్ పాదుషా టోపీలు కుట్టేవాడు.

మరోప్రక్క- నహుష చక్రవర్తి ఋషులచేత తన పల్లకీ మోయించి, పాముగా మారాలనే శాపాన్ని పొందాడు. పీష్వాల ప్రధాన న్యాయాధిపతి రామశాస్త్రి భార్య విలువైన వస్త్రాలతో, ఆభరణాలతో రాజమహలు నుండి తిరిగివచ్చినప్పుడు- ఆయన ఇంటి తలుపులు మూసివేసి ఇలా అన్నారు- "బ్రాహ్మణుని భార్య అపరిగ్రహ ఆదర్శాన్ని పాటించాలి. అలా చేయకపోతే- ఆమె వినమ్రత నశించిపోతుంది. మనం కూడ ద్రోణాచార్యునివలె నౌకర్లము అయిపోతాము."

సిక్కుల ఆరవ గురువు అర్జునదేవ్ అంట్లు తోమే పని చేసేవాడు. గురు రామదాస్ అర్జునదేవ్‌ను తన వారసునిగా ప్రకటించారు. అతడు నమ్రతలో, నిరాసక్తిలో, అనుశాసన పాలనలో అగ్రగణ్యుడు కనుక.

సన్యాసాన్ని స్వీకరించే సమయంలో వ్యక్తి తన వంశాన్నీ, కీర్తినీ, పదవినీ, గౌరవాన్నీ, గత చరిత్రనూ మరచిపోవలసి ఉంటుంది. సేవా ధర్మం ఒక విధమైన సన్యాస సంప్రదాయం.

గాంధీ గారి సబర్మతి ఆశ్రమంలో చిన్నా పెద్దా అందరూ పాయిఖానాలను శుభ్రపరచవలసి వచ్చేది. ఆచార్య వినోబా గారి పవనార్ ఆశ్రమంలో ఆశ్రమవాసులందరూ బావినుండి నీళ్లు తోడేవారు, కాపలా కాసేవారు. శాంతి కుంజ్‌లోని ప్రతి కార్యకర్తా పారిశుద్ధ్యపు పనినీ, కాపలా పనినీ స్వయంగా చేయవలసి ఉంటుంది. స్కౌటింగ్‌లో అనుశాసన పాలనయే ప్రాధాన్యానికి ప్రతీకగా పరిగణించ బడుతుంది. పదవీ వ్యామోహపరులకు స్వచ్ఛంద సంస్థలలో స్థానం ఉండదు.

గురుద్వారాలలో శ్రద్ధాళువులు అతిథుల పాదరక్షలను శుభ్రపరుస్తారు. మహిళలు తమ చెంగులతో మెట్లు శుభ్రపరుస్తారు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి శ్రీమతి గోల్డా మేయర్ ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయానికి స్వయంగా వచ్చేవారు, నిలబడీ, నడుస్తూ నడుస్తూ ఉద్యోగులకు మార్గదర్శనం చేసేవారు. కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ సైకిల్‌మీద కార్యాలయానికి వెళ్లేవారు.

సాధు, బ్రాహ్మణ సంప్రదాయంలో అపరిగ్రహానికీ, నిరాడంబరతకూ, మితవ్యయానికీ, నమ్రతకూ ప్రాధాన్యం ఇవ్వబడేది. విలాసాలు, అహంకారం, పొగరు, కటుభాషణ ఆ రంగంలో హేయములుగా పరిగణించబడేవి.

ఒక మహా మిషన్‌లో సభ్యులయిన కారణంగానే యుగ శిల్పులు గౌరవాన్ని పొందుతారు. వారు 'నేను' కు బదులు 'మేము' అనే పదాన్ని వాడాలి. అందరి కృషి ఫలితంగా సాఫల్యం లభిస్తుంది. ఆ విషయం యుగ శిల్పులు వాడే 'మేము' అనే పదం ద్వారా వ్యక్త మవుతుంది. కర్తవ్య పాలనకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి. అధికారానికి అర్రులు చాచకూడదు. ఈ నిరహంకారమనే ఎరువునూ, నీటినీ అందుకుని- సప్త మహావ్రతాలు కల్పవృక్షంవలె సాఫల్యాలను సాధించిపెట్టుతాయి.

★★★

స్వర్గానికి ద్వారం ఆత్మనియంత్రణ.

# నిరాడంబరత్వం ద్వారా ప్రజలతో సాన్నిహిత్యం

సాధనాల సమృద్ధికాక- వ్యక్తిత్వపు శ్రేష్ఠత గొప్పతనానికి ఆధారమని ప్రజాసేవకుడు విశ్వసించాలి. కనీస అవసరాలతో జీవించాలనే దృక్పథాన్ని అతడు అలవరచుకోవాలి.

ప్రాచీన కాలంలో సంత్‌లూ, ఋషులూ, మనీషులూ. ఈ దృక్పథాన్నే అవలంబించారు. ఋషులు అతి నిరాడంబరంగా జీవించేవారు. అరవింద మహర్షి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, గాంధీజీ వంటి మనీషులు కనీస సాధనాలతో జీవించారు. గోపాలకృష్ణ గోఖలే సంపన్నుడు. ఆయనకు మంచి ఆదాయం వస్తోంది. అయినా, తన కుటుంబానికి నెలకు 30 రూపాయలు మాత్రమే కేటాయించేవారు. మహర్షి అరవిందులు బరోడాలో ఒక కళాశాలలో ప్రొఫెసరుగా పని చేశారు. ఆయన నెలసరి వేతనం రూ॥ 500లు. కానీ 75 రూపాయలు మాత్రమే తనకోసం ఖర్చు చేసేవారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌కు నెలకు రూ॥ 500లు లభించేది. ఆయన రూ॥ 50 లతో జీవితం గడిపేవారు.

మహాత్మా గాంధీ సాదా దుస్తులు ధరించేవారు. చాలా సాదాగా జీవించేవారు. సామాన్య ప్రజలతో సన్నిహితంగా ఉన్నాననే అనుభూతి ఆయనకు కలిగేది. ప్రజలు ఆయనను తమవాడుగా భావించి గౌరవించారు.

సోక్రటీసు ఒక వస్తువు కొనేముందు- ఇది లేకపోతే గడవదా అని తనను తాను ప్రశ్నించుకునేవాడు. గడవదని జవాబు వచ్చినప్పుడే దాన్ని కొనేవాడు.

మహాత్మా గాంధీ ఒక ఖద్దరు పంచెమాత్రమే ధరించేవారు. అతి సామాన్యమైన వస్తువులను వాడేవారు. అయినా అందువల్ల ఆయన గౌరవం తగ్గలేదు. అంతే కాదు. ఆ వస్తువులను వాడడంలో గౌరవం ఉన్నదని ప్రజలు భావించారు.

కనుక- మంచి అభిరుచితో కూడిన నిరాడంబరత్వమే తనకు గౌరవప్రదమని ప్రజాసేవకుడు భావించాలి.

ప్రజాసేవకులు సౌశీల్యాన్నీ, స్వచ్ఛమైన వ్యక్తిత్వాన్నీ పెంపొందించుకోవాలి. తాను బోధించదలచుకున్న దానిని వాణి ద్వారా కన్న చర్యద్వారా మరింతగా బోధించాలి. ప్రజాసేవకుని స్వభావం, జీవనసరళి, ఆచరణ ప్రజలలో శ్రద్ధాభావాన్ని కలిగించేవిగా ఉండాలి.

ప్రజాసేవకుడు తన కుటుంబం పట్ల కూడ తన దృక్పథాన్ని సంస్కరించుకోవాలి. 'మేము కష్టసాధ్యమైన జీవితాన్ని గడుపుతాము; అయితే కుటుంబానికి తగినంతగా సాధన సంపత్తి ఉండాలి'- అని కొందరు ప్రజాసేవకులు వాదించవచ్చు. ఈ వాదనను అంగీకరిస్తే, నిరాడంబరత్వం నామమాత్రమే అయిపోతుంది. నిరాడంబరత్వం వల్ల ప్రజలలో మేలుకొనే 'మావాడు' అనే భావన మేలుకొనదు. ప్రజలు ప్రజా సేవకుని కుటుంబంతోకూడ సంపర్కంలోకి వస్తారు. ఆ కుటుంబపు భోగ విలాసాలను చూచినప్పుడు వారికి ప్రజాసేవకుని నిష్పట్ల అనుమానం కలుగుతుంది. ప్రజాసేవకుని జీవన సరళి ఒక నాటకమని వారు భావిస్తారు. 'ఇతడు తన కుటుంబ సభ్యుల కోసం సాధన సంపత్తి అంతా సమకూర్చుతున్నాడు; నిరాడంబరంగా జీవించండని మనకు నీతులు చెపుతున్నాడు- అనే అభిప్రాయం వారిలో కలగవచ్చు.

కనుక, ప్రజాసేవకుడు తన కుటుంబ సభ్యులలో సద్గుణాలను పెంపొందించడం అవసరం. వారిని శ్రమించేవారుగా, కార్యశూరులుగా, జవం జీవం కలిగిన వారుగా తీర్చిదిద్దడం అవసరం.

ప్రజాసేవకుని ఆదర్శం కుటుంబానికి కూడ ప్రేరణ ఇస్తుంది. పిల్లలను తన ఆదర్శాలకు అనుగుణంగా మలచడానికి ప్రయత్నిస్తే, వారి వ్యక్తిత్వాలను సంస్కరించడానికి ప్రయత్నిస్తే- వారి భవిష్యత్తు సుఖమయమయే అవకాశాలు పెరుగుతాయి. సంపద వల్ల కాక- గుణాలవల్ల, అర్హతలవల్ల భవిషత్తు నిర్మాణం అవుతుంది. ఈ దృష్టితో కుటుంబ సభ్యులను సంస్కరించడానికి సమయం పడుతుంది. ఇందుకోసం శిల్పివలె ధైర్యం వహించాలి. మామూలు రాయిని దైవ విగ్రహంగా చెక్కడానికై శిల్పి చాలా కాలం శ్రమిస్తాడు. తన మనసులో ఉన్న రూపం రాయిలోకి వచ్చేవరకు ఓపికగా కృషిచేస్తాడు. అలాగే- ప్రజాసేవకుడు ఆదర్శాల మూసలో తనను తాను పోతపోసుకోవాలి, తన ఇంటిలో అలాంటి వాతావరణాన్ని నిర్మాణం చేయాలి.

★★★

వస్తువులను హెచ్చుగా కూడబెట్టాలనే తృష్ణ ఈశ్వరేచ్ఛకు విరుద్ధం.

# సమాజ ఋణాన్ని తీర్చుకోవడానికే సేవ

ప్రజాసేవకుడు సేవావ్రతంపట్ల తన నిష్ఠను దృఢంగా, తీవ్రంగా ప్రకటించాలి. అందువల్ల ప్రజలు సేవావ్రతంలోని విలువను గుర్తిస్తారు.

ప్రజాసేవకుడు తన కుటుంబ బాధ్యతలను పెంచుకోకూడదు. ప్రాచీన కాలంలో ప్రజాసేవావ్రతాన్ని స్వీకరించగోరేవారు బ్రహ్మచర్య ఆశ్రమంనుంచి సరాసరి ప్రజాసేవా రంగంలోకి దూకేవారు. అలా కోరే గృహస్థులు తమ కుటుంబ బాధ్యతలనుండి విముక్తి పొందేవారు. ప్రజాసేవకులు సన్యాసులు కానక్కరలేదు. అయితే వారు తమ కుటుంబ బాధ్యతలను కనీస స్థాయికి తగ్గించుకోవాలి.

నేటి స్థితిలో- యువ ప్రజాసేవకులు తమ సంతానం సంఖ్యను పెంచుకోకూడదు. వారు పిల్లలను కనకపోతే మరీ మంచిది. మమతనూ, వాత్సల్యాన్నీ పంచి ఇవ్వడానికి సంతానం అవసరమని భావించబడుతోంది. ఆ మమతనూ, ఆ వాత్సల్యాన్నీ పంచడానికి సమాజంలో ఎందరో పిల్లలు ఉన్నారు. వివాహం అనవసరమని అనుకునేవారు అవివాహితులుగా ఉండిపోవచ్చు. పెళ్లి చేసుకోవాలని అనుకునేవారు సంతానం అనవసరమని భావించాలి. పిల్లలు కలిగి ఉన్నవారు సంతానాన్ని పెంచకూడదు. కుటుంబ బాధ్యతలు తేలికగా ఉంటే, ప్రజాసేవకు హెచ్చు సమయం మిగులుతుంది.

సేవకు రంగాలు అనేకం ఉన్నాయి. అన్నింటికీ న్యాయంచేయడం సాధ్యం కాదు- అని కొందరు భావిస్తారు. సేవా భావం హృదయంలో ఉప్పొంగుతున్నప్పటికీ, సేవ చేసే సామర్థ్యం పూర్తిగా ఉన్నప్పటికీ వారు ఆ కారణాన వెనుకంజ వేస్తారు. ప్రపంచంలో ఇన్ని వికృతులు ఉన్నాయి; ఇన్ని విషమ సమస్యలు ఉన్నాయి; మనం ఏమి చేయగలుగుతాము- అని వారు జంకుతారు. సేవా కార్యాన్ని మొదలుపెట్టకముందే వీరు దాని ఫలితాన్ని గురించి ఆలోచిస్తారు. అందరూ ఇలా ఆలోచిస్తే- ప్రపంచంలో సేవాకార్యం అనేది ఎలా జరుగుతుంది? ఫలితం గురించి ఆలోచించకుండా తన సామర్థ్యానికీ, స్థితికీ అనుగుణమైన సేవాకార్యాన్ని ప్రారంభించడం సేవా భావానికి తొలి గుర్తు.

ఉడుతకు తెలుసు- వారధి నిర్మాణంలో తాను చేసే పని లెక్కించదగినది కాదని. అయినా అది సముద్రంలో మునకవేసి, ఇసుకలో పొర్లి, మళ్లీ సముద్రంలో మునకవేసింది. నిరంతరంగా వేసింది. ఫలితం దృష్టితో చూస్తే దాని సహకారం అత్యల్పమే. అయినా భగవంతునికి సేవ చేసేవారిలో ఆ ఉడతకు అగ్ర స్థానం లభించింది.

వ్యావహారిక దృష్టితో చూచినా- ఒంటరిగా చేసే సేవ నిష్ఫలం కాదు. వానరులకు తమ శక్తి ఎంతో తెలుసు. అయినా వారు లంకా విజయానికి పథకం వేశారు. దాన్ని అమలు చేశారు. త్రిభువన విజేత అయిన రావణాసురునిపై విజయం సాధించారు.

ఇంద్రుని క్రోధానికి గురి అయి వ్రజభూమి నీట మునిగే ప్రమాదం ఎదురయింది. అప్పుడు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తే పథకాన్ని గోపబాలకుల ముందుంచాడు. గోప బాలకులు ఎక్కడ? గోవర్ధన పర్వతాన్ని ఎత్తడం ఎక్కడ? అయినా వారు వెనుకంజ వేయలేదు. ఆ పర్వతాన్ని ఎత్తేవరకూ నిద్రపోలేదు.

సేవా కార్యంవల్ల నష్టం వస్తుందని పైకి కనబడుతుంది. అయితే వాస్తవం అది కాదు. సేద్యం గురించి తెలియని వ్యక్తి రైతు విత్తనాన్ని నాటడం చూచి

**మహాపురుషులకు దుఃఖాలు ఊయలలు, ఆపదలు తలగడలు.**

అతడు దాన్ని వృధా చేస్తున్నాడని భావిస్తాడు. అయితే వాస్తవానికి ఆ విత్తనానికి ఎన్నో రెట్లు పంట పండుతుంది. అలాగే- సేవా సాధన ఫలితం సామాజిక సువ్యవస్థ రూపంలో వ్యక్తిగత ఆత్మసంతృప్తి, ఆత్మానందముల రూపంలో ఉంటుంది. ఈ అనుభూతి ఆంతరికమైనది. మనిషి లోపల కలిగేది. బాహ్య ఫలితాలను మాత్రమే చూచేవారికి సేవా సాధనలో నష్టమే కనిపిస్తుంది.

ప్రజాసేవకుని దృక్పథం దృఢంగా, నిర్మలంగా లేకపోతే, అతడు మధ్యలో వచ్చే ఉపేక్షకూ, కష్టాలకూ క్రుంగిపోతాడు. సేవవల్ల సమాజమంతా ప్రయోజనం పొందుతోందనీ, ఆ సమాజం సహకరించకపోతే తాను ఎందుకు ఆహుతి కావాలనీ అతడు అనుకుంటాడు.

సేవా కార్యాన్ని కర్తవ్యంగా కాక ఉపకారంగా భావించే వ్యక్తి మెదడులోనే ఇలాంటి ఆలోచన కలుగుతుంది. **సేవా భావంవల్ల సంతోషం పెరుగుతుంది. ఉపకారం చేస్తున్నాను- అనే భావనవల్ల అహంకారం పెరుగుతుంది.** అహంకారం పెరిగితే పతనం నిశ్చయం.

కనుక- ప్రజాసేవకుడు సేవా కార్యాన్ని కర్తవ్య నిర్వహణగా, సమాజ ఋణాన్ని తీర్చుకోవడంగా, భగవత్ ప్రేమను పొందడానికి అమూల్య అవకాశంగా పరిగణించాలి. సహచరులు లేకపోతే అతడి మనోబలం తగ్గకూడదు. సహచరులు వచ్చిచేరితే తన సాఫల్యంలో పాలుపంచుకోవడానికి వారు వచ్చారని అతడు భావించకూడదు.

ఈ దృక్పథాన్ని అలవరచుకున్నప్పుడే ప్రజాసేవకుడు ఆత్మోద్ధరణనూ, సమాజ ఉద్ధరణనూ సాధించగలుగుతాడు.

★★★

## దైవ దర్శన దాహం

*హారతి ఇచ్చే శుభ వేళ. శంఖ నాదాలతో, ఘంటానాదాలతో జగన్నాథ స్వామి ఆలయం మారుమ్రోగుతోంది. చైతన్య మహాప్రభువు గరుడ స్తంభంవద్ద నిలబడి తన్మయుడై హారతి పాట పాడుతున్నారు. ఆలయంలో భక్తుల రద్దీ పెరిగిపోతోంది. వెనుక వచ్చినవారికి దైవ దర్శనం కావడం లేదు.*

*దర్శనం అందని ఒక మహిళ గరుడ స్తంభం ఎక్కింది. ఒక కాలు చైతన్య మహాప్రభువు భుజంపై ఉంచి హారతి చూడసాగింది. ఆయన దాన్ని సహించారు. ఆయన శిష్యుడు గోవిందుడు ఎందుకు సహిస్తాడు ! అతడు ఆ మహిళను కేకలు వేయబోయాడు. చైతన్యులవారు అతడిని వారిస్తూ ఇలా అన్నారు-*

*"ఎందుకు అడ్డుకుంటావు? ఆమెను దర్శనం చేయనివ్వు. భగవంతుడు ఈ తల్లికి ఇచ్చిన దర్శన దాహాన్ని నాకు ఇచ్చి ఉంటే- నేను ధన్యుడను అయేవాడిని. ఆమెలోని తన్మయత్వాన్ని చూడు. ఎవరి భుజంమీద కాలు వేస్తున్నదో ఆమెకు స్పృహ లేదు."*

*ఈ మాట విన్న ఆ మహిళ దభీమని క్రిందకు దిగి, చైతన్యులవారి కాళ్లమీదపడి క్షమించండి అని ఆయనను ప్రార్థించింది. ఆయన తన కాళ్లను వెనుకకు తీసుకుంటూ ఇలా అన్నారు-*

*"అసలు నేనే నీ కాళ్లకు మ్రొక్కాలి- నీ భక్తి భావం నాకు అందాలని."*

ప్రపంచంలో పరమ నికృష్టమైనది భావ దారిద్ర్యం.

# జీవన సాధనలో సుడిగుండాలు

ప్రజాసేవకునికి తన కార్యంలో ప్రధానంగా నాలుగు అవరోధాలు ఎదురవుతాయి. మొదటిది లోభ గుణం. ఇది ఆదర్శవాదులకూ, ఆధ్యాత్మిక సాధకులకూ ఒక సంకెల. అత్యాశాపరుడూ, కూడబెట్టాలనే కాంక్ష కలిగిన వ్యక్తీ, భోగ విలాసాలకు లోనయిన వ్యక్తీ పరమార్థ కార్యాలకు విలువ ఇవ్వడు. ఆడంబరంగా జీవిస్తాడు- ప్రజాసేవకుడనే ఖ్యాతినీ, పుణ్యాత్ముడనే ఖ్యాతినీ పొందడానికి.

రెండవది వ్యామోహం. శరీరంపట్ల, కుటుంబం పట్ల మితిమీరిన మమకారం కలిగిన వ్యక్తులు వాటి కోసం నానాపాట్లూ పడతారు. వారికి అవే ప్రపంచం, అవే ఇహ పరాలు. వారు వాటి కోసం గానుగెద్దుల్లా చుట్టూ తిరుగుతూఉంటారు. నిప్పులా మండిపోతారు. మంచులా కరిగిపోతారు. కుటుంబ బాధ్యతలను నిర్వహించడం ఒక ఎత్తు. కుటుంబ సభ్యులకు లేనిపోని సౌకర్యాలు కల్పించి, వారిని గారాము చేసి, వారి వ్యక్తిత్వాలను దిగజార్చడం మరో ఎత్తు. ప్రజాసేవకుడు తన కుటుంబ సభ్యులకు శ్రేష్ఠమైన ఆలోచనలను అందించడానికి కృషి చేయాలి.

సాధారణంగా కుటుంబంలో ఒకే వ్యక్తి కుటుంబం కోసం యమ యాతనలు పడుతూఉంటాడు. కుటుంబంలోని మిగతా సభ్యులు సోమరులుగా తయారవుతూఉంటారు. ఈ కుటుంబ వ్యామోహం సేవా పథానికి పెద్ద అవరోధం అవుతుంది. లోభ, వ్యామోహాలు రావణుడూ అహిరావణుడూ.

మూడవ అవరోధం అహంకారం. ఇది పరోక్షమైనది. ఇది తనకూ చిక్కదు, ఇతరులకూ దొరకదు.

అహంకారం అంటే ఆధిక్యాన్ని పొందాలనే ఆకాంక్ష; ఇతరుల కన్న తనకు మరింతగా గౌరవం, కీర్తి, పదవి, సన్మానం అందాలనే అత్యాశ.

అహంకారి వేష భూషలకు, ఫ్యాషన్లకూ, సంపన్నుడుగా కనబడడానికీ విపరీతంగా ఖర్చు చేస్తాడు. గృహాలంకరణకూ, వాహనాలకూ, నౌకర్లకూ, విలాసాలకూ మితిమీరి ఖర్చుపెడతాడు. నిజంగా అవసరమైనవాటిపై ఖర్చు తగ్గించుకుంటాడు.

ఆదర్శవాదులుగా, త్యాగులుగా, అధ్యాత్మవాదులుగా యోగులుగా, ప్రజాసేవకులుగా పేరు పొందిన పలువురిలో సైతం అహంకారం దొడ్డిదారిన ప్రవేశించి చక్రవర్తిలా సింహాసనాన్ని అధిష్ఠించి ఉండడం కనిపిస్తుంది. ఒకే సంస్థకు చెందిన వ్యక్తులు పరస్పరం కీచులాడుకోవడం కనిపిస్తుంది. సంస్థలు నాశనం కావడానికి ప్రధాన కారణం అహంకారమనే శూర్పణఖ. పాదపూజలు అందుకోవడానికి కొందరు పడే పాట్లు చూచితీరవలసిందే.

ఈ కారణం వల్లనే- విత్తేషణ(లోభ గుణం), పుత్రేషణ(కుటుంబ వ్యామోహం), లోకేషణ(అహంకారం-కీర్తికాంక్ష) అనే మూడింటినీ వదులుకున్న తర్వాతనే వ్యక్తులు సాధనా మార్గంలో ప్రవేశించాలని మనీషులు బోధించారు. ప్రాచీన కాలంలో ప్రజాసేవకులు ఇంటింటికీ వెళ్లి భిక్ష అడగవలసివచ్చేది. వారిలో నమ్రతనూ, అహంకార రాహిత్యాన్నీ కలిగించడానికి చేయబడిన ఏర్పాటు అది.

సంస్థనుండి డబ్బు తీసుకుని మేము ఎందుకు పని చేయాలి- అని కొందరు భావిస్తూ ఉంటారు. ఈ భావన వెనుక ఉన్నది అహంకారమే. సాధకుడు నెలకు వేయి రూపాయల పని చేసి వంద రూపాయలు తీసుకుంటే- అతడు 900 రూపాయలు దానమిచ్చినట్లే అవుతుంది కదా. ప్రజాసేవకుడు ప్రజలనుండి బ్రాహ్మణోచిత జీవితానికి సరిపోయే డబ్బు తీసుకుంటే, అతడు జీతం తీసుకునే ఉద్యోగి కాడు; దక్షిణగా శ్రద్ధతో ఇచ్చిన నిర్వహణ ఖర్చు తీసుకుని గౌరవార్హుడు అవుతాడు.

నాల్గవ అవరోధం- కాలనేమివలె కుట్ర పన్ని ప్రజాసేవకుని మార్గానికి ఆటంకాలు కల్పించే వ్యక్తులు. రావణుని సోదరుడు కాలనేమి పన్నిన కుతంత్రాలు పురాణాలలో వర్ణించబడ్డాయి. అతడు త్రేతాయుగంలో జన్మించాడు. అయినా కాలానికి బద్ధుడు కాడు. దుర్బుద్ధిని కలిగించే పనిని అతడు ప్రతి యుగంలో చేస్తూవచ్చాడు. అతడే శూర్పణఖను రామునివద్దకు పంపాడు. సీతను అపహరించవలసిందిగా రావణునికి సలహా ఇచ్చాడు. మారీచుడు, కుంభకర్ణుడు, మంథర, కైకల బుద్ధి పెడత్రోవ పట్టడానికి మూల కారణం అతడే. ఆ కాలనేమిలోని కుటిలత నేడుకూడ కుట్రలు పన్నుతూనే ఉంది. తాపసుల, యోగుల, ఇతరుల వేషాలు ధరించి అతడి జీవాత్మ బలహీన మనఃస్థితి కలిగినవారిని వెదకుతూ ఉంది. యుగశిల్పులు ఇలాంటి వ్యక్తుల విషయంలో మెలకువ వహించాలి.

★★★

**నేటి ఆహారమే రేపటి మనస్సు.**

# కత్తిమీద సాము - సేవా సాధన

భావ విప్లవం, యుగ పరివర్తన, జన మానస సంస్కరణ అనే సంకల్పాలను పూర్తిచేయడంలో బంధు మిత్రులతో, శ్రేయోభిలాషులతో, సన్నిహితులతో తలపడవలసివస్తుంది.

అభిమన్యుడు ఒంటరిగా పద్మవ్యూహంలో శత్రువుల మధ్య చిక్కుకున్నాడు. అయినా అద్భుతమైన శౌర్యాన్ని ప్రదర్శించి ప్రాణాలను అర్పించి అమరుడైనాడు. అవాంఛనీయతలనూ, లోభ మోహాలనూ, సంకుచితత్వాన్నీ, స్వార్థపరత్వాన్నీ నికృష్టతనూ ఛేదించి, నవ సృజనకు మార్గాన్ని నిర్మించగోరేవారు ఇలాంటి శౌర్యాన్ని సంపాదించాలి.

జన్మ జన్మల నుండి పేరుకుపోయిన పైశాచిక స్థాయి కుసంస్కారాలను తొలగించడం అంత తేలిక కాదు. ఈ పని సాధించాలంటే, ప్రజాసేవకుడు తనలో అనేక సద్గుణాలను వికసింపజేసుకోవాలి.

మొదటిది 'నూతిలో కప్ప' వంటి ఆలోచనను వదులుకోవడం. విశాల విశ్వానికి అతడు తన పరిధిని విస్తరించుకోవాలి. తనలోపలి అస్తవ్యస్తతను తొలగించుకోవాలి. తన మార్గాన్ని తానే నిర్మించుకునేందుకు నడుంబిగించాలి. తన హృదయ దౌర్బల్యాన్ని వదులుకోవాలి.

రెండవది బంధు మిత్రుల వ్యతిరేకతను ఎదుర్కొనడం. సంపదనూ, భోగ విలాసాలకు తగు సౌకర్యాలనూ పోగుచేయడమే పరమావధిగా భావిస్తున్నారు జనం. కష్టసాధ్యమైన పారమార్థిక కార్యాలను చేపట్టవద్దని వారు సలహాఇస్తారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనడానికై తులసీదాసు మీరాబాయికి వ్రాసిన లేఖలోని ఈ హితవును ప్రజాసేవకుడు పాటించాలి- ప్రహ్లాదుడు తండ్రిని ఎదిరించాడు. విభీషణుడు బంధువులను ఎదిరించాడు. భరతుడు తల్లిని ఎదిరించాడు. బలిచక్రవర్తి గురువును ఎదిరించాడు. ఎందుకు? ధర్మం కోసం. సమాజ హితం కోసం. వారు నీకు ఆదర్శాలు కావాలి.

మీరాబాయి ఆ హితవును పాటించింది. సమాజంపై అమృతాన్ని వర్షించింది.

మూడవది చుట్టూ ఉన్న ప్రజల ఆలోచనా ధోరణులతో తలపడడం. దుర్బుద్ధి పిశాచంవంటిది. పట్టుకుంటే ఒక పట్టాన వదిలిపెట్టదు. జనమానసంలోని ఇలాంటి వికృతులను సృజన శిల్పి నిర్మూలించాలి. అతడి వ్యక్తిత్వం, కర్తృత్వం బలపడాలి. అతడు ప్రతికూలతలతో వస్తాదులా మల్లయుద్ధం చేయగలగాలి. అర్జునుని వలె, ఏకలవ్యుని వలె లక్ష్యం పట్ల అతడు ఏకాగ్రతను సాధించాలి. సృజన శిల్పి శబ్దవేధి బాణంలా తనను తాను తయారుచేసుకోవాలి, అతడు మనస్వి కావాలి. వజ్రాయుధంగా, బ్రహ్మాస్త్రంగా అతడు రూపొందాలి.

మనస్వికి ఓజస్సూ, వర్చస్సూ లభిస్తాయి. నది ఎంత లోతుగా ఉంటే, దానిలో అంత హెచ్చుగా నీళ్లు నిండుతాయి. అంత హెచ్చుగా ఉపనదులు వచ్చి చేరుతాయి. వ్రతశీలునికీ, సంయమశీలునికీ, సంకల్పవంతునికీ అనేక శక్తులు వచ్చిచేరుతాయి.

దృఢనిశ్చయం కలిగిన వ్యక్తి తనలో చొరబడిన పిరికితనాన్నీ, క్షుద్రతనూ, లాభకాంక్షనూ జయించ గలుగుతాడు. అంబపాలి, అంగులిమాల, అశోకుడు ఇందుకు ఉదాహరణలు. "ప్రాణ జాహి పర్ వచన న జాయీ"- ప్రాణం పోయినా మాట తప్పకూడదు- అనే తులసీ రామాయణ సూక్తి ప్రజాసేవకునికి నిరంతర ప్రేరణ ఇవ్వాలి.

యుగ శిల్పుల స్వభావం మృదువుగా, శిష్టాచార పూరితంగా ఉండాలి. వారిని కలుసుకున్న వ్యక్తులు ఆ స్వభావానికి పులకించిపోవాలి. ఆ స్థితిలో ప్రతికూలతను అనుకూలతగా మార్చడం సాధ్యపడుతుంది.

అయితే- ఇరు పక్షాలూ మొండి వైఖరి అవలంబించి, విషయాన్ని తమ ప్రతిష్ఠకు సంబంధించినదానినిగా

**మనస్సు అలసిపోతే దేహంతో, దేహం అలసిపోతే మనస్సుతో పనిచేయాలి.**

పరిగణించినప్పుడే చిక్కు వస్తుంది. అలాంటి స్థితి రానివ్వకూడదు. తొలి ప్రయత్నంలో పని జరగకపోతే, తగాదా పెట్టుకుని దాన్ని ముగించకూడదు. భవిష్యత్తులో తగు సమయం రాగానే కొత్త కోణంలో, కొత్త దృక్పథంతో దానిపై చర్చ జరిగేందుకు అవకాశం ఉండే విధంగా ప్రజాసేవకుడు వ్యవహరించాలి. అంతర్జాతీయ వ్యవహారాలలో దౌత్యవేత్తలు తీవ్ర విభేదాల మధ్య ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవలంబించి, ఏదో ఒక మధ్యేమార్గాన్ని కనుగొనగలుగుతారు. ప్రజా సేవకుడు ఆ దౌత్యవేత్తల ప్రతిభను సంపాదించాలి.

సభ్యత, సామాజికత, మర్యాదా మన్ననల సమన్వయమే శిష్టాచారం. వినమ్రత, ఇతరుల ప్రతిష్ఠను గౌరవించడం శిష్టాచారంలో అంతర్భాగాలు. ఈ శిష్టాచారంలో ఏమాత్రం లోటు వచ్చినా, పని చెడిపోతుంది. ప్రజాసేవకుల పాత్ర పట్టు విడుపులతో కూడిఉండాలి. కోరుకున్న మార్పు వస్తూ ఉండాలి. అదే సమయంలో ఎదటి వ్యక్తిలో అభద్రతా భావం కలుగకూడదు.

మరో రెండు విషయాలు.

మొదటిది ప్రజలనుండి సేకరించిన ధనాన్ని పవిత్రంగా పరిగణించి, దానిలో ప్రతిపైసాను ఎంతో జాగ్రత్తగా ఖర్చుచేయడం.

రెండవది స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు. సామాజిక రంగంలో స్త్రీ పురుషులు కలసి పని చేయవలసి ఉంటుంది. ఇందులో అనైతికమైన ఆలోచనకూ, ఆచరణకూ తావు ఉండకూడదు. ప్రజాసేవకుని వ్యవహరణ అనుమానాలకు అతీతంగా ఉండాలి.

మరొక్క మెలకువ.

పేరు తెచ్చుకోవాలనీ, ప్రతి ఘట్టంలో తామే ముందు ఉండాలనీ కోరే వ్యక్తులను సామాన్య ప్రజలు మెచ్చుకోరు. నేతలము కావాలి– అని ఉవ్విళ్లూరే వ్యక్తులు తమ పేర్లు అచ్చుకావాలని కోరుతారు. మైక్ పట్టుకుంటే వదలరు.

## శిష్టాచారానికి నియమాలు

*1. మాటలో, వ్యవహారణలో మర్యాదా మన్నలను పాటించాలి.*

*2. చిన్నవారికి ప్రేమ ఇవ్వాలి, పెద్దలకు ఆదరణ ఇవ్వాలి.*

*3. ప్రేమాదరాలతో ఇతరులను గౌరవించాలి.*

*4. భావనాత్మక ఆలోచనలకు ఆశ్రయం ఇవ్వాలి.*

*5. జీవన సరళిలో నిరాడంబరత్వాన్నీ, సజ్జనత్వాన్నీ చూపాలి. నలువైపులా స్వచ్ఛతా వాతావరణాన్ని నిర్మాణం చేయాలి.*

*6. పెద్దల మంచి అనుభవాలనుండి ప్రయోజనం పొందాలి.*

*7. స్వాధ్యాయానికీ, సదాలోచనకూ ప్రాధాన్యం ఇవ్వాలి.*

*8. సహచరుల మనోబలాన్ని పెంచాలి; వారితో సహకరించాలి; వారితో ప్రేమగా వ్యవహరించాలి.*

*9. ఇతరుల మాటలకు గౌరవం ఇవ్వాలి.*

అందువల్ల పోటీదారులూ, విరోధులూ, అసూయాపరులూ పెరుగుతారు. ఫలితంగా వారి సంస్థలకు చెడ్డపేరు వస్తుంది.

గాంధీజీలోని నిరాడంబరత, వినమ్రత, సజ్జనత్వం అందరికీ తెలిపిన గుణాలే. కనుకనే కాంగ్రెసులో ఏ హోదా లేకపోయినా, ఆయన ఆ సంస్థకు ఊపిరి అయినారు. వ్యక్తిత్వ ఉన్నతికి రాచబాట ఇదే. నాయకత్వం కోసం ఎగిరి గంతులు వేసేవారు నటులుగా మిగిలిపోతారు. ప్రామాణికత లోపిస్తే– ఏ వ్యక్తి అయినా శ్రద్ధా గౌరవాలను పొందలేడు. అలాంటి వ్యక్తుల ఆధిపత్యం హెచ్చు సమయం సాగదు.

★★★

**పని పాటగా సాగాలి.**

జీవన సాధనకు పావన ప్రేరణ

# సమాజ పరమేశ్వరుని సేవలో

తలుపు తట్టిన చప్పుడు వినబడింది. గదిలో వ్రాసుకుంటూన్న ఆ యువకుడు కాగితం, కలం ప్రక్కన పెట్టి లేచాడు. మర్యాదగా తలుపు తెరచాడు. కొందరు నవయువకులు బయట నిలబడిఉండడం చూచాడు.

గదిలో అడుగుపెట్టిన ఆ నవయువకులు నివ్వెరపోయారు. ఒక మూల చాప. దానిమీద ఒక కంబళి. అదే ఆయన ప్రక్క. వంకీకి తగిలించి ఉన్న రెండు మూడు దుస్తులు. ఇదే ఆయన వస్త్ర సంపద. ఇక పుస్తకాలే పుస్తకాలు. ఆ గది నిండా, ప్రక్క గది నిండా. ఆయన ఎన్నెన్ని భాషల గ్రంథాలు చదువుతున్నారో! పారసీ, జర్మన్, రష్యను, ఇంగ్లీషు, గ్రీకు, లాటిన్, ఫ్రెంచి, ఇటాలియన్, బెంగాలీ, సంస్కృతం, హిబ్రూ మున్నగు భాషలలో గ్రంథాలు కుప్పలు కుప్పలుగా ఉన్నాయి. బరోడాలోని తీవ్రమైన చలిలో ఉన్ని దుస్తులు లేవు. పుస్తకాలు మాత్రం కోకొల్లలు. ఆ నవయువకులు అచ్చెరువుపొందడం సహజమే.

"సర్! మీరు కాలేజీ వదిలి వెళ్లిపోతున్నారని విన్నాము."

"నిజమే"– అన్నది వారి ప్రిన్సిపాల్ గారి జవాబు.

"ఒక విషయం అడగవచ్చా?"– ఒక యువకుడు సంకోచిస్తూ అడిగాడు.

"అడుగు"– ప్రేమ పూర్వకమైన జవాబు.

"ఈ కాలేజీలో జీతం తక్కువా?"

"కానే కాదు నాయనా. ఇక్కడ 710 రూపాయల జీతం. నేను వెళ్లే చోట వచ్చే జీతం 70 రూపాయలు."

ఈ మాట విని, యువకులంతా అవాక్కయారు.

ఈలోగా ఒక పెద్దమనిషి లోపలికి వచ్చి, ప్రిన్సిపాల్‌గారి చెవిలో ఏదో చెప్పాడు. ఆయన దూరంగా మేజాబల్ల మీద ఉన్న ప్లేటును చూపారు. ఆ పెద్దమనిషి ఆ ప్లేటులోనుండి 2000 రూపాయలు తీసుకుని– ఎలా వచ్చాడో అలా వెళ్లిపోయాడు.

యువ విద్యార్థులకు మరో విచిత్రం అది. తనకోసం పైసాకూడా ఎక్కువ ఖర్చు చేయని వ్యక్తి వేల రూపాయలు ఇచ్చివేయడం. అదీ మామూలు విషయం అయినట్లు.

"సార్ ! ఆయన ఎవరు? ఇన్ని రూపాయలు ఎందుకు తీసుకువెళ్లారు?"– అని యువకులలో ఒకడు అడిగాడు. ఆ కుతూహలం సహజమే.

"ఆయన జాతికి అంకితమైన ఒక వ్యక్తి. జాతి కోసమే ఆ డబ్బు తీసుకువెళ్లారు. దీన్నిగురించి వివరాలు అడగవద్దు."

"మీ చర్యలన్నీ ఆశ్చర్యం కలిగిస్తున్నాయి."– అని ఒక యువకుడు భయంతో కూడిన శ్రద్ధతో అడిగాడు.

"మీ ఆశ్చర్యం నాకు అర్థం అవుతోంది. అయితే నా జీవితం అంత ఆశ్చర్యకరమైనది కాదు. అయినా ఇతర జీవితాలకన్న భిన్నమైనది. ఇందుకు కారణం ఉంది. నా దృఢ విశ్వాసం ఇది–

"భగవంతుడు నాకు ఇచ్చిన గుణాలు, ప్రతిభ, ఉన్నత విద్య, ధనం– అన్నీ భగవంతునివే. ఇందులో వీలైనంత తక్కువ భాగంతో నా పని గడుపుకొని, మిగతాదాన్ని భగవంతునికి– అనగా సమాజానికి– తిరిగిఇవ్వడం సముచితం."

ఈ మాటలు విని, విద్యార్థులు భావోద్వేగంతో చలించిపోయారు. గద్గదమైన ఒక స్వరం నుండి అతికష్టం మీద ఈ మాటలు వెలికివచ్చాయి–

"సార్! మీకు వీడ్కోలు ఉత్సవం జరపాలని మేమంతా కోరుతున్నాము. మీ అనుమతి కోసం మీవద్దకు వచ్చాము."

"వద్దు. నన్ను ఇలాగే వెళ్లనివ్వండి. మీకు తెలియదు. మహాకార్యంలో నిమగ్నుడైన వ్యక్తికి గోరంత సన్మానం అయినా కొండంత ఆటంకాన్ని కలిగిస్తుంది. మరో మాట. తెర వెనుక ఉండి పనిచేయడం నా విధానం. మీరంతా నన్ను ఇలాగే వెళ్లనివ్వండి."

విద్యార్థులు ఆ ఆదేశాన్ని శిరసావహించి తిరిగివెళ్లారు.

తక్కువ జీతానికి కలకత్తా నేషనల్ కాలేజి ప్రిన్సిపాల్ పదవిని స్వీకరించి, దేశభక్తులను నిర్మాణంచేసిన ఆ మహామానవుడు శ్రీ అరవిందులు. వచ్చిన విద్యార్థులలో అగ్రేసరుడు కె.ఎమ్. మున్షీ.

★★★

**దేహం వేణువు కావాలి.**

గురుదేవుల అమృత వాణి

# కార్యకర్తలే నా అవయవాలు

## సూక్ష్మీకరణ సాధనలో నైష్ఠిక కార్యకర్తలకు పరమపూజ్య గురుదేవులు వ్రాసిన విశిష్ట లేఖ

ఈ మనోభావాలను మా వ్రేళ్లు మూడూ కలసి వ్రాస్తున్నాయి. అయితే- తయారవుతూన్న, అమలు జరుగుతూన్న యోజనను ఈ కలమూ, కాగితమూ, వ్రేళ్లూ పూర్తిచేస్తాయని ఎవ్వరూ భావించకూడదు. ఆ పని చేసే బాధ్యత మీ అందరిదీ, మా నైష్ఠిక కార్యకర్తలది.

విస్తృతమైన ఈ యోజనకు ప్రేరణ పరమేశ్వరుని నుండి వచ్చింది. ఒక దివ్య శక్తి దీన్ని చెపుతోంది, వ్రాయిస్తోంది. మెదడులోని, హృదయంలోని కణ కణమూ నెమ్మది నెమ్మదిగా దీన్ని వ్రాయిస్తోంది. వ్రాయించడమే కాదు. దీన్ని పూర్తి చేయడానికి అవసరమయే సాధన సంపత్తిని సమీకరిస్తోంది కూడా. యోజనను పూర్తిచేయడంలో ఎందరెందరివో మనోబలం, శ్రమ, సమయం, సాధనాలు పాలుపంచుకుంటాయి. వ్రాస్తూన్న వ్రేళ్లు లేనంత మాత్రాన, కాగితమూ కలమూ లేనంతమాత్రాన పని ఆగదు. ఎందుకంటే- రక్తంలోని ప్రతి కణమూ, మెదడులోని ప్రతి అణువూ దాని వెనుక పని చేస్తున్నాయి. అంతే కాదు. కళ్లకు కనిపించని, కనిపింపజేయలేని దైవీ శక్తికూడ నిరంతరం క్రియాశీలంగా ఉంది.

యుగపరివర్తన యోజన చాలా పెద్దది. ఆ పేరు ఎంత పెద్దదో అంత పెద్దది. ఇందుకోసం పలువురు వరిష్ఠుల మహత్తర భాగస్వామ్యం అవసరం అవుతుంది- కాకతాళీయంగా అందుకు కీర్తి ఎవరికి వచ్చినా.

ఈ యోజనను పలుమారులు చదవండి. మా శరీరానికి అవయవాలుగా ఉంటూన్న వ్యక్తుల భాగస్వామ్యం దీనిలో హెచ్చుగా ఉంటుంది. ఆ దృష్టితో చదవండి. మీ అందరి సమన్విత శక్తి యొక్క పేరే ఈ వాక్యాలను వ్రాస్తూన్న వ్యక్తి.

పని ఎలా పూర్తవుతుంది? ఇన్ని సాధనాలు ఎక్కడ నుంచి వస్తాయి? దీన్ని గురించి మీరు మథనపడకండి. పని చేయవలసిందని చెప్పినవారే సాధనాలనూ సమీకరిస్తారు. మరింతగా శ్రమించడంలో, సమర్పణ చేయడంలో మనలో ఎవరు ముందుంటారని మాత్రమే మీరు ఆలోచించండి.

సాధన, యోగ్యత, విద్య మున్నగు విషయాలలో హనుమంతుడు చిన్నవాడే. పారిపోయిన సుగ్రీవుని కొలువులో ఆయన గతం గడచిపోయింది. అయినా, నిండు మనస్సుతో, పూర్తి సమర్పణ భావంతో మహాశక్తితో ముడిపడిన తర్వాత- ఆయన లంకా దహనం జరిపాడు. సముద్రాన్ని లంఘించాడు. పర్వతాన్ని పెకలించాడు. రామ లక్ష్మణులను తన భుజాలపై మోశాడు. మీలో ప్రతి ఒక్కరి నుండి ఆశిస్తూన్నది ఇదే - ఏ పరిజనుడూ హనుమంతునికన్న తక్కువ స్థాయిలో ఉండకూడదు, తన కార్యశూరతలో వెనుకపడకూడదు.

ఏ పని చేయవలసిఉంటుంది? అందుకు తగు నిర్దేశం మీకు అందుతూఉంటుంది. అది ఆయా సమయాలను బట్టి ఉంటుంది. పని మారుతూ ఉంటుంది. అందులో సాఫల్యాలూ, వైఫల్యాలూ ఎదురవుతాయి. మీరు ఒకే విషయాన్ని గుర్తుంచుకోండి. ఏ సమర్పణ భావంతో మీరు ఇంటినుండి వచ్చారో, ఆ సమర్పణ భావం రోజురోజుకూ పెరుగుతూ ఉండాలి, ఆవంతయినా తరగకూడదు.

పని ఎంత విస్తృతం అయినదో గుర్తించండి. గురి లక్ష్యాన్ని చేరకపోయినా- అద్భుతమూ, సాటిలేనిదీ, అసాధారణమూ, చరిత్రాత్మకమూ అయినదిగా వర్ణించబడే స్థలానికి అది తప్పక చేరుతుంది. ఇందుకోసం పెద్ద పెద్ద సాధనాలు అవసరం అవుతాయి. నిజమే. ఆ బరువును

కర్తవ్యం వేణుగానం కావాలి.

దివ్యసత్తామీద వేయండి. మీ శ్రమలో, సమయంలో, గుణ కర్మ స్వభావాలలో ఎక్కడా ఎలాంటి లోపమూ రాకుండాచూడడం మాత్రం మీ వంతు. విశ్రాంతి గురించి ఆలోచించకండి. ఈ యోజన అమలులో పూర్తిగా ఆహుతి అయి ఎంత హెచ్చుగా పాల్గొనగలమా, ఎంత బరువు మోయగలమా అని రాత్రింబవళ్లు ఆలోచించండి. మనల్ని మనం మరింత వినమ్రులుగా చేసుకోవాలి. ఇతరులకు పెద్దరికం ఇవ్వాలి. స్వచ్ఛందసేవకుడు అయినందుకు గర్వించాలి. ఇందులోనే ఉంది మీ గొప్పతనం.

మీ అలసట గురించీ, సౌకర్యం గురించీ ఆలోచించకండి. చేసిన పనికి అహంకరించకండి. మా ఆలోచన, ఏకాగ్రత, శ్రమ ఎంత ఉన్నత పాత్రను నిర్వహించగలిగాయని మాత్రమే, ఎంతటి ముందంజ వేయగలిగాయని మాత్రమే ఆలోచించండి. అదే మీకు అగ్ని పరీక్ష. అందులోనే మీ గౌరవం ఉంది. అందులోనే మీ సమర్పణకు సార్థకత ఉంది. మీ సహచరులలోని శ్రద్ధనూ, సామర్థ్యాన్నీ తగ్గనివ్వకండి. దాన్ని పెంచండి. ఇబ్బడి ముబ్బడిగా పెంచండి.

మిషన్ పని ముందుముందు బాగా పెరుగుతుందనీ, ఎన్నో రెట్లు పెరుగుతుందనీ గుర్తించండి. ఇందుకోసమై మీ కార్యదీక్ష శిఖరాగ్రాన్ని అందుకోవాలి. మీ అంతరంగం సాఫల్యాన్నీ, సార్థక్యాన్నీ అనుభూతి పొందాలి. ప్రేరక సత్తా మిమ్మల్ని అతిసన్నిహితం చేసుకోవాలి. రామ పంచాయతనంలో ఆరవ హనుమంతుడు చొరబడినంతగా.

మీరు మీ అంతరాత్మను ఇలా ప్రశ్నించుకోవాలి– మనం చేయగలిగినదానిలో అణుమాత్రమయినా లోపం జరగలేదుకదా? సోమరితనం, నిర్లక్ష్యం కార్యకలాపాలలో రహస్యంగా చొరబడే అవకాశం రాలేదు కదా? అనుశాసనానికి భంగం కలగలేదు కదా? నా పనులలో ఇతరులకన్న అధికుడనని భావించే అహంకారం మారువేషంలో నాపై పెత్తనం చెలాయించలేదుకదా?

ఈ విరాట్ యోజన పూర్తయితీరుతుంది. ఈ అగ్ని పరీక్ష సమయంలో మీ శరీరం, మనస్సు, వ్యవహారణ బెసకలేదు కదా అని మాత్రమే మీరు పరీక్షించుకోవాలి. ఉన్నతమైన కార్యాలను ఎప్పుడూ ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వారే చేస్తారు. పొడుగు కావడంవల్ల ఎవరూ ఉన్నతులు కారు. శ్రమ, ఏకాగ్రత, త్యాగం, అహంకార రాహిత్యం– ఇవే మనిషిని ఉన్నతుణ్ణి చేస్తాయి. తర్వాతి కార్యక్రమం ఉన్నతమైనది. మీ ఉన్నతి అందుకు తగ్గదనే ఆశతో, విశ్వాసంతో ముందడుగువేస్తున్నాను. ఈ విషమ సమయంలో మీలో ఎవ్వరూ వెనుకబడకూడదు, ఆ తర్వాత అందుకు పశ్చాత్తాపపడవలసి రాకూడదు.

★★★

## మానవీయతకు మచ్చుతునక

*"నాయనా తీసుకో. ఇవి రెండు మిఠాయిలు. పెద్దది నీవు తిను. చిన్నదాన్ని నీ మిత్రుడికి ఇవ్వు." వస్తానమ్మా.*

*ఆ బాలుడు మిఠాయిలను తీసుకుని బయటికి తన మిత్రుని దగ్గరికి వెళ్లాడు. పెద్ద మిఠాయి అతనికి ఇచ్చి, చిన్నది తాను తినసాగాడు. తల్లి గుమ్మంలో ఉండి ఇదంతా చూచింది. అతనిని లోపలికి పిలిచి అలా ఎందుకు చేశావని అడిగింది.*

*"అమ్మా ! ఇతరులకు ఎక్కువ ఇచ్చి నాకోసం వీలైనంత తక్కువ తీసుకోవడంలోనే నాకు ఆనందం కలుగుతుంది." తల్లి ఆలోచనలో పడింది.*

*ఆ బాలుడు బాల గంగాధర తిలక్.*

*వాస్తవానికి మానవీయత ఇదే. ఇందులోనే విశ్వశాంతి ఇమిడి ఉంది. మనిషి తన కోసం తక్కువ కోరుకుని, ఇతరులకు ఎక్కువ ఇవ్వడానికి ప్రయత్నిస్తే– సంఘర్షణలన్నీ సమసిపోతాయి, స్నేహ సౌజన్యాల సామ్రాజ్యం స్థాపితం అవుతుంది.*

**వ్యక్తిత్వం అనే మొక్కకు ఎరువు సద్గుణాలు, నీరు సత్యవ్రతం.**

# ప్రజ్ఞాపరిజనులకు ఏడు మహావ్రతాలు

ప్రజ్ఞాపరిజనులు ఆత్మకళ్యాణం, లోక కళ్యాణం అనే రెండు బాధ్యతలను నిర్వహించాలి. ఇందుకోసమై వారు తమ వ్యక్తిత్వాలను మరింత పవిత్రంగా, తీక్షణంగా, క్రమబద్ధంగా తీర్చిదిద్దుకోవాలి. కొన్ని సద్గుణాలను పెంపొందించుకోవడానికి నిరంతరం కృషి జరపాలి. ఆ గుణాలు ఇవి-

## 1. లక్ష్యం, ఆలోచనా విధానం

పరమేశ్వరుడు ప్రసాదించిన అద్భుత బహుమతిగా జీవితాన్ని పరిగణించాలి. సృష్టికర్త నిర్మించిన విశ్వమనే ఉద్యానవనాన్ని మరింత సంస్కృతీయుతంగా రూపుదిద్దడం జీవిత లక్ష్యం. ఈ కృషిలో ఆత్మ కళ్యాణం, లోక కళ్యాణం రెండూ సిద్ధిస్తాయి.

మహా మానవులము కావాలనే ఆకాంక్ష మనలో పెంపొందాలి. వాసన-తృష్ణల, లోభ-మోహాల భవ బంధనాలలో చిక్కుకోవద్దు. సదాశయాలనే ఆకాశంలో సత్ ప్రవృత్తులనే రెక్కలను చాచాలి. జీవన ముక్తులవలె పరమ లక్ష్య సాధనకు ఉద్యమించాలి. వెనుదిరిగి చూడవద్దు. వర్తమానాన్ని సంబాళించండి. భవిష్యత్తు గురించి ఆలోచించండి.

జ్ఞానయోగిలా ఆలోచించండి. కర్మయోగిలా కార్యశూరత చూపండి. భక్తియోగిలా సహృదయతను వర్షించండి. పతన పరాభవాలను జయించడానికి ఈ లక్షణాలను వినియోగించండి.

ఉదయం నిద్రలేవగానే- ఒక రోజు జన్మ అని ఆలోచించాలి. రాత్రి నిద్రిస్తూనే- ఒక రాత్రి మరణం అని ఆలోచించాలి. ఆ అవకాశాన్ని మహత్తరంగా సద్వినియోగపరచడానికై నిండు హృదయంతో నిర్ణయాలు తీసుకోవాలి. మహాప్రజ్ఞయొక్క అవతరణలో మీరు భాగస్వాములు కావాలి. ప్రజ్ఞా ఉద్యమంలో పాల్గొనాలి. ప్రతిరోజూ కనీసం మూడు మాలల గాయత్రీ జపం, సవితా ధ్యానం శ్రద్ధగా చేయాలి. ఇందులో తేడా రాకూడదు.

## 2. శ్రమించే లక్షణం

సమయమే జీవితం. కనుక- ప్రతి క్షణం క్రమబద్ధమైన విధులలో శ్రమించాలి. సోమరితనాన్నీ, నిర్లక్ష్యాన్నీ శత్రువులుగా పరిగణించాలి. వాటిని దరిజేరనివ్వకూడదు. ఈ విషయంలో అలవాట్లను స్వయంగా మార్చుకోవాలి. ఉదాసీనంగా, ఉపేక్షతో, నెమ్మదిగా, అర్ధమనస్కంగా పని జరగడం లేదు కదా అని నిశితంగా పరిశీలించాలి. పనిలో తగు తత్పరతనూ, స్ఫూర్తినీ కనబరచాలి. సమయం, శ్రమ, ఏకాగ్రతల ద్వారానే పని మెరుగవుతుంది, సఫలమవుతుంది.

ఏ పనినీ చిన్నపనిగా పరిగణించకండి. చేపట్టిన పనిని సమయానికి, సక్రమంగా, యావచ్ఛక్తినీ ఉపయోగించి నిర్వహించడం ప్రతిష్ఠకు సంబంధించిన విషయంగా పరిగణించండి. తీరిక దొరికితే- మరొకరు పనిచెపుతారని ఎదురుచూడకుండా స్వయంగా పనిని వెదకండి. పరిసరాలలోని అవ్యవస్థను తొలగించే పని ఎక్కడయినా పుష్కలంగా దొరుకుతుంది. పనిలో ఉత్సాహం చూపడం, ముందుకు దూసుకుపోవడం - ఇవి ప్రగతికి కొలబద్దలు.

## 3. సువ్యవస్థ

సౌందర్యాన్ని ఉపాసించండి. పరిశుభ్రత, నిరాడంబరత, మంచి అభిరుచి- వీటి సమ్మేళనమే సౌందర్యం. మన శరీరం, బట్టలు, నివాసం, కార్యక్షేత్రం- వీటిలో మురికి, అందవికారం, అస్తవ్యస్తత ఉన్నామేమో నిశితంగా పరిశీలించండి. వాటిని వెనువెంటనే తొలగించండి- వాయిదా వేయకుండా.

సహచరులకు సువ్యవస్థనూ, క్రమబద్ధతనూ అలవరచండి. ఈ పని వినయంగా, సద్భావనతో చేయండి. తప్పులు ఎన్నడం వల్ల, వ్యంగ్యంవల్ల కటుత్వం ఏర్పడుతుంది. రాత్రి త్వరగా నిద్రించాలి. ఉదయం త్వరగా నిద్రలేవాలి. డైరీ వ్రాయాలి. మన సమయం, శ్రమ, ఆలోచన, ధనం, ప్రభావం సద్వినియోగం అవుతున్నాయా,

పువ్వులా వికసించు.

దుర్వినియోగం అవుతున్నాయా, అసలు వినియోగం కావడం లేదా అనే విషయాలను వివరంగా నమోదుచేయాలి. అవ్యవస్థను వెదకి, దానిని సహసంతో తొలగించాలి. అలవాట్లను సమీక్షించాలి. వాటిని మరింత ప్రగతిశీలంగా మలచాలి.

పథకం ప్రకారం పనిచేయాలి. ఆయా సంఘటనలను అన్ని కోణాలనుండీ పరిశీలించాలి. మార్పులను గురించి ఆలోచించాలి. సాధనాలను సమీకరించాలి. సహకారాన్ని పొందాలి. ఇవే వ్యవస్థా బుద్ధిలోని అంతర్భాగాలు. వ్యవస్థపట్ల ఈ శ్రద్ధ స్థాయిని పెంచుతుంది, గౌరవాన్ని అందిస్తుంది, సాఫల్యాన్ని సాధిస్తుంది.

## 4. శిష్టాచారం

ఇతరులను గౌరవించడం, మాటలో వ్యవహారణలో వినయం- ఇదే శిష్టాచారం. ఈ సత్ ప్రవృత్తిని మన స్వభావంలో అంతర్భాగం చేసుకోవాలి. విచ్చలవిడితనం తగదు. విశృంఖలత్వం పతనానికి దారితీస్తుంది. ఇతరుల విమర్శలకు తావిస్తుంది. ఎప్పుడయినా విశృంఖలత్వం తలెత్తితే- మిమ్మల్ని మీరు శిక్షించుకోవాలి.

కలుసుకున్నపుడూ, వీడ్కోలు సమయంలో శిష్టాచారాన్ని పాటించాలి. మనస్సును ఆహ్లాదకరంగా ఉంచుకోవాలి. చిరునవ్వు నవ్వడం అలవరచుకోవాలి. అలసటను కాని, ఉదాసీనతను కాని కనబడనివ్వకూడదు. తక్కువ మాట్లాడు. పెత్తనం చెలాయించకు. 'నేను' కు బదులు 'మనమంతా' శబ్దాన్ని వాడాలి. తాబేదారు పని చేయకు. అయితే సజ్జనుల పట్ల సముచితమైన సద్ వ్యవహరణలో లోటు రానీయకు. ఆవేశం, ఉద్వేగం, కర్కశత్వం, దిగులు, పొలికేకలు తగవు. చెప్పవలసింది ప్రశాంతంగా, మర్యాదగా చెప్పాలి. తిట్లు వాడకూడదు. కోపగించకూడదు. శిష్టాచారానికి భంగం కలగకుండా ఎదటి వ్యక్తిని సంస్కరించాలి. తొందరపాటు నిర్ణయాలు తగవు. వాస్తవాలను వివరించడానికి ప్రయత్నించాలి. మంచి చెడులను బేరీజువేసి నిర్ణయాలు తీసుకోవాలి.

పౌర బాధ్యతలను నిర్వహించాలి. సామాజికమైన కట్టుబాట్లను పాటించాలి. విమర్శించవద్దు. వ్యంగ్య బాణాలు విసరవద్దు. నిందించవద్దు. సంస్కరణ అవసరమైనప్పుడు ఆత్మీయతతో ఆ పని చేయాలి. లాభ నష్టాలను వివరించాలి. సలహా ఇవ్వాలి.

## 5. సంయమనం

శ్రమ, సమయం, ఆలోచన, ధనం, ప్రతిభ- అనే మన సామర్థ్యాల ప్రాముఖ్యాన్ని గుర్తించాలి. వాటిని సద్వినియోగపరచాలి. వాటిలో ఒక కణమయినా వృధాకాకూడదు. వృధాచేయడం ఉజ్వల భవిష్యత్తును నాశనంచేసుకోవడమే.

ఇంద్రియ సంయమనాన్ని పాటించాలి. జిహ్వా చాపల్యాన్ని వదులుకోవాలి. కాముక చింతన వల్ల కలిగే హానిని గుర్తించాలి. దినచర్యను నిర్ణయించుకోవాలి. దాన్ని అక్షరాలా పాటించాలి. ఒళ్లు దాచుకోవద్దు. సోమరితనం తగదు. స్వాధ్యాయాన్ని అలవాటుచేసుకోవాలి. ఆత్మ-నిర్మాణ యోజనను తయారుచేయడానికై మనస్సును చింతన-మననములలో నిమగ్నం చేయాలి. దురాలోచన కలుగగానే- దానితో పోరాడడానికై సదాలోచనల సేనను సన్నద్ధం చేయాలి. రోజూ జమా ఖర్చులు వ్రాయాలి. అయితే, మంచి పనుల విషయంలో పిసినారితనం తగదు. కూడబెట్టవద్దు. అయితే, ఆదాయంకన్న ఖర్చు తక్కువగా ఉండాలి. కొంత మిగల్చాలి. అప్పు చేయడం అలవాటు కాకూడదు. సంపర్క క్షేత్రంలో దుష్ట ప్రవృత్తులు తగ్గేందుకూ, సత్ ప్రవృత్తులు పెరిగేందుకూ మీ ప్రభావం ఉపయోగపడాలి. 'సాదా జీవితం- ఉదాత్త ఆలోచన' - అనే సూత్రాన్ని అనుక్షణం గుర్తుంచుకోవాలి. విలాసాల, ఆడంబరాల జోలికి పోవద్దు. వాటివల్ల వ్యక్తిత్వం దిగజారుతుంది. అనుకరించేవారు పతనమవుతారు.

అలవాటయిన దుష్ట సంస్కారాలను వెదకి పట్టుకోవాలి. సంకల్ప శక్తితో వాటిని నిర్మూలించాలి. ఈ పనిలో కఠోరతను చూపడం, మనస్సును అదుపుచేయడం, ప్రతికూలతను సహించడం- ఇదే తపస్సు. తపస్సుద్వారా, సంయమనం ద్వారా మనిషి శక్తిశాలి అవుతాడు.

**చందనంలా గుబాళించు.**

## 6. ఉదారత, ఆత్మీయత

ఆత్మనిర్మాణం కోసం అంతర్ముఖుడవు కావాలి. లోచూపు అలవరచుకోవాలి. అయితే ఏకాకివి కాకూడదు. కలివిడితనంతో జీవించు. కలసిమెలసి పనిచెయ్యి. పంచి తిను. నేను సమాజ శరీరంలోని ఒక అవయవాన్ని – అని భావించు. అందరి ఉన్నతిలో నీ ఉన్నతి ఉన్నదని తెలుసుకో. సంకుచిత స్వార్థపరత్వాన్ని వదులుకో. ఆలోచనలో, వ్యవహారణలో కుటుంబ భావనను ప్రతిబింబించు.

సామూహికతలో శక్తీ, ప్రగతీ ఉన్నాయి. సహకార భావనను అంతటా అమలుజరుపు. పరస్పర సహకారాన్నీ, ఇచ్చిపుచ్చుకోవడాన్నీ ఆచరణలో పెట్టు. అయితే ఇది సదాశయాలకే వినియోగపడాలి.

ఆత్మీయత పరిధిని విస్తరించు. దేశం, ధర్మం, సమాజం, సంస్కృతి– అన్నింటినీ ప్రేమించు. అందరూ నా వాళ్లు నేను అందరివాడిని– అని భావించు. ఈ ఆత్మ విస్తరణ ఆచరణలో సేవా సాధన అవుతుంది. ఉదారంగా వ్యవహరించు. అందుకు ప్రతిఫలంగా– ఆత్మ–సంతృప్తినీ, సమాజ గౌరవాన్నీ, దైవ అనుగ్రహాన్నీ సంపాదించు.

## 7. దూరదృష్టి, వివేకం

దూరదృష్టితో కూడిన వివేకం ఆధారంగా సముచితమని భావించిన కట్టుబాట్లనూ, ఆచారాలనూ మాత్రమే పాటించు. ప్రజా శ్రేయస్సును వాంఛించు. అయితే ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోవద్దు. జనం ప్రస్తుతం అవాంఛనీయత వైపే పయనిస్తున్నారు. ఆ ప్రవాహంలో కొట్టుకుపోవద్దు. ప్రతి సందర్భంలో న్యాయ దృష్టిని అమలుపరచాలి. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా ధైర్యంగా ముందంజ వేయాలి. ఒక కంటిలో ప్రేమ ఉండాలి; మరో కంటిలో సంస్కరణ ఉండాలి. ఔచిత్యాన్ని సమర్థించు. అనౌచిత్యంతో విభేదించు. దానితో సహకరించకు. సాధ్యమైతే దాన్ని వ్యతిరేకించు, దానితో పోరాడు. ఈ విధానాన్ని నీపట్ల అనుసరించు, ఇతరుల పట్లకూడ అనుసరించు. బంధు మిత్రుల అవాంఛనీయతలను సమర్థించవద్దు.

నేడు సామాజిక ఆచారాలలో అనైతికత, మూఢ నమ్మకం, అవాంఛనీయత నిండిఉన్నాయి. తలక్రిందులు అయినదానిని తిరిగి తలక్రిందులు చేసి సరిచేసే విధానాన్ని అనుసరించాలి. ఇందుకోసం నైతికమూ, బౌద్ధికమూ, సామాజికమూ అయిన విప్లవం అవసరమని గుర్తించాలి. అందుకు ఉద్యమించాలి. ఆత్మ సంస్కరణలో తపస్విగా ఉండాలి. కుటుంబ నిర్మాణంలో మనస్విగా ఉండాలి. సామాజిక పరివర్తనలో తేజస్విగా ఉండాలి. అవినీతితో నిండిన వాతావరణంలో మౌన ప్రేక్షకుడుగా మిగిలిపోకూడదు. శౌర్యాన్నీ, సాహసాన్నీ చూపాలి. అవినీతి నిర్మూలనలో, ఉత్కృష్టతను పెంచడంలో అవక్ర పరాక్రమాన్ని ప్రదర్శించాలి.

## జనసంపర్కంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

ప్రజాసేవా రంగంలో ప్రవేశించే ప్రజ్ఞా పరిజనులు కొన్ని విధి నిషేధాలను పాటించవలసి ఉంటుంది. సేవా కార్యం మహత్తరమైనది. ప్రజాసేవకుని వ్యక్తిత్వం ఉత్కృష్టంగా ఉండడం ముఖ్యం. ఇతరులను ప్రభావితం చేయడానికీ, మార్చడానికీ, సంస్కరించడానికీ, ఉద్ధరించడానికీ జరిగే కృషి మిషన్‌కు ప్రజాదరణను సంపాదించడంలో తగు పాత్ర వహిస్తుంది. చింతనపై, శీలంపై, స్వభావంపై ఆధారపడిన ప్రజాసేవకుని వ్యక్తిత్వానికి మరింత ప్రముఖ పాత్ర ఉంటుంది. ప్రజ్ఞా పరిజనులూ, యుగశిల్పులూ ఈ ప్రాథమిక అవసరాన్ని పూర్తిచేయవలసి ఉంటుంది. ఈ సందర్భంలో స్థూలమైన విధి నిషేధాలు కొన్ని–

1. ఎవరి ఇంటికయినా వెళ్లినప్పుడు తన జిహ్వా చాపల్యాన్ని ప్రదర్శించకూడదు. 2. మహిళలతో ఏకాంతంగా మాట్లాడకూడదు. వారికి ఏదైనా చెప్పవలసివస్తే– దృష్టిని క్రిందకు దించి మాట్లాడాలి. 3. జమా ఖర్చులు అద్దంలా స్వచ్ఛంగా ఉండాలి. ముట్టిన పైకానికి రసీదు ఇవ్వాలి. ఖర్చును ప్రమాణాలతో సహా నమోదు చేయాలి. 4. సంభాషణలో, వ్యవహరణలో నమ్రత, ఇతరులపట్ల గౌరవం ప్రతిబింబించాలి. 5. వేష భాషలలో నిరాడంబరత్వం ఉండాలి.

★★★

క్రోధం సాక్షాత్తు యమధర్మరాజు.

# ప్రజ్ఞా పరిజనులకు ఏడు నియమాలు

జూన్ 1971లో పూజ్యగురుదేవులు తాము అనిశ్చిత కాలమునకు హిమాలయ యాత్రకు వెళ్తూ, అదే సమయంలో వందనీయ మాతాజీ కూడా మథుర వదలి పెట్టి శాంతికుంజ్ హరిద్వార్‌లో నివసించుటకు నిర్ణయించి ఉండగా– తమ అనుచరులకు ఏడు అనివార్య నియమాలు ప్రకటించారు.

## 1. సంస్థ నిర్మాణం

యుగ నిర్మాణ ఉద్యమంలోని ప్రతి సభ్యుడు, ప్రతి శాఖ నేరుగా శాంతికుంజ్‌తో సంబంధం కలిగిఉండాలి. క్షేత్రీయ, ప్రాంతీయ సంస్థలను విడిగా ఏర్పాటుచేయకూడదు. పరస్పర సహకారం పరవాలేదు. కానీ మధ్యంతర శాఖలను సహజంగా వ్యక్తిగత ఆకాంక్షల పూర్తికి, కేంద్రంతో పోటీకి ఏర్పాటు చేస్తూ ఉంటారు. ఈ ప్రయత్నాలను పూర్తిగా నిరుత్సాహపరచాలి. కేంద్రమును సమర్థవంతం చేయబోతున్నాము. భవిష్యత్తులో చేస్తూ ఉంటాము. అది భారతదేశములోనే కాక సమస్త విశ్వానికి ఒక చోటు నుండి సముచిత సూత్ర సంచాలనం చేయగలుగుతుంది.

అప్పటికీ ఇప్పటికీ మన మిషన్‌ను అనుసరించే వారి సంఖ్య చాలా పెరిగింది. సంస్థ యొక్క ప్రాంతీయ విభాగాలు, శాఖలు, మండలాలు, పీఠములు స్థాపితమైనాయి. అయినప్పటికీ ఈ తథ్యం నేడు కూడా తన స్థానంలోనే ఉన్నది. ఎవరి కెవరూ అధీనంలో లేరు. అందరికీ నేరుగా కేంద్రంతో సంబంధం పెట్టుకునే అధికారం ఉన్నది. క్షేత్రీయ పరిస్థితులు ఆవశ్యకతల ననుసరించి పరస్పర సహకారంతో సంఘటితమై కార్యాలు చేసే విభాగాలు శ్రేయస్సుకు పాత్రములని చెప్పవచ్చు. అన్ని చోట్ల సమర్థ సహకార తంత్రం ఏర్పాటుకు ప్రయత్నించడం కోరదగినది.

## 2. గురుదీక్ష

సమర్థ గురుదీక్ష ఇవ్వగలిగిన యోగ్యులెవరనీ మా అనుచరులుగా వదలివెళ్లడం లేదు. అసమర్థమైన వ్యక్తి ఈ మహోన్నత బాధ్యత తన భుజముల కెత్తు కుంటే నడుము విరుగుతుంది. ఆశ్రయించినవారు మునిగిపోతారు. భవిష్యత్తులో గాయత్రీ మంత్రం గురుదీక్ష తీసుకోవలసిన అవసరం ఏర్పడితే ఎర్ర కాగడా ప్రతీకను గురువుగా భావించాలి. ఈ సంస్కార సంకల్పాన్ని ఏ వ్యక్తి అయినా చేయించవచ్చు. కానీ, అతడు స్వయంగా గురువు కాలేడు.

ఏ విధంగా సిక్కులలో గురుగ్రంథసాహబ్‌ను రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్‌లో ధ్వజాన్ని గురురూపంగా స్వీకరిస్తారో– అదే విధంగా గాయత్రీ పరివార్ యుగ నిర్మాణ ఉద్యమంలో 'ఎఱ్ఱకాగడా' గుర్తును గురు రూపంలో గుర్తించాలి. యుగశక్తి రూపంలో అవతరించిన ఆదిశక్తి గాయత్రీ యొక్క దీక్ష గురుతత్త్వం యొక్క ఈ ప్రతీక ద్వారా ఇవ్వబడుతుంది. ఈ సందర్భంగా గుర్తుంచుకోవలసిన విషయాలు–

1. ఇది గాయత్రీమహావిద్య యొక్క దీక్ష అని చెప్పబడుతుంది.

2. వేదమాత, దేవమాత గాయత్రిని విశ్వమాత రూపంలో అందరికీ అందుబాటులోకి తెచ్చిన ఈ యుగ విశ్వామిత్రులు వేదమూర్తి తపోనిష్ఠ యుగ ఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్య ఈ విద్య యొక్క ఆచార్యులు. శ్రద్ధాళువులకు వారి సూక్ష్మ కారణ సత్తాల సంరక్షణ ప్రాప్తిస్తుంది. వారి ప్రాణ, తప, పుణ్యముల ఒక అంశ లభిస్తుంది. దివ్య చేతనతో మిళితమైన పరిణామాలు ఉత్పన్నమవుతాయి.

3. స్థూల రూపంలో కర్మకాండ నిర్వహించేవారు, మంత్రము వల్లించే పరిజనులు ఈ విద్యలో సహకరించే గౌరనీయ సహకారులని చెప్పుకోవచ్చు.

**నీ మెదడును చల్లగా ఉంచు.**

## 3. సమ్మేళనం-యజ్ఞం

యుగ నిర్మాణ సమ్మేళనాలు ఎంత పెద్దవైనప్పటికీ వాటిలో చేసే గాయత్రీ యజ్ఞాలు సాధారణంగా తొమ్మిది కుండములకు మించనక్కరలేదు. ఎక్కడైనా ప్రత్యేక కారణం వల్ల ఆలా పెద్ద యజ్ఞం చేయడం అనివార్యమైతే మాతా భగవతీదేవి ప్రత్యేక అనుమతి తీసుకోవాలి. పెద్ద పెద్ద యజ్ఞాల వలన ఎంత లాభమున్నదో అంత గందరగోళానికి అవకాశమున్నది. కనుక కొద్ది కుండములతో చేసే మధ్యేమార్గాన్ని అనుసరించడంలో దూర దృష్టి ఉంది.

యజ్ఞ ప్రణాళిక వెనుక గురుదేవుల యొక్క కొన్ని సునిశ్చిత ఉద్దేశ్యములున్నాయి- 1. యజ్ఞీయ జ్ఞాన విజ్ఞానాలను లుప్తం కాకుండా కాపాడి లోకోపకారకములుగా చేయడం. 2. యజ్ఞ ప్రణాళికల ద్వారా జీవితంలోని యజ్ఞీయ అనుశాసనాలను జనసామాన్యానికి పరిచయం చేయడం, ప్రశిక్షణ ఇవ్వడం. 3. యజ్ఞంతోపాటు సమ్మేళనం జరిపి, జ్ఞాన యజ్ఞందారా జరిపి భావ విప్లవాన్ని విస్తరింపచేయడం.

సామూహిక యజ్ఞ ప్రణాళికలతో పైన చెప్పిన ఉద్దేశ్యములు పూర్తిఅవుతూఉంటాయి. అందుకే పూజ్య గురుదేవులు చివరగా సమాజంలో యజ్ఞీయ ప్రేరణ నివ్వడానికి దీపయజ్ఞాలతో కూడిన సమ్మేళనాల క్రమము నడుపుటకు ఆదేశించారు. దీపయజ్ఞాల ద్వారా ఈ ఉద్దేశ్యం కుండీ యజ్ఞముల కంటే ఎక్కువ ప్రభావంతంగా నెరవేరుతుంది. కుండీయ యజ్ఞాలను కేవలం సామూహిక సాధనల పూర్ణాహుతిగా సాధకులు తమ సాధనాలతోనే నిర్వహించాలి.

**4. యజ్ఞాచార్యులు :** యజ్ఞాచార్యులనే ప్రత్యేక పదవి ఉండక్కరలేదు. యుగ నిర్మాణ సమ్మేళనంతో ఏ యజ్ఞం జరుగుతుందో దానిని మేము సూక్ష్మ రూపంలో సంరక్షిస్తాము. దాని కొరకు ప్రత్యేకంగా ఏ యజ్ఞాచార్యుడు-బ్రహ్మ యొక్క అవసరం లేదు. ఎవరికి విధి విధానం చక్కగా వస్తుందో వారు ఈ పనిని నిర్వర్తించగలరు.

**5. కలశయాత్ర :** కలశయాత్ర విసర్జన వంటి ఊరేగింపులను గాయత్రీ మాత, ఎర్రకాగడా ప్రతీకలను చక్కగా అలంకరించి ప్రారంభించాలి. అది వ్యక్తి ప్రాధాన్యతా ఊరేగింపు కారాదు. ఈ నియమం వలన అనావశ్యక అహంకార, ఈర్ష్య, ద్వేషాలకు అవకాశముండదు.

**6. ఆశీర్వాదం :** వరదానం ఇచ్చే, కోరే ప్రక్రియ వ్యక్తిగతరూపంలో ఉండకూడదు. ఈశ్వరునికి వ్యక్తికి మధ్య దళారి అక్కరలేదు. ఎవరిలో సామర్థ్యం లేదో వారు ఈ ప్రక్రియను నిర్వర్తిస్తే అది ఒక మోసమే కాగలదు. మా అనుయాయులలో ఎవరూ ఇటువంటి మిథ్యా ప్రలోభాలతో ఎవరినీ భ్రమింపచేసే ప్రయత్నం చేయకూడదు.

**7. దానము-దక్షిణ :** వ్యక్తిగతంగా ఎవరూ దానము-దక్షిణ తీసుకొనకూడదు. అవసరమైతే వారు సంస్థ నుండి తీసుకోవచ్చు. ఇచ్చేవారు కూడా వ్యక్తికి కాకుండా సంస్థకు ఇవ్వాలి. దీనితో భిక్షాటన, పరిగ్రహం, దీనత్వం వంటి అనేక దుష్ప్రవృత్తుల వ్యాప్తి ఆగిపోతుంది.

జనులు శ్రద్ధాపూర్వకంగా దానమిచ్చినదానిని లోక కళ్యాణకారక ఉద్దేశ్యాలకే వినియోగించాలి. వ్యక్తిగత అవసరాలకు దానం తీసుకొనే పరంపర ప్రజా సేవకులను శ్రద్ధా పాత్రుల స్థానం నుండి దయాపాత్రుల స్థానానికి చేర్చుతుంది. వాని సాధన, సదాశయాల గురించి ప్రశ్నార్థకం ఏర్పడుతుంది. పై అనుశాసనాన్ని అంగీకరించినడిస్తే ప్రజా సేవకులకు ప్రామాణికత ఉండి వారి నిర్వహణా వ్యవస్థ సహజంగా జరిగిపోతుంది. ఈ ధన ప్రధాన యుగంలో అర్థానుశాసనం యొక్క ఈ సూత్రాన్ని విశేష జాగరూకతతో అనుసరించవలసి ఉంది.

★★★

నీ రక్తాన్ని వేడిగా ఉంచు.

# ప్రజ్ఞా యోగానికి నాలుగు సోపానాలు

ప్రజ్ఞాయోగానికి రెండు సంధ్యలు అత్యధిక సరళం, మహత్తరం అయినవి. ఒకటి ఉదయం మంచంపైనే ఉండి కళ్లు తెరుస్తూనే పది పదిహేను నిముషాలపాటు "ప్రతిరోజూ కొత్తజన్మ" అనే భావన కలిగి ఉండడం. రెండవది రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమించే సమయంలో శయనించడం ఒక విధమైన మరణమనే భావనను అనుభవించడం. జనన మరణాలు జీవితానికి మొదలు, తుది. వీటిని క్రమంగా ఉంచగలిగితే మధ్యఉన్న భాగం సఫలం అవుతుంది. విత్తనాలు నాటటం, పంట కోయటం అనేవి రైతుల సామాన్య ప్రక్రియలు. మేలుకోవడాన్ని ప్రాతఃకాల సంధ్యగా, శయనాన్ని రాత్రి సంధ్యగా చెప్పవచ్చు. సూర్యోదయ సూర్యాస్తమయాలను ఉభయ సంధ్యలుగా పరిగణిస్తారు. వాటితో ముడిపడిన ఆధ్యాత్మిక సాధనను ప్రాతఃకాలం కళ్లు తెరచే సమయంలో చేయవచ్చు.

ప్రజ్ఞాయోగంలోని ప్రథమ సాధన ఆత్మబోధ. కళ్లు తెరవగానే 'నేడు నాకొక కొత్త జన్మ. ఒకరోజు మాత్రమే జీవిస్తాను. రాత్రి మరణంఒడిలోకి చేరాలి. మధ్యఉన్న కాలాన్ని సర్వోత్తమంగా ఉపయోగించడమే జీవన సాధన లక్ష్యం. ఇదే నా పరీక్ష క్రమం. దీనిలోనే భవిష్యత్తు మొత్తం నిండి ఉన్నది'- అని భావనచేయాలి.

జన్మలన్నింటిలో మానవ జన్మ అదృష్టకరమైనది. దీని సదుపయోగమే ఉన్నత స్థాయి జ్ఞానానికి రుజువు. నిద్రలేస్తూనే, ఈ రోజు ఒక పూర్తి జీవితం - అని ఆలోచన చేయాలి. ఈ జన్మను ఏ ప్రయోజనం కోసం విధాత మనకు అప్పగించాడో ఆ ఉపయోగకరమైన పనులను మాత్రమే చేయాలి. ఈవిధంగా రోజంతా జరిపే దినచర్యను ఈ సమయంలోనే నిర్ధారణ చేసుకోవాలి. ఆలోచన, శీలం, వ్యవహారణల రూపురేఖలను తయారుచేసుకుని జాగ్రత్తగా పూర్తి చేయడం వల్ల ఈ రోజు ఈ విలువైన జన్మ పూర్తిగా సార్థకం కావాలి - ఈ ఆలోచనలోని అన్ని కోణాలను గురించి యోచించడానికి ఎంత ఎక్కువ సమయం పట్టినా అది తక్కువే. దీన్ని నిత్యం నియమిత రూపంలో ఆచరిస్తే, పదిహేను నిముషాలు సరిపోతాయి. ఆ రోజులో మిగిలిన పనేమైనా ఉంటే అది మరునాడు పూర్తి చేయవచ్చు.

రాత్రి నిదురపోయే ముందు రెండవ సంధ్య పూర్తి చేయవచ్చు. అందులో ఇపుడు మృత్యువు ఒడిలోకి వెళ్తున్నట్లు భావించాలి. ఈ సమయంలో - ఒకరోజు జీవితాన్ని ఏవిధంగా సదుపయోగం చేశావో భగవంతుని సభలో జవాబు ఇవ్వాలి. దీనికోసం ఆ రోజులో జరిగిన కార్యకలాపాల, ఆలోచనల ఉన్నతి, అధోగతులను సమీక్ష చేయాలి. వాటి ఉద్దేశ్యాన్నీ, స్థాయినీ నిష్పాక్షికంగా పరీక్షించాలి. వాటిలో ఏవి సవ్యంగా జరిగాయి. ఏ తప్పులు, వైరుధ్యాలు జరిగాయి- అని తెలుసుకోవాలి. సవ్యంగా జరిగినవాటికి తనను తాను ప్రశంసించుకోవాలి. జరిగిన తప్పును మరునాడు సవరించే ఆలోచన చేయాలి. శాస్త్రం ప్రకారం- పాపానికి ప్రాయశ్చిత్తం జరిగిన నష్టాన్ని భర్తీ చేయడమే. గడచిన ఈ రోజును తిరిగి తీసుకురాలేము. కాని దానికి ప్రాయశ్చిత్తం మరునాడు చేసుకోవచ్చు. మరునాటి కార్యకలాపాలలో ఈ రోజు చేయలేనిదాన్ని కలపాలి. ఈ విధంగా కొంత భారం పెరుగుతుంది. కాని లోపాన్ని సరిదిద్దుకునేందుకు మరోదారి లేదు. మృత్యువు అనివార్యం. మనుషులు ఈ విషయాన్ని మర్చిపోతారు. పసిపిల్లలవలె పనికిరాని పనులు చేస్తారు. ఎనభై నాలుగు లక్షల జన్మలలో భవిష్యత్తును ఉజ్వలంగా చేసే ఈ పనులు చేయాలి; దేవమానవ స్థాయిని చేరే ఆకాంక్షను కలిగి ఉండాలి. మనల్ని అనుకరించే ప్రేరణ ఇతరులకు కలిగే విధంగా జీవించాలి; మనం మన బాధ్యతను నిర్వహించిన రుజువు లభించి, విధాత సంతోషించాలి. అది ఆధారంగా మనకు ఉన్నత స్థితి లభించాలి.

**జీవితం ఒక పుష్పం. ప్రేమ అందులోని మకరందం.**

రాత్రి ఏ విధంగా నిశ్చింతగా నిద్రపోతామో, అదే విధంగా మరణం తరువాతి సమయం నుంచి పునర్జన్మ వరకు గల కాలంలో అదే విధంగా శాంతితో ఉండడానికై ఈ రోజులలోనే సన్నాహాలు చేయాలి. పగలు సుఖ సంతోషాలతో గడిస్తే, రాత్రి గాఢమైన నిద్ర పడుతుంది. రోజు శాంతంగా, శ్రేష్టంగా గడిపితే, మరణం తరువాతి కాలంలో నరకాన్ని అనుభవించవలసి రాదు. స్వర్గతుల్యమైన శాంతిని ఆస్వాదించవచ్చు. ఈ ప్రక్రియయే తత్వబోధ.

ప్రజ్ఞా యోగంలో పగలు పూర్తిచేయవలసిన పనులు ఇంకా రెండు ఉన్నాయి. మొదటిది భజన, రెండవది మననం. భజన కోసం కాల కృత్యాలు నిర్వర్తించిన తరువాత పూజా స్థలంలో పద్మాసనంలో కూర్చోవాలి. శరీరం, మనసు, వాణి శుద్ధికావడం కోసం జలం ద్వారా పవిత్రీకరణం చేసుకుని, ఆచమనం చేయాలి. దైవ విగ్రహం, గాయత్రి పటం, ధూపదీపాలు- వీటిలో ఏదో ఒక చిహ్నాన్ని స్థాపించి దానినే ఆరాధ్య దైవంగా భావించాలి. ధూపం, దీపం, నైవేద్యం, జలం, అక్షతలు, పుష్పాలలో ఏవి లభిస్తే వాటితో పూజ చేయాలి. పూజ కుపయోగించే ఈ సాధనాలలోని విశేషతలు జీవితంలో ఉత్పన్నం కావాలని భావనచేయాలి. చందనం పరిసరాలను సుగంధంతో నింపుతుంది. దీపం తన ప్రభావ పరిధిలో జ్ఞానమనే ప్రకాశాన్ని వ్యాపింపచేస్తుంది. పుష్పాలు నవ్వుతూ వికసిస్తూఉంటాయి. జలం శీతలతకు గుర్తు. అక్షతలు, నైవేద్యం వెనుక పరమార్థ ప్రయోజనం కోసం కేటాయించే సమయదానం, అంశదానాల భావన ఉంది. ఇష్ట దైవాన్ని సత్ప్రవృత్తుల సమూహంగా పరిగణించాలి. ఈ విశ్వాసాలు ఆధారంగా దైవపూజ సమగ్ర మవుతుంది.

ఇప్పుడు జప, ధ్యానాల వంతు వస్తుంది. రెండూ ఒకేసారి జరుపవచ్చు. గాయత్రి జపం మానసికంగానైనా చేయవచ్చు. ఎంతసేపు చేయాలని నిశ్చయించుకొన్నారో దాని లెక్క గడియారం ద్వారా కాని, మాల ద్వారా కాని చేయవచ్చు. ఎవరికైనా వేరే మంత్రం ఇష్టమైతే, దానినే జపించవచ్చు. ఓంకారం సర్వత్రా జపంగా పరిగణించ బడుతోంది.

జపంతో పాటు ప్రాతఃకాలంలో ఉదయిస్తూన్న సూర్యుడిని ధ్యానంచేయాలి. తెరచిన తన శరీరం సూర్యునికి ఎదురుగా కూర్చొనిఉన్నట్లు భావనచేయాలి. సూర్యుని సూక్ష్మ కిరణాలు తన స్థూల, సూక్ష్మ కారణ శరీరాలలోనికి ప్రవేశిస్తూన్నట్లు భావనచేయాలి. కిరణాలు బలానికీ, కాంతికీ ప్రతీకలు. బలం అనగా శక్తి. కాంతి అనగా ప్రకాశవంతమైన ప్రజ్ఞ. రెండింటి సమన్వయం మూడు శరీరాలలో ప్రవేశించి వాటిని ప్రభావితం చేస్తూన్నదని భావన చేయాలి. స్థూల శరీరంలో ఆరోగ్యం, సంయమనం, సూక్ష్మ శరీరం అనగా మస్తిష్కంలో వివేకం, సాహసం, కారణ శరీరం అనగా అంతఃకరణలో శ్రద్ధ, సద్భావన సూర్య కిరణాల రూపంలో ప్రవేశించి, అస్తిత్వంలోని మొత్తం శక్తిని ప్రేరేపిస్తున్నాయని భావనచేయాలి. ఈ ధ్యాన ధారణ, మంత్ర జపం కలిపి నియమితంగా, నిర్ణీత సమయం వరకు జరపాలి. చివరకు పూర్ణాహుతిలో సూర్యుని కెదురుగా జలం అర్ఘ్యం ఇవ్వాలి. దీని తాత్పర్యం- పరమాత్ముని శక్తి సముఖంలో జల రూపంలో ఆత్మశక్తిని సమర్పణచేయడం. భజనలోని భావన ఇదే. నియమిత స్థానంలో కూర్చొనడానికి వీలుకాని పక్షంలో, ప్రయాణంలో- ఈ కృత్యాలన్నీ ఏ వస్తువులనూ ఉపయోగించకుండా మానసికంగా చేయవచ్చు.

ప్రజా యోగంలోని నాలుగవ అడుగు మననం. ఇది మధ్యాహ్నం తరువాత ఎక్కడైనా ఎప్పుడైనా చేయవచ్చు. సమయం 15 నిముషాలైనా సరిపోతుంది. ఇందులో మన వర్తమాన స్థితిని సమీక్షించాలి. ఆదర్శాల కొలబద్దతో పరీక్షించినపుడు ఏదైనా లోపం కనపడితే, దానిని పూరించే ప్రణాళికను తయారుచేయాలి. ఇదే మననం. దీని కోసం ఏకాంత స్థలాన్ని వెదకాలి. కళ్లు మూసుకుని అంతర్ముఖుడవు కావాలి. ఆత్మసత్తా యొక్క క్షాళనకూ, సంస్కరణకూ పథకాన్ని రూపొందించాలి. ఇందులో నేటి దినాన్ని ప్రధానంగా పరిగణించాలి. ప్రాతఃకాలం నుంచి మధ్యాహ్నం వరకు చేసిన ఆలోచనలను, పనులను ఆదర్శాల గీటురాయిపై పరీక్షించాలి. ఆ సమయం నుండి నిద్రపోయేంతవరకు ఏమేమి చేయాలో భావనాత్మక ప్రణాళికలు తయారుచేయాలి. అలా చేస్తే- ఆ రోజులోని తొలి సగం కంటే మలి సగం మరింత మెరుగవుతుంది.

**కృతజ్ఞత కరువయితే బ్రతుకు బరువు అవుతుంది.**

ఆత్మ సమీక్షకు నాలుగు కొలబద్దలు ఉన్నాయి. 1. ఇంద్రియ సంయమనం. 2. సమయ సంయమనం. 3. అర్థ సంయమనం. 4. ఆలోచనా సంయమనం. ఈ నాలుగింటిలో ఎక్కడైనా, ఏదైనా క్రమభంగం జరిగిందేమో చూడాలి.

నాలుక రుచికోసం తినకూడనివాటిని తినడంలేదు కాదా ! వాణి ద్వారా చౌకబారు సంభాషణ చేయటం లేదు కదా? కాముక ప్రవృత్తి, కుదృష్టి పెరగడం లేదు కదా? అసంయమనం వలన శరీరం, మెదడు బోలు కావడం లేదు కదా?

సమయ సంయమనం అనగా ఒక్కొక్క క్షణాన్ని సదుపయోగంచేయడం. సోమరితనం, పొరపాట్లు, దుర్వ్యసనాలు, దుర్గుణాల విష వలయంలో చిక్కుకుపోయి ఏ కొద్ది సమయ భాగమైనా వ్యర్థం కారాదు. సమయాన్ని రక్షించడంలో, సదుపయోగం చేయడంలో పూర్తి జాగ్రత్త వహించాలి. సమయమే జీవితం. సమయాన్ని సదుపయోగం చేసినవాడే జీవితాన్నుంచి పరిపూర్ణ లాభం పొందుతాడు.

మూడవ సంయమనం– అర్థ సంయమనం. ధనాన్ని నిజాయితీగా, శ్రమచేసి సంపాదించాలి. ఉచితంగా దేనినీ పొందకూడదు. ఎవరినీ మోసగించకూడదు. సగటు భారతీయుని స్థాయిలో జీవించాలి. "సాదా జీవితం, ఉదాత్త ఆలోచనలు"– అనే నీతిసూత్రాన్ని అనుసరించాలి. విలాసాల ప్రదర్శన అనే మూర్ఖత్వంకోసం కొద్దిగా అయినా ఖర్చుచేయకూడదు. దురాచారాలపై ధనాన్ని వృధా చేయరాదు. పొదుపుచేసిన దానిలో ఎక్కువ భాగం పరమార్థ కార్యాల కోసం ఉపయోగించడం, పుణ్యం సంపాదించడం వంటి ప్రయోజనాలు వివేకంతో సముచితంగా ఖర్చు చేసే వారికే లభిస్తాయి.

నాలుగవ సంయమనం– ఆలోచనా సంయమనం. మెదడులో ఎల్లప్పుడూ ఆలోచనలు కలుగుతూ ఉంటాయి; కల్పనలు ఉదయిస్తూఉంటాయి. ఇవి అంతు లేకుండా, అస్తవ్యస్తంగా అనైతికంగా లేకుండా ఉండాలంటే– వివేకాన్ని కావలివానివలె ఉపయోగించాలి. దాని పనేమిటంటే– చెడు ఆలోచనలను మంచి ఆలోచనలతో పారద్రోలడం; అనాగరికమైన ఆలోచనల స్థానంలో నిర్మాణాత్మక చింతనను స్థాపించడం. ఆలోచనలు మనిషిలోని మహత్తర శక్తులు. అవి కర్మలుగా పరిణతి చెంది, పరిస్థితులుగా వెలికివస్తాయి. జీవితం కల్పవృక్షం అవుతుంది. కనుక– చింతనను నిర్మాణాత్మకమైన ఉన్నత స్థాయి ఆలోచనలపై మాత్రమే లగ్నంచేసిఉంచాలి.

సాధన, స్వాధ్యాయం, సంయమనం, సేవ అనే నాలుగు పురుషార్థాలతోనే జీవితంలో ప్రగతి, సఫలత సిద్ధిస్తాయి. అందువలన దినచర్యలో ఈ నాలుగింటికీ సముచిత స్థానం ఇవ్వాలి. ఆత్మ సమీక్ష సమయంలో వాటిని నిరంతరం పరీక్షచేయాలి. ఆత్మ సమీక్ష, ఆత్మ సంస్కారం, ఆత్మ నిర్మాణం, ఆత్మ వికాసం అనే నాలుగు ప్రక్రియలకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వడానికై మధ్యాహ్న కాలంలో మనన సాధన చేయాలి. ఇదే ఆత్మదర్శనం. ఇది ఇంకా వికసించి, ఈశ్వర దర్శనంగా ఫలిస్తుంది.

★★★

## కోటి సామూహిక గాయత్రీ జప యజ్ఞం

**24 లక్షల సామూహిక గాయత్రీ యజ్ఞం 2007 మే 13న ప్రారంభమయింది. పూర్ణాహుతి 2008 మే 12న జరుగుతుంది. యజ్ఞంలో పాల్గొనగోరే సాధకులు దిగువ సూచనలను గమనించాలి –**

1. **ప్రతి రోజూ తమ ఇంటిలోనే ఒక మాలకు తక్కువ కాకుండా గాయత్రీ జపం చేయాలి. మధ్యలో ఒకోరోజున జపం చేయలేకపోయినా పరవాలేదు.**
2. **వారానికి ఒకసారి కార్డుద్వారా దిగువ చిరునామాకు తమ జప సంఖ్యను తెలుపాలి –**
   **గాయత్రీ జ్ఞాన మందిరం, హనుమాన్ దేవస్థానం, దాసారం బస్తీ, సంజీవరెడ్డి నగర్, హైదరాబాదు – 500 038.**

స్వర్గమనే దివ్య సామ్రాజ్యం - నీ భావనలోనే విరాజమానం.

వార్తలు

# క్షేత్రంలో 1008 ప్రజ్ఞామండలుల స్థాపన నరసరావుపేట సమావేశంలో నిర్ణయం

నరసరావుపేట పరిసర ప్రాంతాలలో 1008 ప్రజ్ఞామండలులను, మహిళా మండలులను స్థాపించాలని నరసరావుపేటలో అక్టోబరు 17న జరిగిన గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్తల సమావేశంలో నిర్ణయించారు. నరసరావుపేటలో నవంబరు 17,18,19 తేదీలలో జరుగనున్న 3000 మంది గాయత్రీ సాధకుల సాధనా శిబిరంకోసం జరగవలసిన సన్నాహాలను సమావేశంలో చర్చించారు.

జనజాగరణ కోసమై రఖోలా(సంచీ) గ్రంథాలయాలను ప్రారంభిస్తామని 50 మంది సమావేశంలో సంకల్పం తీసుకున్నారు. పదివేల రూపాయల యుగ సాహిత్యాన్ని వారు ఖరీదు చేశారు. శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేదిజీ కార్యకర్తలచేత ఆ సంకల్పం చేయించారు.

శ్రీ అశ్విని సుబ్బారావు తమ ప్రసంగంలో ప్రజామండలులు, మహిళామండలులు నిర్వహించవలసిన కార్యక్రమాలను వివరించారు.

రాష్ట్రమంతటిలో అయిదువేలమంది గాయత్రీ సాధకులను తయారు చేసిన విశిష్ట ప్రజ్ఞాపుత్రుడు డాక్టర్ మారెళ్ల శ్రీరామకృష్ణ సమావేశంలో కార్యకర్తలకు మార్గ దర్శనం చేశారు. కొత్త సంవత్సరంలో 1008 మందిని యుగశక్తి గాయత్రి పత్రిక చందాదారులుగా చేర్పిస్తామని కార్యకర్తలచేత వారు సంకల్పం చేయించారు.

# విజయనగరంలో 24 కుండముల గాయత్రీ యజ్ఞం

విజయనగరం శంకరమఠంలో అక్టోబరు 7న 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది. శ్రీ డి.ఎస్.ఏ.ఎన్. రాజు, శ్రీమతి దంతులూరి పద్మావతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మంత్రివర్యులు శ్రీ బొత్స సత్యనారాయణ, పార్లమెంటు సభ్యులు శ్రీమతి ఝాన్సీ దంపతులు ఆధ్వర్యం వహించారు. రిటైర్డ్ డి.ఎస్.పి. శ్రీ వి. రామారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మీసాల గీత యజ్ఞానికి విచ్చేశారు. గురువుగారు కోట పంతులుగారు ఆశీస్సులు అందించారు. యజ్ఞంలో 200 మంది పాల్గొని భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీమతులు ఎమ్. రూపవాణి, హారతి, శ్రీయుతులు చంద్రశేఖర్ జైన్, యశ్వంత్, ఫూల్ సింగ్, రాజు, రామనాథ్ యజ్ఞ నిర్వహణలో సహకరించారు.

### గమనిక

*పత్రికకు మనియార్డరు ద్వారా చందా పంపేవారు ఆ ఫారమ్ ( space for communication)లో పిన్ కోడు నంబరుతోసహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నంబరును తప్పక వ్రాయగలరు. చందాను పొడిగించేవారు తమ కంప్యూటర్ కోడ్ నంబరును కూడ వ్రాయగలరు. మనియార్డరులు పంపేవారు ఆ పైకాన్ని దేనికోసం పంపుతున్నారో స్పష్టంగా వ్రాయవలసి ఉంటుంది.*

**తీరికల్లో కాపుర ముంటాయి కోరికలు.**

# హైదరాబాదు సాధనా శిబిరంలో 24 మందికి వానప్రస్థం

హైదరాబాదు కూకట్‌పల్లిలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో అక్టోబరు 12 నుండి 21 వరకు జరిగిన తొమ్మిది రోజుల సంజీవని సాధనా శిబిరంలో 24 మంది సాధకులు వానప్రస్థ సంస్కారాన్ని స్వీకరించి, గాయత్రి ప్రచార ప్రసారాలకు తమ జీవితాలను అంకితంచేస్తామని సంకల్పం చేశారు. శిబిరంలో 200 మంది పాల్గొన్నారు.

శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేదిజీ, గాయత్రీ పరివార్ రాష్ట్ర సంయోజకులు శ్రీ అశ్విని సుబ్బారావు, శాంతికుంజ్‌కు సమర్పితులైన వరిష్ఠ సాధకులు డాక్టర్ మారెళ్ల శ్రీ రామకృష్ణ శిబిరంలో జీవించే కళపై ప్రవచనాలు ఇచ్చారు.

డాక్టర్ మారెళ్ల శ్రీ రామకృష్ణ, కూకట్‌పల్లి మునిసిపాలిటీ మాజీ చైర్మన్ శ్రీ సిహెచ్. హనుమంతరావు, హైకోర్టు న్యాయవాది శ్రీ ఎమ్. విశ్వనాథ ప్రసాద్, శ్రీమతి విజయ, శ్రీ పెంటయ్య, శ్రీ ఇంద్రసేనారెడ్డి, వివేకానంద కాలేజి డైరెక్టర్ శ్రీ నరేశ్ శిబిర నిర్వహణలో విశేష సహాయ సహకారాలను అందించారు.

## గుడివాడలో నవరాత్రి అనుష్ఠానం

గుడివాడ శాఖ కన్వీనర్ 'యుగమిత్ర' శ్రీ కె.ఓ.వి.ఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీదేవీ నవరాత్రుల లఘుఅనుష్ఠానం దిగ్విజయంగా నిర్వహించబడింది. 9 రోజులూ ఉదయం గాయత్రీ చాలీసా, హారతి, దివ్య ప్రవచనాలు జరిగాయి. సాయత్రం కూడ చాలీసా-హారతి-దేవీభాగవతంలోని పంచమస్కంధ పఠనాదులతో మనోరంజకంగా సత్కాలక్షేపం జరిగింది. ఈ కార్యక్రమంలో 40 మంది సాధకులు పాల్గొనగా, పరిజనులు అమితోత్సాహంతో ఆలకించారు.

చివరి రోజు పూర్ణాహుతిలో అశేషభక్త జనం శ్రద్ధాసక్తులతో ఆహుతులు సమర్పించారు. ఈ శుభ సందర్భంలో రాబోయే నవరాత్రుల లోగా 108 యజ్ఞాలు నిర్వహించాలనీ, వాడ వాడలా ప్రజ్ఞాపీఠములను స్థాపించాలనీ, "చెట్లునాటుట-సంరక్షణ" లో భాగంగా తులసిమొక్కలను ఉచితంగా పంపిణీ చేయాలని కార్యకర్తలు సంకల్పం చేశారు.

## సిద్ధిపేటలో 9 కుండముల గాయత్రీ యజ్ఞం

సిద్దిపేట మార్కెట్ యార్డు ముందు ప్రముఖ వ్యాపారవేత్తల సంకల్ప బలంతో ఎన్.రామిరెడ్డి గారి కృషి ఫలితంగా గాయత్రీ మహాయజ్ఞం ఇటీవల నిర్వహింపబడింది. శ్రీమతి అనసూయమ్మ యజ్ఞానికి ఆధ్వర్యం వహించారు. 150 మంది స్త్రీ పురుషులు యజ్ఞంలో పాల్గొని ధన్యులయ్యారు. జ్ఞాన ప్రసాదంగా "గాయత్రి ఉపాసన" పుస్తకాలను పంచిపెట్టటం జరిగింది.

## పిడుగురాళ్లలో దేవీనవరాత్రులు

దేవీ నవరాత్రుల సందర్భంగా స్వర్గీయ శ్రీమతి అరుణమ్మ గారి ఆత్మశాంతిని కోరి పిడుగు రాళ్లలో తొమ్మిది రోజులూ ఉదయం "గాయత్రీ యజ్ఞం", సాయంత్రం "గాయత్రీ చాలీసాపారాయణ" శ్రద్ధా భక్తులతో నిర్వహించారు. ప్రతిరోజూ 5 జంటల చొప్పున యజ్ఞంలో పాల్గొన్నారు. 24 మంది మహిళా కార్యకర్తలు శ్రద్ధాసక్తులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అరుణమ్మ గారు గాయత్రి పరివార్‌కు చేసిన అమోఘమైన సేవలను సంస్మరించుకుని వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 50 మందికి అన్నదానం చేశారు.

## భీమిలిలో శరన్నవరాత్రులు

భీమిలిలో శరన్నవరాత్రుల లఘు అనుష్టానం జరిగింది. శ్రీమతులు భారతి, లక్ష్మి ఆధ్వర్యం వహించారు. 50 మంది మహిళలు, 58 మంది కన్యలు పాల్గొన్నారు. పూర్ణాహుతిగా జరిగిన పంచకుండీయ యజ్ఞంలో వందమంది పాల్గొన్నారు.

★★★

**జాడ్యాలకు మూలం అలసత్వం - అదే అదే అవుతుందొక మహా జాడ్యం.**

# రాష్ట్ర గాయత్రీ పరివార్ చరిత్రలో కొత్త అధ్యాయం పదివేల ప్రజ్ఞామండలుల స్థాపనకు బృహత్‌పథకం

రాష్ట్ర గాయత్రీ పరివార్ చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. రాష్ట్రమంతటిలో పదివేల ప్రజ్ఞామండలుల, మహిళామండలుల స్థాపనకు బృహత్ పథకం అమలుజరుగుతోంది.

2012 లో హైదరాబాదులో అశ్వమేధయజ్ఞం జరుగనున్నది. అప్పటిలోగా రాష్ట్రంలో లక్షమంది కార్యకర్తలు నిర్మాణం కావాలని ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఆదేశించారు. ఆ ఆదేశం అమలుకు రూపొందిన మహత్తర పథకం ఇది.

పరమపూజ్య గురుదేవుల దివ్య సందేశాన్ని ఇంటింటికీ అందించే భవ్య పథకం ఇది. యుగ నిర్మాణం కోసం కదలిరావలసిందిగా ప్రతిభావంతులకు పిలుపు ఇస్తున్న మహత్తర పథకం ఇది. భావ విప్లవ సాధనద్వారా తమ జీవితాలను ధన్యం చేసుకొనగోరే ప్రజాపరిజనులకు అపూర్వ అద్భుత అవకాశం ఇస్తున్న బృహత్ పథకం ఇది.

**మహాకాలుని పిలుపు ఇది.**

**యుగ దేవత ఆహ్వానం ఇది.**

ఈ విశిష్ట పథకం వివరాలు ఇవి :

## గాయత్రీ ప్రజ్ఞామండలుల స్థాపన, నిర్వహణ

ప్రజ్ఞామండలి / మహిళామండలి గాయత్రీ పరివార్ పునాది, మూలస్థంభం. ప్రజ్ఞామండలులు, మహిళామండలులు ఎన్ని స్థాపించబడితే, ఎంత సమర్థంగా నిర్వహించబడితే- సంస్థ అంత వేగంగా పురోగమిస్తుంది, అంత దృఢంగా రూపొందుతుంది.

ఒక గ్రామంలో కాని, పట్టణంలోని ఒక పేటలో కాని కనీసం ఏడుగురు పరిజనులతో ప్రజ్ఞామండలిని ఏర్పాటుచేయాలి. ఈ సంఖ్య 40 వరకు పెరగవచ్చు. సంఖ్య ఇంకా పెరిగితే, మరో ప్రజ్ఞామండలిని ఏర్పాటుచేయాలి. ప్రజ్ఞామండలిలోని పరిజనులు వారానికి ఒకసారి నిర్ణీత స్థలంలో సమావేశం కావాలి. సమావేశం గంటన్నరలో పూర్తికావాలి. దానిలో దిగువ కార్యక్రమాలు జరగాలి.

| | |
|---|---|
| 1. ఓంకారం- 3 సార్లు<br>2. గాయత్రీ మంత్రం- 24 సార్లు<br>3. మహామృత్యుంజయ మంత్రం- 3 సార్లు | 7 ని॥లు |
| 4. స్వాధ్యాయం / సత్సంగం | 20-30 ని॥లు |
| 5. సేవ, సంస్కారాలు, పరివార్ వార్తలపై చర్చ;<br>6. సామూహిక మౌన గాయత్రీ జపం | 15 ని॥లు |
| 7. సత్సంకల్పాలు 18<br>జయఘోష హారతి<br>శాంతిమంత్రం | 10-15 ని॥లు |

ప్రజ్ఞామండలిలోని ప్రతి పరిజనుడూ రోజూ గాయత్రీ జపం చేయాలి. అంశదానంగా కొంత డబ్బు, పిడికెడు బియ్యం రోజూ స్వయంగా ఏర్పాటు చేసుకున్న కలశంలో వేయాలి. యుగశక్తి గాయత్రి మాసపత్రిక చదవాలి. ప్రజ్ఞామండలికి ఒక సంయోజకుడు, ఇద్దరు సహసంయోజకులు ఉండాలి.

అంశదానంగా అందే పైకాన్ని ప్రజ్ఞామండలి దిగువవిధంగా ఖర్చుచేయవచ్చు- యుగసాహిత్యంతో గ్రంథాలయ స్థాపన, నిర్వహణ, సేవా కార్యక్రమాల నిర్వహణ, యజ్ఞ, సంస్కారాల నిర్వహణ. కొంత సొమ్మును శాంతికుంజ్‌కు పంపవచ్చు.

పై సూచనలన్నీ మహిళామండలులకు కూడ వర్తిస్తాయి. మహిళామండలుల సమావేశాలలో స్వాధ్యాయం / సత్సంగాలలో భాగంగా గాయత్రి చాలీసా పారాయణ చేయవచ్చు. చదివిన అంశాలలో ఆచరణయోగ్యమైన వాటిని చర్చించుకోవడం అవసరం.

**ఆవు పెరిగినకొద్దీ కొమ్ములు పెరుగుతాయి - ధనం పెరిగినకొద్దీ ఆశ పెరుగుతుంది.**

## గాయత్రీ జ్ఞానమందిరాల స్థాపన, నిర్వహణ

పరమపూజ్య గురుదేవుల భావాలను ప్రజలలో వ్యాప్తిచేయడానికి ఉత్తమ సాధనాలు గాయత్రీ జ్ఞానమందిరాలు. పరిజనులు స్వయంగా కాని, మిత్రుల సహకారంతో కాని రూ॥ 5000 లనుండి రూ॥ 10,000 వరకు డబ్బు సమీకరించి, దానితో హైదరాబాదు గాయత్రీ చేతనాకేంద్రం నుండి యుగసాహిత్యాన్ని కొనుగోలుచేయాలి. ఆ సాహిత్యంతో తగు స్థలంలో జ్ఞానమందిరాన్ని ఏర్పాటుచేయాలి. చేతనాకేంద్రం సాహిత్యం కొనుగోలుపై 20% డిస్కౌంట్ ఇస్తుంది. జ్ఞానమందిరం గురించి క్షేత్రమంతటా విస్తృతంగా ప్రచారం జరగాలి.

యుగసాహిత్య ప్రసారానికై పరిజనులు వ్యక్తిగతంగా, జట్లుగా ఇంటింటికీ వెళ్లాలి. బస్సులలో, రైళ్లలో, పెళ్లిళ్లలో, జనం గుమిగూడే స్థలాలలో సాహిత్యాన్ని అమ్మడానికై ప్రత్యేకంగా కృషిచేయాలి.

### వివరణలు

1. మేము ప్రజ్ఞామండలిని స్థాపించదలచాము. దాని నియమ నిబంధనలు ఏమిటి? దాని రిజిస్ట్రేషన్ అవసరమా?

మొదటి ఏడుగురితో మండలిని ఏర్పాటుచేయాలి. స్త్రీలూ, పురుషులూ ఉంటే, అది ప్రజ్ఞామండలి అవుతుంది. మహిళలు మాత్రమే ఉంటే, అది మహిళామండలి అవుతుంది.

ప్రజ్ఞామండలిని రిజిస్టరు చేయించడానికి తీసుకోవలసిన చర్యలు- ప్రజ్ఞామండలి సంయోజకుని ఇద్దరు సహసంయోజకుల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లను ఇస్తూ, ప్రజ్ఞామండలిని రిజిస్టరు చేయించవలసిందిగా కోరుతూ ఒక ఉత్తరాన్ని శాంతికుంజ్, దక్షిణ భారత విభాగానికి పంపాలి. దాని ఒక ప్రతిని హైదరాబాదు గాయత్రీ చేతనాకేంద్రానికి పంపాలి. మరో ప్రతిని ఆఫీసు కాపీగా ఉంచుకోవాలి.

2. ప్రజ్ఞామండలిలో చేరడానికి అర్హతలు ఏవయినా ఉన్నాయా?

చదువుకున్నవారయినా, చదువురానివారయినా, ఏ కులంవారయినా ప్రజ్ఞామండలిలో చేరవచ్చు.

3. ఇతర సంస్థల సభ్యులు ప్రజ్ఞామండలిలో చేరవచ్చా?

చేరవచ్చు.

4. ప్రజ్ఞామండలిలో చేరడానికి సభ్యత్వరుసుము ఉందా?

లేదు.

5. అంశదానంగా డబ్బు, బియ్యం ఎంత ఇవ్వాలి?

ప్రతిరోజూ ఒక రూపాయి మించి ఎంతయినా ఇవ్వవచ్చు. వండడానికి తీసిన బియ్యం నుంచి పిడికెడు బియ్యం ఇవ్వాలి. మనం తినేదానినుండి కొంత భాగాన్ని సమాజానికి ఇవ్వాలనే భావన ఇందులో ఇమిడి ఉంది.

6. అంశదానం డబ్బును ఎవరికి ఇవ్వాలి?

వారానికి ఒకసారి కాని, నెలకొకసారి కాని మీ ప్రజ్ఞామండలికి ఇవ్వాలి. ఆ డబ్బు మండలి సంయోజకుని వద్ద ఉండాలి. లేదా సంయోజకుడు, సహసంయోజకుల జాయింట్ అకౌంట్‌గా బ్యాంకులో వేయాలి. ఆ ముగ్గురిలో ఏ ఇద్దరయినా ఆ అకౌంట్‌ను ఆపరేట్ చేసే వీలు ఉండాలి.

### ఆహ్వానం

ప్రజామండలుల ద్వారా యుగనిర్మాణం. ఇదే మన నినాదం. ఇదే మన ఊపిరి. ఇదే మన పథకం. ఇదే మన లక్ష్యం.

రండి. కదలిరండి. తరలిరండి. ఈ పథకాన్ని శరవేగంతో అమలుచేద్దాం. అందుకు సమయదానం ఇద్దాం. తద్వారా ఆదర్శవాదాన్నీ, కార్యశూరతనూ ప్రకటిద్దాం. పరమపూజ్య గురుదేవుల కృపను పొందుదాం. గాయత్రీ మాత ఆశీస్సులు అందుకుందాం. మన జీవితాలను సార్థకం చేసుకుందాం. దక్షిణ భారతానికి ఒరవడి దిద్దుదాం.

పథకం అమలుపై సమయదాతలు అవసరం అవుతారు. మూడు నెలలుకాని, ఆరునెలలుకాని సమయదానం ఇవ్వగోరే పరిజనులు తమ పూర్తి బయోడేటాను వ్రాసి హైదరాబాదు గాయత్రీ చేతనాకేంద్రానికి పంపాలి.

★★★

దురలవాటు దుస్నేహానికి నాంది.